


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 14

శనివారం 6-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

జాతీయస్థాయిలో

# నారాయణకు మాత్రమే సాధ్యం...

## వేరెవ్వరికైనా అసాధ్యం !

ప్రతీ సంవత్సరం **నారాయణ** ప్రోగ్రామ్స్‌తోనే

ఈ అపురూప ఘట్టాలు ఆవిష్కృతం !!

1st AIR RANK — NEET 2022 — TANISHKA

1st AIR RANK — JEE ADV - 2022 — RK. SHISHIR

1st AIR RANK — JEE MAIN - 2022 — BJAG MAHESHWARI

| Marks | Name |
|---|---|
| 715/720 | ARNAB PATI |
| 712/720 | SHASHANK |
| 710/720 | G GIRI VARSHITHA |
| 710/720 | SURYA PRATAP MISHRA |
| 710/720 | MEGH DHIRAJ C |
| 710/720 | LAKSHMI RASMITHA G |
| 710/720 | ANMOL RAWAT |
| 710/720 | PRAGATA GHOSH |

NEET ప్రిపరేషన్‌లో **నారాయణ** ను నమ్మారు, 2023 NEETలో **3128** మంది డాక్టర్లు అయ్యారు

## NEET 2023లో జాతీయస్థాయిలో టాప్ 10 లోపు ర్యాంకులు

| AIR | Name | No. |
|---|---|---|
| 3 | PIYUSH JHA | App. No. 230410882637 |
| 4 | SHASHANK SINHA | HT. No. 230410815258 |
| 7 | PRANJAL SINGH | HT. No. 230410699884 |
| 8 | PRAGATA GHOSH | HT. No. 230410006129 |
| 8 | ANKITA MANDAL | HT. No. 230410416872 |

## ALL INDIA OPEN CATEGORY RANKS BELOW TOP 500

19, 20, 31, 35, 51, 52, 62, 69, 88, 89, 123, 128, 150, 171, 191, 197, 219, 225, 255, 256, 269, 284, 301, 303, 339, 344, 360, 385, 388, 417, 439, 451, 458

వేసవి సెలవులు మీ పిల్లల భవిష్యత్తుకు పునాదులు

**నారాయణ STAR CO SUPER CHAINA**

10వ తరగతి పూర్తయిన విద్యార్థుల కోసం

ఫిజిక్స్ మరియు కెమిస్ట్రీ ఫౌండేషన్ తో డాక్టర్ సీటును ఈజీగా సాధించవచ్చు

ఇంటర్‌తో పాటే మెడికల్‌లో సీటు సాధించాలంటే మీ పిల్లల యొక్క డాక్టర్ కల సాకారం అయ్యేది

**నారాయణ STAR CO SUPER CHAINA NEET PROGRAMMEతోనే**

ప్రోగ్రామ్ ప్రారంభించు తేది: 04-04-2024

టాప్ ర్యాంక్ అయినా, టాప్ మార్క్ అయినా, ఏ జాతీయస్థాయి పోటీపరీక్ష అయినా...

## ఎవరూ ఢీకొట్టలేని...వేరెవ్వరూ దరిచేరలేని...ఆల్‌టైమ్ రికార్డ్ !

## నారాయణకు మాత్రమే సొంతం ! నారాయణతోనే ఇది సాధ్యం !!

JEE Main 2024 (Session-1)

6 గురు విద్యార్థులచే 300/300 మార్కులు

8 మంది విద్యార్థులచే 100 పర్సంటైల్

300/300 300/300 300/300 300/300 300/300 300/300

Overall 100 Percentile: AMOGH AGRAWAL, SHAIK SURAJ, ARYAN PRAKASH, M SAI TEJA, INHAN SAI PABBA, M ANOOP, H VEDITH, TANYA DINESH REDDY

Scan QR Code For Students' Testimonials

Scan QR Code For Admission

SRAMAYEVA JAYATHE


# NARAYANA EDUCATIONAL INSTITUTIONS

మీ IIT-JEE / NEET కలలను నారాయణ నిజం చేస్తుంది

మీ కలలే మా కలలు

Toll Free: 1800 102 3344 | /TheNarayanaGroup | www.narayanaschools.in | www.narayanagroup.com

drusya.in




సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 14

శనివారం 6-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**రైజర్స్... విన్నర్స్**
హైదరాబాద్‌కు మరో విజయం
6 వికెట్లతో చెన్నై పరాజయం - 12లో



**ఆర్‌బీఐ ఏడవ 'సారీ'**
కీలక వడ్డీ రేట్లలో మార్పులు లేవు
రెపో రేటు 6.5 శాతమే.. - 12లో



**5 న్యాయాలు.. 25 గ్యారంటీలు**
సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందు పలు సందర్భాల్లో ఇచ్చిన హామీలతో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేసింది.
వివరాలు 6లో ▸



**ఆ తర్వాతే ప్రధానిపై నిర్ణయం**
ఎన్నికల్లో నెగ్గిన తర్వాత తమ ప్రధానమంత్రి అభ్యర్థిని ఉమ్మడిగా నిర్ణయిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు.
వివరాలు 6లో ▸



**కేజ్రీవాల్ అరెస్ట్‌కు బీజేపీ కుట్ర**
ఢిల్లీ మద్యం కేసులో బీజేపీ సీనియర్ నేత కుట్ర పన్ని కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయించారని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు.
వివరాలు 6లో ▸




**ముంచుకొస్తున్న బర్డ్‌ఫ్లూ ముప్పు!**
అమెరికాలో హెచ్5ఎన్1 వేరియంట్ కేసు నమోదవగా ఇది కోవిడ్ తరహాలో డేంజర్‌గా మారొచ్చని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు.
వివరాలు 6లో ▸

# చంద్రబాబు కోసం బరితెగించొద్దు

## పచ్చమందకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వార్నింగ్

- 'ఈనాడు' 'ఆంధ్రజ్యోతి' హద్దులు మీరుతున్నాయి
- ఆ పార్టీల నేతలు నోటికొచ్చినట్లు వాగుతున్నారు
- దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం... ఈసీకి ఇప్పటికే ఫిర్యాదు చేశాం
- అందరిపైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం
- 'వీళ్లా ఐపీఎస్‌లు' కథనంపై మండిపడ్డ చీఫ్ సెక్రటరీ.. పరువునష్టం చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
- తమ కౌంటర్‌ను 'ఈనాడు' బ్యానర్‌గా వెయ్యాలని డిమాండ్.. ఎల్లో మీడియా అడ్డగోలు కథనాలపై ఐఏఎస్, ఐపీఎస్‌ల అసంతృప్తి
- ఒక వర్గానికి కొమ్ముకాస్తారా: పౌర సంఘాల ధ్వజం
- రామోజీ, పచ్చ మీడియా రాతలపై ఈసీ, ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు
- ఈసీ నియామకాలపైనా ఎందుకు అక్కసు?
- ఎస్పీలను ఈసీ బదిలీ చేస్తే ఆహా ఓహో అని పొగడ్తలు.. అదే ఈసీ కొత్త ఎస్పీలను నియమిస్తే మాత్రం దుష్ప్రచారం
- ఈసీ రాజ్యాంగబద్ధ సంస్థ.. రామోజీ జేబు సంస్థ కాదు.. ఒక్కో పోస్టుకు ముగ్గురి పేర్లతో జాబితా పంపిన సీఎస్.. ఆ జాబితాను పరిశీలించి ఎస్పీలను నియమించిన ఈసీ



సాక్షి, అమరావతి: ''వీళ్లా ఎస్పీలు?'' అంటే అర్థమేంటి రామోజీరావ్? ఎస్పీలు మీరు ఊహించినట్లు ఉండాలా? మీకు కావాల్సినట్లు ఉండాలా? ఇదెక్కడి దుర్మార్గం!. అత్యున్నత సర్వీసుల్లో పని చేస్తున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు అవినీతి అంటగట్టడం, ఎవరెవరు ఎక్కడెక్కడ పని చేయాలో కూడా మీరే నిర్దేశించటం.. ఆఖరికి ఎన్నికల కమిషన్ ఎవరిని నియమించాలో కూడా మీరే సిఫారసు చేయటం ఇదెక్కడి దౌర్భాగ్యం? అసలిది పత్రికేనా? ''వీళ్లా ఎస్పీలు?'' అంటూ శుక్రవారం 'ఈనాడు' పతాక స్థాయిలో ప్రచురించిన హీనాతిహీనమైన కథనంపై అటు ఐఏఎస్ అధికారులు, ఇటు ఐపీఎస్ అధికారులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'ఈనాడు' 'ఆంధ్రజ్యోతి' హద్దులు మీరుతున్నాయని, ఆ పార్టీల నేతలు నోటికొచ్చినట్లు వాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈసీకి ఇప్పటికే ఫిర్యాదు చేశామని తెలిపారు. అందరిపైనా చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ 'పచ్చ' మందకు ఐపీఎస్ అధికారులు వార్నింగ్ ఇచ్చారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిగా నిలుస్తున్న రాజ్యాంగబద్ధ సంస్థ కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ప్రతిష్టకు భంగం కలిగిస్తూ ఈనాడు పత్రిక దుష్ప్రచారపూరిత కథనాన్ని ప్రచురించడం దారుణం అని ఇంకో వైపు

మిగతా 8వ పేజీలో ▶



## 61.37 లక్షల మందికి రూ.1,847.85 కోట్లు

- 93.42% పింఛన్ల పంపిణీ పూర్తి
- చిత్తూరు, ఏలూరు, విశాఖ జిల్లాల్లో 95 శాతానికి పైగా పంపిణీ పూర్తి
- నేడూ కొనసాగనున్న పంపిణీ

9లో

**ఫ్యాక్ట్‌చెక్**

## పెళ్లి సాయంపైనా కుళ్లు రాతలు

- మాస్ మ్యారేజ్ స్కీమ్‌ను అమలులోకి తెచ్చిన దివంగత వైఎస్సార్
- 2015లో 'దుల్హన్'గా పేరు మార్చిన చంద్రబాబు
- రూ.177.96 కోట్ల బకాయిలు చెల్లించిన సీఎం వైఎస్ జగన్
- 56,194 జంటలకు రూ.427.27 కోట్ల లబ్ధి

7లో



## మా కోసం వచ్చాడు మా నాయకుడు

**దేశ రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టాలకు వేదికగా 'మేమంతా' సిద్ధం బస్సు యాత్ర**

- ఐదేళ్లు తమకు కాపు కాచిన సీఎం జగన్‌కు ఊరూరా.. అడుగడుగునా జనం నీరాజనం
- జననేతను చూసేందుకు.. కరచాలనం.. మాట కలిపేందుకు.. ఫొటోల కోసం ఆరాటం
- మండుటెండల్లోనూ గంటల తరబడి రోడ్డుపై జననేత కోసం ఓపిగ్గా నిరీక్షణ
- చంటి బిడ్డలను చంకనేసుకుని బస్సు వెంట పరుగులు తీస్తున్న తల్లులు
- కిలోమీటరు పరిధిలోనే ఐదారు సార్లు బస్సు దిగి ఆత్మీయంగా పలకరిస్తున్న సీఎం జగన్
- షెడ్యూలు సమయం కంటే రెండుమూడు గంటలు ఆలస్యంగా సాగుతున్న యాత్ర
- మధ్యాహ్నం భోజనం చేయకుండా ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకూ ప్రజలతో మమేకం
- అర్ధరాత్రయినా ఆత్మీయ నేత కోసం ఉప్పొంగుతున్న అభిమాన జనసంద్రం

2లో

## వీళ్లా.. అభ్యర్థులు!

**రోజురోజుకు బలహీన పడుతున్న తెలుగుదేశం**

- మరోపక్క సీఎం జగన్ బస్సు యాత్రతో మరింత కుదేలు
- ఎంత హంగామా చేసినా పార్టీ గ్రాఫ్ పెరగడంలేదని టీడీపీలో ఆందోళన
- పొత్తు ఖరారయ్యాక మరింత బలహీనపడ్డామంటున్న ఆ పార్టీ నేతలు
- 10 శాతం అభ్యర్థులనైనా మారుద్దామని నిర్ణయం
- 20 మందికిపైగా తెలుగుదేశం అభ్యర్థుల మార్పుపై కసరత్తు
- బీజేపీ, జనసేనకిచ్చిన కొన్ని సీట్లలోనూ మార్పులకు అవకాశం

10లో



## షర్మిలది నీచ రాజకీయం

- ఆమె రాజకీయంతో వైఎస్సార్ కుటుంబానికి తలవంపులు
- చంద్రబాబుతో కలసి సీఎం జగన్‌పై కుట్రలు చేస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ నేత వాసిరెడ్డి పద్మ

10లో

## చట్ట ప్రకారమే జిల్లాల ప్రధాన కేంద్రాల ఏర్పాటు

- ప్రభుత్వం చట్టాన్ని ఉల్లంఘించలేదు
- ఆ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేం
- సీజే నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం తీర్పు

9లో

## నిప్పుల కుంపటి!

- రాష్ట్రంలో పలు చోట్ల 44 డిగ్రీల నమోదు
- నేడు, రేపు మరింత పెరిగే అవకాశం

7లో



# ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

## ఒంటరి జీవితానికి ఆసరా దొరికింది



నా ఒంటరి జీవితానికి ప్రభుత్వం మంజూరు చేసిన ఆసరా పథకమే తోడైంది. చిరు వ్యాపారంతో నా కాళ్లపై నేను నిలబడేలా చేసింది. మాది పేద కుటుంబం. నేను మా భర్త, ఇద్దరు పిల్లలతో గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉంటున్నాం. కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాళ్లం. మా ఆయన మృతి చెందగా, ఇద్దరు పిల్లలకు వివాహాలు జరిగి అత్తారిళ్లకు వెళ్లిపోయారు. దీంతో నేను ఒంటరిగానే మిగిలాను. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పెన్షన్ మంజూరు చేయడంతో అదే జీవనాధారంగా ఉండేది. డ్వాక్రా మహిళా సంఘంలో సభ్యురాలిని కావడంతో వైఎస్సార్ ఆసరా మంజూరైంది. ఏడాదికి రూ. 22 వేల రూపాయలు చొప్పున నాలుగేళ్లలో రూ. 88 వేల రూపాయలు అందుకున్నాను. కూలి పనులు సరిగా ఉండకపోవడంతో పనులు మానేశాను. ప్రభుత్వం మంజూరు చేసిన ఆసరా డబ్బులతో ఇంటి వద్దే చీరల వ్యాపారం ప్రారంభించాను. దాంతో ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆనందంగా జీవిస్తున్నాను. సున్నా వడ్డీ పథకం ద్వారా రూ. 7 వేలు లబ్ధి పొందాను. మాలాంటి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– జ్యోతుల మోహిని, మంగళగిరి
(ఐవీ రెడ్డి, విలేకరి, మంగళగిరి)

## ప్రభుత్వ సహాయంతో చిరు వ్యాపారం



రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహాయంతో వ్యాపారం చేసుకుంటూ ఆర్థికంగా ఇబ్బంది లేకుండా మా కుటుంబం సంతోషంగా ముందుకు సాగుతోంది. కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపాలిటీ 30వ వార్డులో నివాసం ఉంటున్న నేను శ్రీసాయి మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. వైఎస్సార్ ఆసరా కింద నాకు ఇప్పటివరకూ రూ.19,460 ఆసరాగా వచ్చింది. వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి రూ.18,750 చొప్పున నా బ్యాంకు ఖాతాలో జమయింది. ఆ మొత్తంతో ఇంటి వద్దనే బట్టలు, ఫ్యాన్సీ సామగ్రి వ్యాపారం ప్రారంభించాం. పట్టణ పరిధిలోని మహిళా సంఘాల సభ్యులు నా వ్యాపారానికి సహకరిస్తున్నారు. వారికి అవసరమైన సరకులు నా షాపు వద్ద లభించే విధంగా ఏర్పాటు చేశాను. నా వ్యాపార అభివృద్ధికి మెప్మా సిటీ మేనేజర్ సుజాత తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. బ్యాంకు నుంచి తీసుకున్న అప్పును సకాలంలో వాయిదాలను చెల్లించడంతో సున్నా వడ్డీ వర్తిస్తోంది. మహిళలను వ్యాపారవేత్తలుగా ఎదగాలనే జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన మేరకు వ్యాపారం ప్రారంభించి హాయిగా ఉన్నాం.

– అల్లక కుమారి, సామర్లకోట
(అడపా వెంకటరావు, విలేకరి, సామర్లకోట)

## ఇన్నాళ్లకు సొంతిల్లు సమకూరింది



నా భర్త సుబ్బారావు వ్యవసాయ కూలీ. మాకు కార్తిక్, హేమను, స్వరూప్ అనే ముగ్గురు అబ్బాయిలున్నారు. మా అత్తమామలతో కలిసి మూడు కుటుంబాల వాళ్లం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో నివసిస్తున్నాం. నాకు 16 ఏళ్ల క్రితమే వివాహమైంది. ఒకే ఇంట్లో ఇరుకు గదుల్లో కాపురం చేస్తూ ఎంతో ఇబ్బంది పడ్డాం. మా ఆయన తెచ్చిన సంపాదనతో రోజువారీ జీవనమే కష్టమైపోతోంది. ఈ తరుణంలో సొంతిల్లు నిర్మించుకోగలిగే శక్తి మాకు లేదు. ఈ తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మా సొంతింటి కల తీరింది. గ్రామంలోనే ఇంటి స్థలం ఉచితంగా ఇవ్వడమే గాకుండా ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక సాయం చేశారు. దాంతో ఇల్లు కట్టుకున్నాం. ఇటీవల గృహ ప్రవేశం కూడా చేశాం. అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా ఇప్పటి వరకు రూ.40 వేలు అందింది. మేము ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కారణమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణ పడి ఉంటాం.

– బత్తిన మేరీ, రాచపల్లి
(ప్రగడ రామకృష్ణ, విలేకరి, ప్రత్తిపాడు రూరల్)

# మా కోసం వచ్చాడు నాయకుడు

**దేశ రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టాలకు వేదికగా 'మేమంతా' సిద్ధం బస్సు యాత్ర**

**ఐదేళ్లు తమకు కాపు కాచిన సీఎం జగన్‌కు ఊరూరా.. అడుగడుగునా జనం నీరాజనం**

- అక్కున చేర్చుకుని ఆత్మీయంగా పలకరించడంతో తన్మయత్వంతో మురిసిపోతున్న జనం
- మాటపై నిలబడిన నాయకుణ్ని జనం గుండెల్లో పెట్టుకుంటారనేందుకు ఇదే తార్కాణం
- యాత్రను చూస్తుంటే ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం కనిపిస్తోందంటున్న పరిశీలకులు

రామగోపాల్ ఆలమూరు – సాక్షి, అమరావతి



మేమంతా సిద్ధం బస్సు యాత్రలో గురువారం తిరుపతి జిల్లాలో మహిళా కూలీలతో సీఎం వైఎస్ జగన్

**ఏప్రిల్ ఒకటో తేదీ మధ్యాహ్నం 12 గంటలు...** శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండల కేంద్రానికి సమీపంలో అనంతపురం–కదిరి రోడ్డుపై సీఎం జగన్ బస్సు యాత్ర సాగుతోంది. పొలంలో వేరుశెనగ తొలగిస్తున్న మహిళలు మండుటెండలో పరుగులు తీస్తూ రావటాన్ని గమనించిన సీఎం జగన్ బస్సు ఆపి కిందకు దిగారు. 'అక్కా బాగున్నారా... పథకాలు అన్నీ అందుతున్నాయా? ఏమైనా ఇబ్బందులున్నాయా?' అంటూ ఆత్మీయంగా పలకరించారు. 'అన్ని పథకాలు అందుతున్నాయి.. సంతోషంగా ఉన్నాం.. మళ్లీ నువ్వే రావాలి జగనన్నా' అంటూ మహిళలు ముక్తకంఠంతో సీఎం జగన్‌ను దీవించారు. 'మీరు ఇచ్చిన స్ప్రింక్లర్ల వల్ల, ఆసరా, చేయూత, రైతు భరోసా ద్వారా అందించిన ఆర్థిక సాయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేరుశెనగ సాగు చేశాం.. మంచి దిగుబడి వచ్చింది.. ఇదిగో పండిన వేరుశెనగ కాయలు' అంటూ నాగేంద్రమ్మ అనే మహిళ విరగకాసిన వేరుశెనగ చెట్లను సీఎం జగన్‌కు ఆప్యాయంగా అందించింది. వాటిని సీఎం జగన్ సంతోషంగా తీసుకోవడంతో మురిసిపోయింది.

**ఏప్రిల్ మూడో తేదీ.. ఉదయం 11.45 గంటలు..** చిత్తూరు జిల్లా సదుం మండలం మతకువారిపల్లెకు సీఎం జగన్ చేసుకునేసరికి రోడ్డుకు ఇరువైపులా జనం బారులు తీరారు. అందరినీ పలకరిస్తూ.. అభివాదం చేస్తూ ముందుకు సాగుతుండగా 'జగనన్నా.. జగనన్నా' అంటూ ఓ మహిళ ఏడుస్తూ బిగ్గరగా పిలిచింది. అది చూసి బస్సు ఆపి కిందకు దిగిన సీఎం జగన్ ఆమె వద్దకు చేరుకుని ఏమైంది తల్లీ అంటూ పలుకరించారు. 'అన్నా.. నా కొడుకు ముఖేష్ పక్షవాతంతో బాధపడుతున్నాడు.. వైద్యానికి రూ.15 లక్షల ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు.. నువ్వే నా బిడ్డను రక్షించాలి....' అంటూ రోదిస్తున్న ఆ మహిళ కన్నీళ్లను తుడిచిన సీఎం జగన్.. 'తల్లీ నేనున్నా.. నీ బిడ్డకు ఎంత ఖర్చైనా వైద్యం చేయిస్తా. బాధపడొద్దు తల్లీ' అంటూ భరోసా ఇచ్చారు. తన ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ హరికృష్ణకు ఆ బాధ్యతలు అప్పగించారు. జగనన్న ఇచ్చిన భరోసాతో ఆ తల్లి గుండె కుదుటపడింది.

**ఏప్రిల్ మూడో తేదీ సాయంత్రం 4 గంటలు..** చిత్తూరు జిల్లా కల్లూరులో సీఎం జగన్ రోడ్ షో సందర్భంగా ఓ వ్యక్తి బిడ్డను భుజాన ఎత్తుకుని బస్సు వెంట పరుగులు తీస్తున్నాడు. ఆ చిన్నారి 'జగన్ మామా.. జగన్ మామా' అంటూ బిగ్గరగా పిలుస్తోంది. అది చూసిన సీఎం జగన్ బస్సు ఆపి డోర్ తీసి నిలబడ్డారు. సీఎం జగన్ వద్దకు చేరుకున్న ఆ చిన్నారి... మామా అంటూ ముద్దు పెట్టి మురిసిపోయింది. చిన్నారిని అక్కున చేర్చుకున్న సీఎం జగన్.. 'బాగా చదువుకో తల్లీ' అంటూ దీవించడంతో పట్టలేని ఆనందంతో కేరింతలు కొట్టింది.

**ఏప్రిల్ నాలుగో తేదీ.. మధ్యాహ్నం 12.30 గంటలు..** తిరుపతి జిల్లా ఏర్పేడులో రోడ్ షో ముగించుకుని ముందుకెళ్తున్న సీఎం జగన్ బస్సు వెంట ఓ యువకుడు రొప్పుతూ పరుగెత్తుతున్నాడు.. చెప్పులు తెగిపోవడంతో వాటిని వదిలేసి కాళ్లు కాలిపోతున్నా లెక్క చేయకుండా ఒక్క ఫోటో ప్లీజ్ జగనన్నా అంటూ పరుగులు తీస్తూ వస్తున్నాడు. ఇది గమనించిన సీఎం జగన్ బస్సు ఆపి ఆ యువకుడిని దగ్గరకు పిలవడంతో సెల్ఫీ తీసుకుని జై జగన్ అంటూ ఆనందం వ్యక్తం చేశాడు.

**ఏప్రిల్ నాలుగో తేదీ.. మధ్యాహ్నం 2 గంటలకు** తిరుపతి జిల్లా చిన్న సింగమలలో టాక్సీ, ఆటో డ్రైవర్లతో సీఎం జగన్ సమావేశమయ్యారు. 'జగనన్నా.. శ్రీకాళహస్తిలో ఏడేళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నా. నాకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. నాకు ముగ్గురు పిల్లలు.. మీరు ఇస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఇద్దరు పిల్లలను నర్సింగ్, ఒకరిని బీటెక్ చదివించుకోగలుగుతున్నా. నాలాంటి పేదల బతుకులు గొప్పగా మారాలంటే మళ్లీ నువ్వే రావాలి జగనన్నా.. నిన్నే తెచ్చుకుంటాం జగనన్నా' అంటూ జ్యోతి అనే టాక్సీ డ్రైవర్ ఆనందంగా చెప్పింది. తనకు సొంత ఆటో లేదని, రుణం సమకూర్చి ఆటో కొనివ్వాలని జ్యోతి కోరడంతో 'అక్కా.. బ్యాంకులతో టైఅప్ ద్వారా నీలాంటి వారికి పావలా వడ్డీకే రుణం ఇప్పించి సొంత ఆటో, టాక్సీ కొనిచ్చే ఏర్పాటు చేస్తాం' అంటూ సీఎం భరోసా ఇచ్చారు.

ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర సందర్భంగా కనిపించిన దృశ్యాల్లో ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. బస్సు యాత్రలో అడుగడుగునా ఇలాంటి ఆత్మీయ దృశ్యాలే సాక్షాత్కారిస్తున్నాయి. అందుకే బస్సు యాత్రను ఆత్మీయానుబంధాల సంగమంగా అభివర్ణిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల తొలి విడత ప్రచారానికి శ్రీకారం చుడుతూ వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని మహానేత వైఎస్సార్ ఘాట్ వద్ద నుంచి సీఎం జగన్ గత నెల 27న ప్రారంభించిన బస్సు యాత్ర రాయలసీమ (వైఎస్సార్, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి) జిల్లాల్లో పూర్తి చేసుకుని నెల్లూరు జిల్లాకు చేరుకుంది. శనివారం నెల్లూరు జిల్లాలో బస్సు యాత్రను సీఎం జగన్ కొనసాగించనున్నారు.

### రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టమిది

సీఎం జగన్‌కు జనం అడుగడుగునా నీరాజనాలు పలుకుతుండటంతో బస్సు యాత్ర రోజూ షెడ్యూలు సమయం కంటే రెండు గంటలు ఆలస్యంగా సాగుతోంది. సూరీడు నిప్పులు చిమ్ముతుండటంతో ఎండలు మండిపోతున్నా.. వడగాలులు ఇబ్బంది పెడుతున్నా.. రాత్రి పొద్దుపోయినా ప్రజలు లెక్క చేయకుండా సీఎం జగన్‌ను చూసేందుకు గంటల కొద్దీ రోడ్డుపై నిరీక్షిస్తున్నారు. తమ వద్దకు సీఎం జగన్ చేరుకోగానే ఆ అలసటను మరచిపోయి సంతోషంగా స్వాగతం పలుకుతున్నారు. సీఎం జగన్ ఆత్మీయ పలకరింపులతో జనం పులకించిపోతున్నారు. 'అవ్వాతాతా బాగున్నారా.. అక్కాచెల్లెమ్మా బాగున్నారా.. అన్నా బాగున్నారా' అంటూ పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారు. వైద్యపరంగా ఏవైనా సమస్యలుంటే వెంటనే సహాయం అందిస్తానని భరోసా ఇస్తూ అక్కడికక్కడే తన సహాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు. చిన్నారులను ఎత్తుకుని.. నుదిటిపై ముద్దులు పెడుతూ ఆశీర్వదిస్తుండటంతో సంబరపడుతున్నారు. రాజకీయాల్లో ఓ నాయకుడికి, ప్రజలకు మధ్య ఇలాంటి ఆత్మీయ అనుబంధాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. అందుకే సీఎం జగన్ బస్సు యాత్ర రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టంగా నిలుస్తుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### విశ్వసనీయతను చాటుకోవడం వల్లే

ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా వైఎస్ జగన్ అనుక్షణం ప్రజల పక్షానే నిలబడ్డారు. ఇచ్చిన మాటపై నిలబడి నిబద్ధతతో, నిజాయితీతో పని చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారు. కరోనా కష్టకాలంలోనూ ఏ ఒక్క పథకాన్ని నిలుపుదల చేయలేదు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చి రాష్ట్రాన్ని ప్రగతిపథాన నిలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ, జిల్లాలను పునర్ వ్యవస్థీకరించి పరిపాలనను వికేంద్రీకరించి ఇంటి గుమ్మం వద్దే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. సుపరిపాలనతో ప్రతి ఇంట్లో.. ప్రతి గ్రామంలో.. ప్రతి నియోజకవర్గంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ఐదేళ్లు తమకు కాపు కాచిన సీఎం జగన్ కోసం జనం ఆరాటపడుతున్నారు. తమ కోసం నిలబడ్డ నాయకుడిని కళ్లారా చూసేందుకు పరితపిస్తున్నారు. రాష్ట్రం, తమ భవిష్యత్తు మరింత గొప్పగా ఉండాలంటే జగనే మళ్లీ సీఎం కావాలని నినదిస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అందరికీ మంచి చేసిన సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం బలంగా నాటుకుపోయింది. బస్సు యాత్ర పొడవునా ఆత్మీయానుబంధాలను చాటిచెప్పే దృశ్యాలే దానికి నిదర్శనమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

### ఎన్నికలకు ముందే కనిపిస్తున్న ప్రభంజనం..

బస్సు యాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్ నిర్వహిస్తున్న రోడ్ షోలకు జనం పోటెత్తుతున్నారు. రాత్రి పొద్దుపోయినా పెద్ద ఎత్తున కదిలిస్తున్నారు. వైఎస్సార్ కడప, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రాత్రి పొద్దుపోయాక దువ్వూరు, చాగలమర్రి, ఆలూరు, ఆస్పరి, అనంతపురం బైపాస్ తపోవనం, రాప్తాడు, కదిరి, సోమల, చంద్రగిరి క్రాస్, చావలిలో నిర్వహించిన రోడ్‌షోలకు ఇసుకేస్తే రాలనంత స్థాయిలో జనం కిక్కిరిసిపోయారు. మా నమ్మకం నువ్వే జగన్.. జగనన్నే మా భవిష్యత్తు అనే నినాదాలతో బస్సు యాత్ర మారుమోగుతోంది. యాత్రలో భాగంగా ప్రొద్దుటూరు, నంద్యాల, ఎమ్మిగనూరు, మదనపల్లె, పూతలపట్టు, నాయుడుపేటలో నిర్వహించిన సభలు జనసంద్రాలను తలపించాయి. పేదింటి భవిష్యత్తు.. రాష్ట్ర భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు నేను సిద్ధం.. మీరు సిద్ధమా..? అంటూ సీఎం జగన్ పిలుపునివ్వడంతో సెల్‌ఫోన్‌లో టార్చ్‌లైట్ వెలిగించి చేతులు పైకెత్తి మేమంతా సిద్ధం అంటూ జనం నినదిస్తుండటంతో సభా ప్రాంగణం ఆకాశంలో చుక్కలను తలపించింది. వీటిని పరిశీలిస్తే సిద్ధం సభలతోపాటు పోటీపడుతూ మేమంతా సిద్ధం బస్సు యాత్రకు నీరాజనాలు పలుకుతున్నట్లు స్పష్టమవుతోంది. బస్సు యాత్రను చూస్తుంటే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని తేలిపోయిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

### మానవత్వపు పరిమళాలు..

బస్సు యాత్ర సాగుతున్న రోడ్డుకు ఇరువైపులా చిన్నారులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, అన్నదమ్ములు కిలోమీటర్ల కొద్దీ బారులు తీరుతున్నారు. పాలనకు మానవీయతను జోడించి సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్ తమ వద్దకు చేరుకోగానే బంతిపూల వర్షం కురిపిస్తూ ఆత్మీయ స్వాగతం పలుకుతూ అభిమానాన్ని చాటుకుంటున్నారు. అక్కచెల్లెమ్మలు సొంత అన్న తమ కోసం వచ్చినట్లుగా భావిస్తూ హారతులు ఇచ్చి నీరాజనాలు పలుకుతున్నారు. అవ్వాతాతలు సీఎం జగన్‌ను సొంత మనవడిలా భావిస్తూ దీవిస్తున్నారు. అన్నదమ్ములైతే జగన్ని నాదాలతో హోరెత్తిస్తున్నారు. సీఎం జగన్‌ను దగ్గరగా చూడాలని.. కరచాలనం చేయాలని.. మాట కలపాలని.. చిన్నారుల దగ్గర నుంచి అవ్వాతాతల వరకూ ఆరాటపడుతున్నారు. సీఎం జగన్ వారిని అక్కున చేర్చుకుని యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆత్మీయంగా పలకరించడంతో ఆనందపరవశులవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా జనం బారులు తీరుతుండటంతో సీఎం జగన్ కిలోమీటర్ పరిధిలోనే నాలుగైదు సార్లు బస్సు దిగి అందరినీ పలకరిస్తూ ముందుకు సాగుతున్నారు. మధ్యాహ్నం భోజనం సైతం చేయకుండా ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకూ ప్రజలతో మమేకం అవుతూ ప్రజల మధ్యే గడుపుతున్నారు.



# రాష్ట్ర ప్రజలంతా మళ్లీ జగన్ వైపే..

**శ్రీ మహారుద్ర సహిత రాజశ్యామల సహస్ర చండీయాగానికి ఎంపీ వైవీ సుబ్బారెడ్డి శ్రీకారం**



శ్రీమహారుద్ర సహిత రాజశ్యామల సహస్ర చండీ యాగంలో వైవీ సుబ్బారెడ్డి, ఆరిమండ తదితరులు

సాక్షి, అమరావతి: రెండోసారి మళ్లీ వైఎస్ జగనే సీఎం పీఠం అధిరోహించాలనే సంకల్పంతో వైఎస్సార్‌సీపీ నేతలు ఆరిమండ వరప్రసాదరెడ్డి, పడమట సురేష్‌బాబు, పార్టీ నాయకురాలు ఆరిమండ విజయశారదారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమహారుద్ర సహిత రాజశ్యామల సహస్ర చండీయాగాన్ని శుక్రవారం తాడేపల్లిలో వైవీ సుబ్బారెడ్డి సంకల్పం చెప్పి ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్ మళ్లీ అద్భుతమైన విజయం సాధించాలని, ఈ యాగం నిర్వహిస్తున్నారన్నారు. ఇది 41 రోజుల పాటు సాగుతుందని చెప్పారు. 175కు 175 అసెంబ్లీ స్థానాలు, 25కు 25 ఎంపీ స్థానాలు, మొత్తంగా 200కు 200 స్థానాలతో వైఎస్సార్‌సీపీ డబుల్ సెంచరీ కొట్టబోతోందన్నారు. ఇక ఈ రాజశ్యామల యాగాన్ని బ్రహ్మశ్రీ నల్లపెద్ది శివరామప్రసాద్‌శర్మ నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. తెలంగాణతో పాటు, ఏపీకి చెందిన 21 మంది ఋత్వికులు 41 రోజుల పాటు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

## సామాజిక న్యాయ ఉద్యమకారుడు జగ్జీవన్ రామ్

**గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్**



సాక్షి, అమరావతి: సామాజిక న్యాయ ఉద్యమకారుడు బాబూ జగ్జీవన్ రామ్ అని గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఆయన చిత్ర పటానికి గవర్నర్ శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తమ పార్లమెంటేరియన్, సమర్థ పాలకుడు, నిజమైన ప్రజాస్వామిక వాదని కొనియాడారు. పేద ప్రజలు, అణగారినవర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారన్నారు.

## రేపు ప్రకాశం జిల్లాలో 'మేమంతా సిద్ధం' సభ

- పొదిలి సమీపంలోని దొనకొండ అడ్డరోడ్డు వద్ద భారీగా ఏర్పాట్లు
- సభా ప్రాంగణాన్ని పరిశీలించిన చెవిరెడ్డి, బాలినేని, మేరుగు, తలశిల




సమావేశంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, మేరుగు నాగార్జున, తలశిల రఘురామ్, జంకె వెంకటరెడ్డి, అన్నా రాంబాబు, టీజేఆర్ తదితరులు

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా ఈ నెల ఏడో తేదీన ప్రకాశం జిల్లా పొదిలి సమీపంలోని దొనకొండ అడ్డరోడ్డు వద్ద నిర్వహించనున్నారు. ఈ సభకు మార్కాపురం, దర్శి, గిద్దలూరు, యర్రగొండపాలెం, కొండపి నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. ఈ మేరకు సభ ఏర్పాట్లను శుక్రవారం ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున, ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, టీజేఆర్ సుధాకర్‌బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, పరిశీలించారు. బహిరంగ సభా ప్రాంగణాన్ని, వేదికను వారు పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం నాయకులతో సమావేశమై సీఎం జగన్ బస్సుయాత్రను, బహిరంగ సభను జయప్రదం చేయాలని, సభకు వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, దర్శి, కనిగిరి, యర్రగొండపాలెం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, దద్దాల నారాయణ యాదవ్, తాటిపర్తి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి స్వరూప్ కన్నుమూత

**తొలి తెలుగు న్యూస్ రీడర్‌గా ప్రఖ్యాతి**



రామంతాపూర్/సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ప్రచార సాధనమైన దూరదర్శన్‌లో తొలి తెలుగు యాంకర్‌గా ప్రసిద్ధులు, తెలుగు ప్రజలకు తన కంచు కంఠంతో వార్తలు చెప్పిన జయంత్ శాంతి స్వరూప్(74) కన్నుమూశారు. శుక్రవారం ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతిచెందారు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన శాంతి స్వరూప్ దూరదర్శన్ సీనియర్ యాంకర్ రోజారాణిని వివాహమాడారు. ఆమె కొన్నేళ్ల కిందట చనిపోయారు. శాంతి స్వరూప్‌కు ఇద్దరు కుమారులు మేగాన్స్, అగ్నేయ. 1978లో దూరదర్శన్ కేంద్రంలో యాంకర్‌గా చేరిన ఆయన 1983 నుంచి తెలుగులో వార్తలు చదవడం మొదలుపెట్టారు. 2011లో పదవీ విరమణ చేశారు. టెలిప్రాంప్టర్ లేని రోజుల్లోనే వార్తలను ముందుగానే మననం చేసుకుని తెర ముందు పొల్లు పోకుండా తప్పులు లేకుండా అనర్గళంగా చదివి తెలుగు ప్రజలకు వార్తలు అందించారు. శాంతి స్వరూప్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుతో పాటు పలు సంస్థలు ఎన్నో అవార్డులతో సత్కరించాయి. రాతి మేఘం, క్రికెట్ మీద క్రేజ్, అర్ధాగ్ని అనే నవలలు కూడా రాశారు. ఆయన పార్థివ దేహాన్ని రామంతాపూర్‌లోని స్వగృహానికి తరలించి అక్కడి నుంచి అంబర్‌పేట్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

### సీఎం జగన్ సంతాపం

సాక్షి,అమరావతి: దూరదర్శన్ మొదటి తరం న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ మృతి పట్ల సీఎం జగన్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరిమిత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రోజుల నుంచి శాంతి స్వరూప్ మార్గదర్శక ప్రయత్నం చాలా మంది వార్తా ప్రసారకులకు స్ఫూర్తినిచ్చిందని సీఎం పేర్కొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

సాక్షి,అమరావతి: మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాసనమండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ..దళితుల జీవితాలను మార్చిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్ ఈ దేశానికి రెండు కళ్ళ లాంటి వారన్నారు. జగ్జీవన్ రామ్ బడుగు బలహీన వర్గాల కోసం చేసిన సేవలను అందరూ గుర్తుంచుకోవాలన్నారు. లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ.. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న ఒకే ఒక్కరు సీఎం జగన్ అని అన్నారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, నవరత్నాల కమిటీ చైర్మన్ మూర్తితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నేడు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఇలా...

- శనివారం ఉదయం 9గంటలకు బస్సు యాత్ర ప్రారంభం
- కావలి హైవే వద్ద సాయంత్రం 3 గంటలకు బహిరంగ సభ
- జువ్విగుంట క్రాస్ వద్ద రాత్రి బస

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర 9వ రోజు శనివారం (ఏప్రిల్ 6వ తేదీ) షెడ్యూల్‌ను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం శుక్రవారం విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్ శుక్రవారం రాత్రి బస చేసిన చింతరెడ్డిపాలెం ప్రాంతం నుంచి శనివారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. కొవ్వూరు క్రాస్, సున్నబట్టి, తిప్ప, గౌరవరం మీదుగా ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్దకు చేరుకుని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం కావలి క్రాస్ మీదుగా కావలి జాతీయ రహదారి వద్దకు చేరుకుని సాయంత్రం 3గంటలకు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం ఏలూరుపాడు, ఉలవపాడు క్రాస్, సింగరాయకొండ క్రాస్, ఓగూరు, కందుకూరు, పొన్నలూరు, వెంకుపాలెం మీదుగా జువ్విగుంట క్రాస్ వద్ద ఏర్పాటుచేసిన రాత్రి బస శిబిరం వద్దకు చేరుకుంటారు.




SMART BAZAAR | SMART SUPERSTORE

భీమవరం: పద్మశ్రీ కాంప్లెక్స్, మెయిన్ రోడ్ గూడూరు: PSR మాల్, బస్టాండ్ దగ్గర గుంటూరు: శివ సిటీ సెంటర్, రింగ్ రోడ్ చంద్రమౌళి నగర్ • ఐటీసీ ఎదురుగా, చుట్టుగుంట దగ్గర, శ్రీనివాసరావు పేట • KKR ఫంక్షన్ ప్లాజా, నగరంపాలెం • యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, మెయిన్ రోడ్ లక్ష్మీపురం • ఫీవర్ హాస్పిటల్ ఎదురుగా, అమరావతి రోడ్ • సిమ్స్ కళాశాల పక్కన, మంగళదాస్ నగర్ జగ్గయ్యపేట: సీతారామపురం ఎస్‌బీఐ బ్యాంక్ దగ్గర కందుకూరు: రాజ్ థియేటర్ ప్రాపర్టీ మచిలీపట్నం: పాత వినాయక థియేటర్, రేవతి సెంటర్ నందిగామ: భారత్ టాకీస్ రోడ్ నర్సరావుపేట: రిలయన్స్ ట్రెండ్స్ పక్కన, పల్నాడు రోడ్డు నెల్లూరు: MGB ఫెలిసిటీ మాల్, GNT రోడ్ • KVR పెట్రోల్ బంక్ దగ్గర, దర్గామిట్ట • ఐకాన్ నర్తకి ప్లాజా, RR వీధి, ఎన్టీఆర్ విగ్రహం దగ్గర నూజివీడు: బస్టాండ్ ఎదురుగా, మెయిన్ రోడ్ ఒంగోలు: పాత బై-పాస్ రోడ్డు, ఆంజనేయ స్వామి విగ్రహం దగ్గర పామూరు: GBC రోడ్ విజయ్ డిజిటల్స్ పక్కన తాడేపల్లిగూడెం: ఆర్టీసీ బస్ డిపో దగ్గర తణుకు: టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఎదురుగా, నరేంద్ర సెంటర్ విజయవాడ: గోపాలరెడ్డి రోడ్డు, వి.వి.కాంప్లెక్స్ • శుభం కళ్యాణ వేదిక, ఇండియన్ పెట్రోల్ బంక్ పక్కన, రామవరప్పాడు రింగ్ • మొగల్రాజపురం, విశాలాంధ్ర రోడ్డు • బైపాస్ రోడ్ భవానీపురం • లారీ ఓనర్ పెట్రోల్ పంప్ ఎదురుగా, గొల్లపూడి • రాఘవేంద్ర థియేటర్, అయోధ్యనగర్ వినుకొండ: పాత లక్ష్మి థియేటర్, అద్దంకి రోడ్డు ఉయ్యూరు: దీపక్ మహల్ థియేటర్ ఎదురుగా, కాటూరు రోడ్. మేదరమెట్ల: విజయలక్ష్మి టాకీస్, బస్ స్టాండ్ ఎదురుగా. పిడుగురాళ్ల: గంగమ్మ గుడి ఎదురుగా, మెయిన్ రోడ్

- రామ్యాంగో 1 kg — స్మార్ట్ ప్రైస్ ₹49 — మార్కెట్ ధర ₹80
- యాపిల్ రాయల్ గాలా 1 kg — స్మార్ట్ ప్రైస్ ₹249 — మార్కెట్ ధర ₹300
- వాటర్‌మెలన్ కిరణ్ 1 kg — స్మార్ట్ ప్రైస్ ₹18 — మార్కెట్ ధర ₹30
- లాల్ కాజా కట్లీ / మైసూర్ పాక్ క్లాసికల్ / బాంబే హల్వా / హార్లిక్స్ బర్ఫీ / బేసన్ లడ్డూ / మిల్క్ కేక్ / దూద్ పేడా 200 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) — BUY 1 GET 1 FREE — ఎమ్ఆర్‌పి ₹150 మొదలుకుని
- MTR / ఆచి / ఆశీర్వాద్ / బాంబినో ఇన్స్టంట్ గులాబ్ జామున్ 160 g మొదలుకుని — BUY 1 GET 1 FREE — ఎమ్ఆర్‌పి ₹145 మొదలుకుని
- పార్థ్ బెల్లం 950 g — స్మార్ట్ ప్రైస్ ₹64 — ఎమ్ఆర్‌పి ₹99 — ఆదా చేసుకోండి ₹35
- విశ్వల్ బాలాజీ సూపర్ వేల్యూ క్యాష్యూ / గుడ్ లైఫ్ బాదం 500 g — స్మార్ట్ ప్రైస్ ₹299/ ₹349 — ఎమ్ఆర్‌పి ₹449 / ₹549 — ఆదా చేసుకోండి ₹150 / ₹200
- nafed భారత్ చనా దాల్ 1 kg — ₹60 — ఇప్పుడు లభిస్తుంది
- గుడ్ లైఫ్ డైలీ రైస్ 26 kg — స్మార్ట్ ప్రైస్ ₹1325 (₹50.96 /kg) — ఎమ్ఆర్‌పి ₹1800 — ఆదా చేసుకోండి ₹475
- మైదా / శనగపిండి / బొంబాయి రవ్వ 500 g / 1 kg — BUY 1 GET 1 FREE — ఎమ్ఆర్‌పి ₹49 మొదలుకుని
- గుడ్ లైఫ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ / రైస్ బ్రాన్ ఆయిల్ 1 L — స్మార్ట్ ప్రైస్ ₹99 — ఎమ్ఆర్‌పి ₹150 — ఆదా చేసుకోండి ₹51
- హెరిటేజ్ ఆగ్మార్క్ ఘీ గ్రేడ్ స్పెషల్ 1 L — స్మార్ట్ ప్రైస్ ₹535 — ఎమ్ఆర్‌పి ₹730 — ఆదా చేసుకోండి ₹195
- టామరిండ్ 500 g — స్మార్ట్ ప్రైస్ ₹89 — ఎమ్ఆర్‌పి ₹115 — ఆదా చేసుకోండి ₹26
- హెరిటేజ్ / బ్రిటానియా / కెవిన్స్ / సన్‌ఫీస్ట్ / హార్షీస్ మిల్క్‌షేక్ 180 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) — కనీసం 25% తగ్గింపు — ఎమ్ఆర్‌పి ₹35
- తాజ్‌మహల్ లీఫ్ టీ 500 g — ఆదా చేసుకోండి ₹65 — ఎమ్ఆర్‌పి ₹450 మొదలుకుని — స్మార్ట్ ప్రైస్ ₹385 మొదలుకుని
- లేస్ చిప్స్ 90 g (సెలెక్ట్ వేరియంట్స్) — ఫ్లాట్ 25% తగ్గింపు — ఎమ్ఆర్‌పి ₹50 మొదలుకుని — స్మార్ట్ ప్రైస్ ₹38 మొదలుకుని
- సన్‌ఫీస్ట్ యిప్పీ నూడుల్స్ 420 g — ఆదా చేసుకోండి ₹15 — ఎమ్ఆర్‌పి ₹84 మొదలుకుని — స్మార్ట్ ప్రైస్ ₹69 మొదలుకుని
- పెప్సీ / మిరిండా / 7 అప్ / ఐ మౌంటెన్ డ్యూ 2.25 L — BUY 2 GET 1 FREE — ఎమ్ఆర్‌పి ₹99
- సింథాల్ / లిరిల్ / లక్స్ / పియర్స్ సోప్ 125 g మొదలుకుని (మల్టీ ప్యాక్) / నివియా షవర్ జెల్ 250 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) — కనీసం 33% తగ్గింపు — ఎమ్ఆర్‌పి ₹179 మొదలుకుని
- హెడ్ అండ్ షోల్డర్ / ట్రెసెమి / ప్యాంటీన్ 580 ml మొదలుకుని / మీరా షాంపు 340 ml (సెలెక్ట్ వేరియంట్స్) — ఫ్లాట్ 50% తగ్గింపు — ఎమ్ఆర్‌పి ₹345 మొదలుకుని — స్మార్ట్ ప్రైస్ ₹173 మొదలుకుని
- మెన్స్ అండ్ ఉమెన్స్ డియో 135 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) — ఫ్లాట్ 50% తగ్గింపు — ఎమ్ఆర్‌పి ₹259 మొదలుకుని — ఆఫర్ ధర ₹130 మొదలుకుని
- పాండ్స్ టాల్క్ 400 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) — ఆదా చేసుకోండి ₹160 — ఎమ్ఆర్‌పి ₹370 మొదలుకుని — స్మార్ట్ ప్రైస్ ₹210 మొదలుకుని
- POLYSET ప్లాస్టిక్ ఫ్రిడ్జ్ బాటిల్ 2 పీసెస్ సెట్ — స్మార్ట్ ప్రైస్ ₹99 — ఎమ్ఆర్‌పి ₹199
- HAPPY LIVING టెరీబాత్ టవల్ — స్మార్ట్ ప్రైస్ ₹199 మొదలుకుని — ఎమ్ఆర్‌పి ₹699 మొదలుకుని

వద్ద కూడా లభ్యం SMART SUPERSTORE

మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి

నియమ నిబంధనలు వర్తిస్తాయి. బ్యాంకింగ్ కార్డ్ / వాలెట్ ఆఫర్లు కేవలం స్మార్ట్ బజార్, స్మార్ట్ సూపర్‌స్టోర్, స్మార్ట్ పాయింట్ మరియు రిలయన్స్ ఫ్రెష్ సిగ్నేచర్ వద్ద మాత్రమే వర్తిస్తాయి. స్టాక్స్ ఉన్నంతవరకు ఆఫర్లు చెల్లుతాయి. ఆఫర్లన్నీ నోటీస్ చేయకుండానే మార్పు చేయబడగలవు. చూపించబడిన ఉత్పాదనల బొమ్మలు/ఫోటోగ్రాఫ్‌లు కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. ఫుట్‌వేర్ మరియు అపరెల్ ఆఫర్లు ఎంపిక చేయబడిన స్మార్ట్ బజార్ మరియు స్మార్ట్ సూపర్ స్టోరులలో మాత్రమే వర్తిస్తాయి. ఉత్పాదనలన్నిటి యొక్క ఎమ్ఆర్‌పి అన్నీ పన్నులతో కూడి ఉంటుంది. డిస్కౌంట్ పర్సెంటేజ్‌ను ఆఫర్ ధర యొక్క సమీప పర్సెంటేజ్‌కు రౌండ్ ఆఫ్ చేయబడింది.ఆఫర్లన్నీ 9 ఏప్రిల్ 2024 వరకు చెల్లుతాయి. ఆక్షేపణలన్నీ ముంబయిలోని కోర్టులో ప్రత్యేక అధికారానికి మాత్రమే లోబడి ఉంటాయి.

మనస్సులోని మలినాలను తొలగించి, మీ హృదయాన్ని అత్యంత స్వచ్ఛమైన భావాలతో నింపుకోండి. జగత్తు బ్రహ్మకాంతితో నిండి ఉందని జ్ఞాన నేత్రం మీకు తెలియజేస్తుంది.
– ప్రశ్నోపనిషత్తు



సాక్షి
శనివారం, 6 ఏప్రిల్ 2024

# ఇదా ప్రత్యామ్నాయం!

ఇది మేనిఫెస్టోల సీజన్. అధికార పక్షాల మాటెలావున్నా విపక్షాల మేనిఫెస్టోలు అమల్లోవున్న విధానాలను ధిక్కరిస్తున్నట్టు, నిలదీస్తున్నట్టు కనబడతాయి. తమ రాకను నిండైన ఆత్మవిశ్వాసంతో ప్రకటిస్తాయి. ప్రజానీకానికి అలాంటి భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తాయి. న్యూఢిల్లీలో శుక్రవారం కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టోకు అలాంటి లక్షణాలు లేశమాత్రమైనా కనబడవు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సెక్యులర్ విలువలకు తిలోదకాలిచ్చి హిందుత్వ రాజకీయాలను పెంచి పోషిస్తున్నదని పదేళ్లుగా కాంగ్రెస్‌తో సహా వివిధ పక్షాలు ఆరోపిస్తున్నాయి. కానీ చిత్రంగా 'న్యాయ్‌పత్ర' పేరుతో విడుదల చేసిన 48 పేజీల మేనిఫెస్టోలో ఆ ప్రస్తావన లేదు. దర్యాప్తు సంస్థలు, ఇంటెలిజెన్స్ సంస్థలు చట్టబద్ధంగా పనిచేసేలా, వాటిపై చట్టసభల పర్యవేక్షణవుండేలా చర్యలు తీసుకుంటామన్న వాగ్దానం వినసొంపుగానే వుంది. కానీ తమ ఏలుబడిలోనే ఆ సంస్థలు భ్రష్టు పట్టడం మొదలైందని గ్రహించినట్టు లేదు! 27 పార్టీలున్న ఇండియా కూటమికి కాంగ్రెస్ నేతృత్వం వహిస్తోంది. గత ఆదివారం ఆ కూటమి ఆర్భాటంగా రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించింది. తీరా అధికార కూటమికి ప్రత్యామ్నాయం తామేనన్న విశ్వాసాన్ని కలగజేసే విధాన ప్రకటనకు మాత్రం కాంగ్రెస్ సిద్ధపడలేదు. వాగ్దానాలకేమి... మేనిఫెస్టోలో చాలావున్నాయి. వర్తమాన యుగంలో చాలా పార్టీలు అమలు చేయటం కోసం కాక జనాన్ని మభ్యపుచ్చటానికే ఎడాపెడా వాగ్దానాలు చేస్తున్నాయి. వీటి మోహంలో పడి జనం ఓట్లు కుమ్మరిస్తారన్నది ఆ పార్టీల అంచనా కావొచ్చు. కానీ జనం తెలివిమీరారు. ఆచరణేమిటన్నది గమనిస్తున్నారు. ఉదాహరణకు ప్రజాప్రతినిధులు ఫిరాయింపులకు పాల్పడితే వెంటనే వారి సభ్యత్వం రద్దయ్యేలా చట్టం తీసుకొస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకటిస్తోంది. కానీ కళ్లముందు తెలంగాణలో బీఆర్‌ఎస్‌నుంచి కాంగ్రెస్‌కు గోడ దూకుళ్లు స్పష్టంగా కనబడుతుండగా ఈ వాగ్దానానికి విలువుంటుందా? గతంలో బీఆర్‌ఎస్ చేసింది కనుక తామూ అదే చేస్తున్నామన్న సంజాయిషీ చెల్లదు. తానూ ఆ తానులోని ముక్కనేనని కాంగ్రెస్ చెప్పదల్చుకుంటే ఇలాంటి వాగ్దానాలకు చోటీయకూడదు.

మేనిఫెస్టోలోని 'పాంచ్ న్యాయ్–పచ్చీస్ గ్యారంటీస్'లో సామాజిక న్యాయం గురించిన హామీ వుంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర'లో ఈ అంశాలు ప్రస్తావనకొచ్చినవే. యువత, రైతులు, మహిళలు, కార్మికులు, సమానత్వం వగైరాలు ఈ మేనిఫెస్టోలో వున్నాయి. బీజేపీ మినహా దాదాపు అన్ని పార్టీలూ డిమాండ్ చేస్తున్న కులగణనకు కాంగ్రెస్ సంసిద్ధత తెలిపింది. స్వామినాథన్ కమిషన్ ప్రధానమైన సిఫార్సుల్లో ఒకటైన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పిస్తామన్న వాగ్దానం కూడా వుంది. తమ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో ఈ పని ఎందుకు చేయలేకపోయారో మేనిఫెస్టో చెప్పలేదు. కనీసం ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులైనా వివరణనివ్వలేదు. విద్యార్థులు బ్యాంకులు నుంచి తీసుకొన్న విద్యారుణాలను రద్దు చేస్తామన్న హామీ నిరుద్యోగ యువతను ఆకర్షిస్తుంది. కానీ ప్రభుత్వరంగంలో 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని ఎందరు విశ్వసిస్తారన్నది అనుమానమే. ఎందుకంటే ఆ విషయంలో గత యూపీఏ సర్కారు తీరు నిరాశాజనకం. అటువంటి అసంతృప్తి ఉండబట్టే అప్పట్లో అన్నా హజారే నేతృత్వంలో సాగిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో యువత భారీయెత్తున పాల్గొన్నది. రిజర్వేషన్లపై ఇప్పుడున్న 50 శాతం పరిమితిని తొలగిస్తామని, కేంద్ర ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం కోటా కల్పిస్తామని మేనిఫెస్టో చెబుతోంది. అలాగే నిరుపేద మహిళలకు ఏడాదికి లక్ష రూపాయలు నేరుగా అందజేస్తామని అంటున్నది. 2018 ఏఐసీసీ సదస్సు దేశం మళ్లీ బ్యాలెట్ ఎన్నికలకు మళ్లాలని తీర్మానించింది. కానీ చిత్రంగా మేనిఫెస్టో ఈవీఎం విధానంవైపే మొగ్గింది. అయితే ఎన్నికల చట్టాలను సవరించి ఈవీఎంలు, వాటికి అనుసంధానించే వీవీ ప్యాట్‌లు మరింత పారదర్శకంగా వుండేలా చూస్తామంటున్నది. అగ్నిపథ్ స్కీం రద్దు, జమ్మూ, కశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర హోదా, న్యాయమూర్తుల నియామకాలకోసం ఎన్‌జేసీ, జీఎస్టీ చట్టాల ప్రక్షాళన వగైరా సరేసరి. ఒక్కమాటలో చెప్పాలంటే అధికారపక్షంపై ఏయే అంశాల్లో విమర్శలున్నాయో చూసుకుని వాటన్నిటినీ మేనిఫెస్టోలో గుదిగుచ్చిన వైనం కనబడుతోంది.

వోటర్లను ఆకర్షించటానికి అవతలి పార్టీకి మించి వాగ్దానాలు చేయటం, అధికారంలోకొచ్చాక వాటిని విస్మరించటం మన దేశంలో కొత్తగాదు. కానీ సైద్ధాంతికంగా అధికార పక్షానికి ప్రత్యామ్నాయం అనే భావన కలగజేయటానికి మేనిఫెస్టోలో కాంగ్రెస్ పెద్దగా ప్రయత్నించలేదు. దాని ఆచరణ సైతం అదేవిధంగా వుంటున్నది. కేరళలోని వైనాడ్‌లో బుధవారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా పార్టీ జెండాలు లేకుండానే రాహుల్ నిర్వహించిన రోడ్ షో చూస్తే ఈ సంగతి బోధపడుతుంది. బీజేపీపై ప్రధానంగా పోరాడుతున్నామంటూనే ఆ పార్టీ బలంగా వున్న ఉత్తరాదిని విడిచిపెట్టి రాహుల్ కేరళకు ఎందుకు వలస వచ్చారో కాంగ్రెస్ చెప్పలేకపోతోంది. ఆ సంగతలా వుంచి రాహుల్ రోడ్ షోలో జెండాలు కనుమరుగవటానికి గల కారణాలు దిగ్భ్రాంతి కలిగిస్తాయి. 2019లో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ జెండాలతోపాటు కనబడిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ జెండాలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాకిస్తాన్ జెండాతో పోల్చటంతో ఈసారి అవి రెండూ కనుమరుగయ్యాయి. ముస్లింలీగ్ జెండా ఏమిటో తెలియకుండానే ఆ పార్టీతో పొత్తు పెట్టుకుందా? సెక్యులర్ విలువలు పాటిస్తున్నామంటూనే ఇలాంటి విమర్శలకు బెదరటం ఆశ్చర్యం కలిగిస్తుంది. కాంగ్రెస్ మేనిఫెస్టో సైతం ఈ ధోరణినే ప్రతిబింబించింది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
ఫాల్గుణ మాసం, మార్గశిర మాసం, తిథి: బ.ద్వాదశి ఉ.7.36 వరకు
తదుపరి త్రయోదశి తె.5.13 వరకు (తెల్లవారితే ఆదివారం).
నక్షత్రం: శతభిషం ప.1.29 వరకు, తదుపరి పూర్వాభాద్ర.
వర్జ్యం: రా.7.28 నుండి 8.56 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.55 నుండి 7.29 వరకు, అమృతఘడియలు: ఉ.6.44 నుండి 8.13 వరకు.

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

# చుక్కాని లేని జనసేనాని

అభిప్రాయం



టంకశాల అశోక్

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు, జనసేన పార్టీకి ఇవి మూడవ ఎన్నికలు. ఇప్పటికీ ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు ఒక సిద్ధాంతం లేదు. పార్టీ నిర్మాణం లేదు. ఇవి చాలదన్నట్లు ఆయన కొమరం భీం, వీరమల్లు, చేగువేరా, జన సైన్యం, వీర మహిళలు అంటూ బీజేపీ వంటి పార్టీ పక్షం వహించటం ఎబ్బెట్టుగా కనిపిస్తున్నది. అది ఒకటైతే, మొదట ముఖ్యమంత్రి పదవి అంటూ మాట్లాడి, తర్వాత 50–60 స్థానాలలో పోటీ, తద్వారా ప్రభుత్వంలో పెద్ద చెయ్యి అని ప్రకటించి, చివరకు 21 సీట్లకు పరిమితం కావటం తన పార్టీ వారికి, తన సామాజిక వర్గం వారికి కూడా ఇబ్బందికరంగా తయారైంది. చుక్కాని అంటూ లేని పార్టీ పరిస్థితి ఇంతకు భిన్నంగా ఉంటుందా?

స్థాపించి నిండా పది సంవత్సరాలు గడిచినా తన సిద్ధాంతాలు ఏమిటో తెలియని రాజకీయ పార్టీ ఒకటి ఉందంటే నమ్మబుద్ధి కావటం లేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ పార్టీకి అయినా సిద్ధాంతాలు, లక్ష్యాలు, విధానాలన్నవి చుక్కాని వంటివి. కానీ పవన్ కల్యాణ్ 2014లో స్థాపించిన జనసేన పార్టీకి నేటి వరకు కూడా ఒక సిద్ధాంత పత్రం ఏమీ లేదు. కనీసం ఎన్నికల సమయంలోనైనా వారు మేనిఫెస్టో ఏదీ ప్రకటించలేదు. ఆంధ్రప్రదేశ్ చారిత్రకంగా, ఆర్థికంగా, సామాజికంగా ఈ దేశంలోని ప్రముఖ రాష్ట్రాలలో ఒకటి. అక్కడి అయిదు కోట్లమంది ప్రజలు అనేక రంగాలలో ఇతర రాష్ట్రాలలో, విదేశాలలో కూడా క్రియాశీలంగా ఉన్న వివేకవంతులు. అటువంటి రాష్ట్రానికి సారథ్యం వహించగోరే ఒక పార్టీ ఇంత దారీ తెన్నూ లేని విధంగా సాగుతుండటం ఆశ్చర్యకరమైన విషయం. ఇటువంటివి ఆలోచించదగిన విషయాలనే స్పృహ అయినా ఆ పార్టీ అధ్యక్షునికి ఉందా అనే అనుమానం కలుగుతున్నది.

పవన్ కల్యాణ్ అసలు పార్టీ ఎందుకు పెట్టినట్లు? పెట్టిన ఈ పదేళ్లుగా ఏమి చేసినట్లు? మునుముందు ఏమి చేయాలన్నది తన ఆలోచన? తన మాటలను, చేతలనుబట్టి చూస్తే రాజకీయ పరిశీలకులకు ఇందులో ఏ ఒక్క ప్రశ్నకు అయినా స్పష్టమైన సమాధానాలు కన్పించటం లేదు. ఆయన పార్టీ ప్రకటించిన 2014లో ఆంధ్రప్రదేశ్ ఒక పరీక్షా సమయాన్ని ఎదుర్కొంటున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయింది. విభజిత రాష్ట్రం అనేక వనరులను కోల్పోయింది. రాజకీయ పార్టీలకు, సాధారణ ప్రజలకు కూడా కొత్త రాష్ట్రాన్ని తిరిగి ఏ విధంగా నిలబెట్టాలనేది ఒక పెద్ద సమస్య. అప్పటి పరిణామాలన్నీ వారికి మానసికంగా కూడా కొంత అయోమయాన్ని సృష్టించాయి. అటువంటి స్థితిలో ఏర్పడే ఒక కొత్త రాజకీయ పార్టీ తనదైన విధంగా సమాధానాలను వెతకాలి. వాటిని ఒక సిద్ధాంత పత్ర రూపంలో రూపొందించి ప్రజల ముందుంచాలి. ఆ మేరకు స్వయంగానూ, ఏకీభావం గల ఇతర పార్టీలు, వర్గాలతోనూ కలిసి కార్యాచరణను చేపట్టాలి. కానీ ఇటువంటిదేమీ చేయలేదు. నేటికీ చేయటం లేదు.

ఇది ఒక కోణం కాగా, మరొక కోణాన్ని చూద్దాము. పవన్ కల్యాణ్ సామాజికంగా కాపు వర్గానికి చెందిన వ్యక్తి. ఆంధ్రప్రదేశ్‌లో రెడ్లు, కమ్మల తర్వాత మూడవ బలమైన వర్గం. అయినప్పటికీ రాజకీయాధికారం తమకు లేకుండా పోయిందని, దానిని అందుకోవాలనే కోరిక వారిలో బలంగా ఎప్పటి నుంచో ఉంది. అందుకోసం గట్టి ప్రయత్నాలు మొదటిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో పి. శివశంకర్ ఆధ్వర్యాన జరిగాయి. దక్షిణ కోస్తా, ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణల నుంచి కూడా ఈ సామాజిక తరగతులను కదిలించారు. ఆ ప్రయత్నాలు విఫల మయ్యాయి. తర్వాత చిరంజీవి రాకతో వారిలో తలెత్తిన ఆశలు కూడా ముందుకు సాగలేదు. ఇపుడు ఆ వర్గానికి చెందిన పవన్ కల్యాణ్‌ను వారిలోని కొందరు తమ వాడు అనుకోవటం తప్ప ఆశాభావాలు గత రెండు విడతలలోనూ ఎంత మాత్రం కనిపించటం లేదు. అందుకు ఒక కారణం ఆయన... శివశంకర్, చిరంజీవి వంటి గౌరవ ప్రతిష్ఠలను, నమ్మకాన్ని సంపాదించు కోలేక పోవటం. రెండు – తనలో అటువంటి పరిణతిగానీ, దార్శనికత గానీ ఉన్నాయనే అభిప్రాయం ఆ వర్గం వారికి 2014లో గానీ, తర్వాత ఈ పదేళ్లలోగానీ ఏర్పడక పోవడం. మూడు – ఒక పార్టీని సీరియస్‌గా నడిపే ఆలోచన, దక్షత, స్థిరత్వం, వ్యవహార ధోరణి అసలెప్పుడూ కన్పించక పోవటం. నాలుగు – పైన అనుకున్నట్లు తన సిద్ధాంతాలు, విధానాలు, ప్రణాళికలు, ఆ ప్రకారం ఆచరణలు ఏమిటో అర్థం కాక పోవటం. అయిదు – సినిమాలలో కావలసిన కొన్ని లక్షణాలకు, సీరియస్ రాజకీయాలకు అవసరమైన పద్ధతులకు మధ్య తేడా పాటించక తన విలువను తానే తగ్గించుకోవటం.




దానితో, కాపులలోని యువతరానికి పవన్ కల్యాణ్ పట్ల ఇతరత్రానూ గల సినిమాటిక్ ఆకర్షణ రాజకీయ ఆకర్షణగా మారటం తప్ప, వారిలోని ఇతరులకు ఆయనపై తమనేదో ఉద్ధరించగలడనే ఆశాభావం ఏమీ కలగటం లేదు. గత ఎన్నికల ఫలితాలు ఇందుకొక స్పష్టమైన సూచన. గమనించదగినదేమంటే, ఒకవేళ ఆయన శివశంకర్, చిరంజీవిల వలె తమ సామాజిక వర్గాన్ని, ఇతర బడుగు, బలహీన వర్గాలను కూడదీసే ప్రయత్నం చేసినట్లయితే ఆంధ్ర రాజకీయాలలో మూడవ ధ్రువం ఏర్పడే అవకాశం ఉండేది. వ్యక్తిగతంగా తనకు ఆ దార్శనికత, సమర్థత ఉన్నట్లు కనిపించదనేది వేరే విషయం. కానీ కనీసం సూత్రరీత్యా అటువంటి అవకాశం ఉండేది. ఈ పరిస్థితుల దృష్ట్యా పవన్ కల్యాణ్ గత పది సంవత్సరాలలో ఎటువంటి విలువనూ పెంచుకోలేక పోయారు. తనకు సంబంధించి అంతా సినిమాటిక్ గానే కనిపిస్తుంది. జనసేన అనే పేరు, కార్యకర్తలను సైనికులు అనటం, మహిళా సభ్యులను వీర మహిళలనటం, ఎక్కడైనా సమస్య కనిపిస్తే తోకచుక్క తెగిపడినట్లు వచ్చి హడావిడి చేసి మాయమవటం తప్ప అందుకు కొనసాగింపు లేకపోవడం, ప్రసంగాలలో దురుసుతనం, వీరాలా పాలు, అందుకు తగినట్లు సినిమాలలో వలెనే హావభావాలు.

ఈ విధంగా, ఆంధ్రప్రదేశ్ వంటి ముఖ్య రాష్ట్రం ఒక పరీక్షా సమయాన్ని ఎదుర్కొంటుండిన దశలో, ఒక సిద్ధాంతం, విధానాలంటూ లేకుండా ఒక పార్టీని నెలకొల్పటం, పదేళ్లయినా అదే పరిస్థితి ఉండటం, రాజకీయాధికారాన్ని కోరుకుంటున్న తన సామాజిక వర్గానికి ఎటువంటి ఆశాభావాన్ని కల్పించలేక పోవటం, చివరకు పార్టీ నిర్వహణ సైతం గందరగోళంగా సాగుతుండటాన్ని బట్టి, పవన్ కల్యాణ్ జనసేన ఆంధ్రప్రదేశ్‌లో, నిజమైన అర్థంలో ఒక నికరమైన, స్థిరమైన, సీరియస్ రాజకీయ పార్టీ అనే గుర్తింపును, గౌరవాన్ని సంపాదించుకోలేక పోయింది.

సిద్ధాంతాలు, లక్ష్యాల మాట ఇలా ఉంటే, జనసేన అధ్యక్షుని ఎన్నికల వ్యవహరణ ఏ విధంగా ఉన్నదో చూద్దాం. ఆయన రాష్ట్ర విభజనకు వ్యతిరేకి. కానీ ఆ విషయంలో డబుల్ గేమ్ ఆడిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును 2014 ఎన్నికలలో బలపరిచారు. చంద్రబాబు రైతాంగానికి, పేదలకు నష్టం చేసినందున 2004లో, 2009లో వరుసగా రెండుసార్లు ఓడిపోయిన వ్యక్తి. అదే విధంగా, రాష్ట్ర విభజనను పూర్తిగా బలపరచిన బీజేపీతోపాటు అపుడు చంద్రబాబు వెంట నిలబడ్డారు. తర్వాత 2019 ఎన్నికలలో వామపక్షాలతో స్నేహం చేశారు. అప్పటికి అయిదేళ్ల రాజకీయం చేసినా, తన సామాజిక వర్గం పెద్ద సంఖ్యలోగల గాజువాక, భీమవరం స్థానాల నుంచి స్వయంగా పోటీ చేసి కూడా ఓడారు. అయిదేళ్లలో తన సిద్ధాంతాలేమిటో చెప్పలేదు. సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం పేరిట తమ వారినీ ఒప్పించలేక పోయారు. ఆ వర్గానికి కంచుకోటలైన జిల్లాలు అంతటా అదే పరిస్థితి ఎదురైంది.

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు, జనసేన పార్టీకి ఇవి మూడవ ఎన్నికలు. ఇప్పటికీ తనకు సిద్ధాంతం లేదు. పార్టీ నిర్మాణం లేదు. సోదరుడు చిరంజీవి రాజకీయాలలో ఉండినప్పటిలా తన సామాజిక వర్గంగానీ, ఇతర బడుగు బలహీన వర్గాలుగానీ ఆయనను ఒక ఉద్ధారకునిగా ఏమీ చూడటం లేదు. అది ఒకటైతే, మొదట ముఖ్యమంత్రి పదవి అంటూ మాట్లాడి, తర్వాత 50–60 స్థానాలలో పోటీ, తద్వారా ప్రభుత్వంలో పెద్ద చెయ్యి అని ప్రకటించి, చివరకు 21 సీట్లకు పరిమితం కావటం తన పార్టీ వారికి, తన సామాజిక వర్గం వారికి కూడా ఇబ్బందికరంగా తయారైంది. తీరా అందులో గెలిచేదెన్ని, తమ కూటమి అధికారానికి రాగలదనే హామీ ఎంత అనేవి ఎవరికీ అంతుపట్టని ప్రశ్నలయ్యాయి. మౌలికంగా చుక్కాని అంటూ లేని పార్టీ పరిస్థితి ఇంతకు భిన్నంగా ఉండగలదా?

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### ఎక్కడికక్కడ!



'ఇండియా' కూటమిని ఎన్నికల్లో గెలవనీయకూడదని ఆయన ఫిక్స్ అయ్యారు. ఎన్నికల కమిషన్‌లో తన సొంత మనుమలను జొప్పించారు. ఇద్దరు సిట్టింగ్ ముఖ్యమంత్రులను జైల్లో పెట్టించారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. న్యాయ వ్యవస్థపై ఒత్తిడి తెస్తున్నారు.
– రియా, మిడిల్ ఈస్ట్ జర్నలిస్ట్

### కారు ఆపిన క్వీన్



'క్వీన్' అనే పిలుపునకు కంగనా రనౌత్ అనేక విధాలుగా అర్హురాలు అనేందుకు ఒక కారణం : తన ఎన్నికల ప్రచారంలో తన కారును ఆపమని భద్రతా సిబ్బందికి సూచించి, ఒక అభిమాని కోరిక మేరకు సెల్ఫీ దిగడానికి ఆమె అనుమతించారు. "ప్రజలను ప్రేమిస్తే, వారు మిమ్మల్ని తిరిగి ప్రేమిస్తారు" అనే మాటలో నిజం ఉంది.
– రాహుల్ చౌహాన్, ఐటీ ప్రొఫెషనల్

### పదికి ఒకసారి!



ఉప్మా పదికి తొమ్మిదిసార్లు సిమెంటును తిన్నట్లుగా ఉంటుంది. మిగిలిన ఆ ఒక్కసారీ ఉప్మాలా ఉంటుంది. ఆ ఒక్కసారి ఉప్మాను తినడం కోసం పదిసార్లు సిమెంటును ఇష్టపడేవాళ్లు కొందరు ఉంటారు. (ఒక ఇంటర్వ్యూలో మోదీ తనకు ఉప్మా అంటే ఇష్టం అని చెప్పిన సందర్భంలో వచ్చిన అనేక ట్వీట్‌లలో ఒకటి).
– కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రైనాలజిస్ట్

### వీళ్లు అనుచరులంటే!



నాయకుడు దగ్గర లేనప్పుడు అనుచరులు కలిసికట్టుగా ముందుకు వెళ్లటం గొప్ప సంగతి. కేజ్రీవాల్‌కు మద్దతుగా ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో 'ఇండియా' కూటమితో కలిసి విజయవంతంగా ర్యాలీ నిర్వహించిన ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలందరికి అభినందనలు. మీ పోరాటం ఆగకూడదు.
– డెరెక్ ఒబ్రియన్, టీఎంసీ ఎంపీ

### వాళ్లు మాత్రం..!!



యు.ఎస్.లో ట్రాన్స్‌జెండర్ భావజాల సమర్థింపునకు ప్రధానంగా బాధ్యత వహించవలసిన వారు మిషెల్ ఒబామా, ఆమె భర్త బరాక్ ఒబామా. ఇప్పటికీ వారు ట్రాన్స్‌జెండరిజంను పెంచి పోషిస్తూ ఉన్నారు. స్వయంగా ట్రాన్స్‌జెండర్ అయిన మిషెల్, 'గే' అయిన ఒబామా... ఆ సంగతిని బహిర్గతం చేసి ప్రపంచంతో నిజాయితీగా ఎందుకు మెసలలేరు?!
– డా॥ డాన్ మిషెల్, యాంటీ-రెమ్‌డిసివిర్ యాక్టివిస్ట్

### ఎవర్నడిగి ఇచ్చారు?



శ్రీలంక, తమిళనాడుల మధ్య 163 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ద్వీపం కచ్చతీవు రామేశ్వరంలోని రామ్‌నాడ్ రాజ్యానికి చెందినది. స్వాతంత్ర్యానంతరం అది తమిళనాడులో భాగమైంది. 1974లో అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ కనీసం పార్లమెంటు ఆమోదమైనా లేకుండానే శ్రీలంకకు కచ్చతీవును బహుమతిగా ఇచ్చారు!
– లిపీ బగ్రీ, చరిత్ర విశ్లేషకులు

### మంచికి పోతే...!



రీ సైక్లింగ్ మంచిదే. నా సొంత వీడియోలను నేను ఆసక్తికరమైన అనేక పార్ట్‌లుగా రీ సైకిల్ చేశాను. దెబ్బకు నా సబ్‌స్క్రైబర్‌ల సంఖ్య 70 లక్షలకు చేరుకుంది. కానీ టిక్ టాక్ నన్ను... "ప్రమాదకర చర్యలకు" పాల్పడుతున్నాననే ఆరోపణపై శాశ్వతంగా నిషేధించింది. ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దని నేను నా చందాదారులకు చెప్పడమే నా తప్పు!!
– మెహ్‌దీ సదర్ఘర్, ఎలక్ట్రో 'బూమ్' గై

ఇన్ బాక్స్

## వైద్యం ఎందుకంత ఖరీదవుతోంది?

మనదేశంలో నేడు వైద్యం చాలా ఖరీదైపోయింది. గతంలో మందులపై జీఎస్టీ ఐదు శాతం మాత్రమే ఉండేది. మోదీ ప్రభుత్వం 12 శాతానికి పెంచింది. ఇప్పుడు మళ్లీ మందులు రేట్లు పెంచే ప్రయత్నం చేస్తోంది. సూదులు, సిరంజ్‌లు, డయాగ్నొస్టిక్ కిట్స్, దూది వంటి వాటిపై 12 నుంచి 18 శాతం జీఎస్‌టీ వసూలు చేస్తున్నారు. ఏ వైద్యుడైనా పదేళ్లు బాగా ప్రాక్టీస్ చేయగలుగుతారు. అందులో ఐదేళ్లు ఆ యా విభాగాలు ఎస్టాబ్లిష్ చేసుకోవడానికే సరిపోతుంది. మంచి ప్రాక్టీస్ ఉండేది ఐదు సంవత్సరాలు మాత్రమే. ఈ కొద్ది కాలంలోనే చదువు ఖర్చు, హాస్పిటల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చు, హాస్పిటల్ పరికరాలకు ఆయిన ఖర్చు సంపాదించుకోవాలని ఏ వైద్యునికైనా ఉంటుంది. కాబట్టే ఏ ఒక్క అవకాశాన్నీ వదలకుండా ఎడాపెడా సంపాదించాలనుకుంటున్నారు.

ప్రభుత్వాలు మొత్తం 17 నుంచి 20 రకాల పన్నులు ముక్కు పిండి, వైద్యుల నుంచి వసూలు చేస్తున్నాయి. వైద్యులు కమర్షియల్ కరెంటు బిల్ కట్టాలి. పారిశ్రామికవేత్తలకు అనేక రాయితీలు ఉంటాయి. కానీ హాస్పిటల్‌కు ఏ రాయితీలు ఉండవు. మున్సిపల్ టాక్స్ కమర్షియల్. పేషెంట్ రూమ్స్, ఐసీయూ బెడ్‌ల లగ్జరీ టాక్స్, చెత్త పన్ను, బయో మెడికల్ వేస్ట్ పన్ను, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పన్ను, వాటితో పాటు ఫైర్ ఎన్‌ఓసి ఫీజు (అగ్నిమాపక విభాగం ఎన్‌ఓసీ రావాలంటే లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది). వీటికి తోడు అనధికార ఆర్థిక లావాదేవీలు తప్పనిసరి అవుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దగ్గర రిజిస్ట్రేషన్ ఫీజు, లేబర్ ఫీజు, భవిష్యనిధి, సిబ్బంది జీత భత్యాలు మొత్తం వెరసి ఆసుపత్రుల నిర్వహణ బహుభారం అయిపోయింది. అందువల్లనే చిన్న చిన్న ఆస్పత్రులు పోయి, నేడు పెద్ద పెద్ద కార్పొరేట్ ఆస్పత్రులు వచ్చేస్తున్నాయి. ఇక్కడ సామాన్యులకు వైద్యం చాలా భారం అయిపోతోంది.

'కర్ణుని చావుకు కారణాలు అనేకం' అన్నట్టు వైద్య విద్య, వైద్యసలహా, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు, ప్రభుత్వ విధిస్తున్న వివిధ రకాల పన్నులు, క్లినిక్ లు, ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ ఖర్చులు... వెరసి వైద్యాన్ని ఖరీదైనదిగా మార్చాయి. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వెల్నెస్, ఫ్యామిలీ ఫిజిషియన్ క్లినిక్‌ల వల్ల కాస్త పేద ప్రజలకు లాభం చేకూరవచ్చు. వైద్యం ప్రతి ఒక్కరికీ అనివార్యం. దాన్ని సాధ్యమైనంత వరకు పేదలకు సైతం అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

– డా॥ టి. సేవకుమార్; నేషనల్ కౌన్సిల్ మెంబర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్
(ఏప్రిల్ 7న 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం)

# చేతులు కాలాక ఆకులు పట్టుకున్నారు!

అభిప్రాయం



డా॥ పూనూరు గౌతమ్ రెడ్డి

రాష్ట్రంలో సామాజిక పింఛన్ల పంపిణీ అంశాన్ని రాద్ధాంతం చేసిన ఘనులు ఇప్పుడా పాపాన్ని కడిగేసుకుని సచ్ఛీలురుగా మారేందుకు చేస్తున్న ప్రయత్నాలను పండుటాకులు నిశితంగా గమనిస్తున్నాయి. తమ ఇంటి పెద్దను మండుటెండలో ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహరించిన పెద్దల తీరును లక్షలాది కుటుంబాలు గర్హిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకూ పెన్షన్లను సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని గగ్గోలు పెట్టిన ఈ కుహనా రాజకీయ నాయకులు ప్రజల్లో పెల్లుబుకుతున్న వ్యతిరేకతను గమనించి ఇంటికెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలంటూ ఎన్నికల సంఘానికి వినతి సమర్పించారు. అసలు ఈ తంతు ఎందుకు చేశారు. ఇప్పుడెందుకు వెనక్కు తీసుకుని మళ్లీ ప్రజలను నమ్మించేందుకు నానాపాట్లు పడుతున్నారన్నదే రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను నెలకొల్పడం ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని పరిఢవింపజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తనతొలి ప్రయత్నంలోనే ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. మరో అడుగు ముందుకేసి వాలంటీర్ వ్యవస్థను నెలకొల్పి ప్రభుత్వ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకు చేర్చగలిగారు. ఇది ప్రజల మనసును దోచుకుంది. ఈ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ప్రజల్లోకి మరింతగా వెళ్లడాన్ని జీర్ణించుకోలేకపోయిన తెలుగు దేశం అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు వాలంటీర్ల సేవానిరతిని ప్రజలకు కనిపించకుండా చేసేందుకు వారిపై బురద చల్లే ప్రయత్నం చేశారు. వీరి సహజత్వాన్ని ఇప్పటికే తెలుసుకున్న ప్రజలు మాత్రం వారి మాటలు వినిపించుకోలేదు. దీంతో మరింత ఆక్రోశానికి గురైన వీరు బ్యూరోక్రాట్స్ ముసుగులో ఉన్న కొంత మందిని ఆయుధాలుగా చేసుకుని ఈ వ్యవస్థను ప్రజలకు దూరం చేసేందుకు కుయుక్తులు పన్నడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వాన్నీ, ముఖ్యమంత్రి జగన్ పని తీరునూ డ్యామేజ్ చేసేందుకు ఎత్తుగడ వేశారు. అది ఫలించిందనుకుని ఆనందపడ్డారు. అయితే, వారి ఆనందం ఆవిరైపోవడానికి కేవలం గంటల సమయం మాత్రమే పడుతుందని తెలుసుకోలేపోయారు.

కాకినాడ జిల్లాలో ఒక వృద్ధురాలు పింఛన్ కోసం మండుటెండలో వచ్చి మరణించిన తరువాత కుహనా రాజకీయ నేతలు చేసిన ఘనకార్యం ప్రజల్లోకి వెళ్లింది. దీనిని కప్పి పుచ్చుకునేందుకు నానా రకాల తంటాలు పడుతూ కనిపిస్తున్నారు. తమకు తల్లో నాలుకలా ఉన్న వాలంటీర్లపై విషం చిమ్మిన చంద్రబాబు అండ్ కోపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమ వుతున్న నేపథ్యంలో రోజుకో అవతారం ఎత్తు తున్నారు. బ్యూరోక్రాట్ రూపంలో ఉన్న పచ్చ బ్యాచ్‌కే చెందిన వ్యక్తితో ఎలక్షన్ కమిషన్‌కు లేఖరాయించి ఇప్పుడు ఆ లేఖ రాసినపెద్ద మనిషి ఎక్కడున్నాడో చెబితే మంచి పారితో షికం ఇస్తామంటూ... అదే పచ్చ బ్యాచ్ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతూ ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తోంది. అంతేకాకుండా పచ్చ దళపతి కూడా పింఛన్లు ఇంటికి వెళ్లి ఇవ్వాలంటూ ఎన్నికల సంఘానికి లేఖల రాశారు. చేసిందంతా చేసి రాష్ట్రంలోని 66 లక్షల మంది పింఛన్దారులకు వెన్నుపోటు పొడిచి... ఇప్పుడు తామేదో సచ్ఛీలురం అనిపించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

వాస్తవానికి మార్చి నెల ఆర్థిక సంవత్సరానికి చివరి మాసం కావడంతో ప్రతి ఏటా ఏప్రిల్ 2, 3 తేదీల వరకూ పింఛన్లు పంపిణీ జరగవు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా ఇదే తేదీల్లో పింఛన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభం అవుతోంది. వాలంటీర్ల ద్వారా కాకుండా సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీ చేపట్టడం, మార్చి లెక్కల అనంతరం డబ్బులు ఇచ్చేందుకు బ్యాంకులు కొంత సమయం కోరుతుండటం, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇంత పెద్ద మొత్తంలో డబ్బును ఒక చోట నుండి ఇంకో చోటుకు తరలించేందుకు సరైన ఆధారాలు చూపించాల్సి ఉండటం ఇత్యాది కారణాల నేపథ్యంలో పింఛన్ల పంపిణీ తీవ్ర జాప్యానికి కారణమవుతోంది.



సామాజిక పింఛన్ల పంపిణీ ఆలస్యం చేయడం ఏమాత్రం ఇష్టంలేని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను పాటిస్తూ ప్రత్యామ్నాయంగా పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి సచివాలయం వద్ద ఆ సచివాలయ ఉద్యోగులే పింఛనన్లు పంపిణీ చేస్తారని ఉన్న సమాచారం నేపథ్యంలో బుధవారం ఉదయం నుండే సచివాలయాల వద్ద వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వారికి అవసరమైన మంచినీరు, టెంట్లు వంటివాటిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయినప్పటికీ ఎండలో సచివాలయాలకు చేరుకున్న లబ్ధిదారులకు బ్యాంకుల నుండి సొమ్ము డ్రా చేయడానికి సమయం పడుతుండటంతో సాయంత్రం మళ్లీ రావాలని సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు. పింఛన్ సొమ్ము వస్తుందన్న ఆశతో నడవలేని వృద్ధులను మంచాల మీద వేసుకుని మరీ సచివాలయాలకు చేరుకుంటున్నారు.

దీనికంతటికీ 'సిటిజన్ ఫర్ డెమోక్రసీ' (సీఎఫ్‌డీ) అనే సంస్థ పేరుతో కొంత మంది స్వార్థపూరిత ఆలోచనలు ఉన్న బ్యూరోక్రాట్స్‌ను అడ్డుపెట్టుకుని పచ్చబ్యాచ్ పండుటాకులతో ఆడిన వికృత క్రీడగా చెప్పక తప్పదు. ఇది నిండు ప్రాణాలను బలితీసుకునే స్థాయికి చేరుకున్నా వారిలో ఏమాత్రం చలనం కనిపించడం లేదు. ప్రజలకోసం నిరంతరం పరితపించే ఒక ప్రజా ప్రభుత్వానికి వ్యతిరేకంగా విషం చిమ్మే రాజకీయ నేతలకు మాజీ బ్యూరోక్రాట్లు కొమ్ము కాయడం సమంజసమేనా? ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఈ ఉదంతంతో సంబంధం ఉన్న రాజకీయ పక్షాలను ప్రజలు క్షమించరు. తగిన తీర్పు ఇస్తారు.

వ్యాసకర్త వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు । 98481 05455

# కోడ్ ఉల్లంఘిస్తే కొరడా

## నియమావళిని ఉల్లంఘిస్తున్న వారిపై ఈసీ కేసులు

- నోటిఫికేషన్ రాకుండానే 4,584 ఎఫ్ఐఆర్‌లు నమోదు
- రూ.47.49 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు జప్తు
- సీ–విజిల్ ద్వారా 7,838 ఫిర్యాదులు.. 100 నిమిషాల్లోనే 90 శాతం పరిష్కారం
- ఇప్పటివరకు 8,681 లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై 5,07,561 బ్యానర్లు, హోర్డింగుల తొలగింపు




**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు, రీపోలింగ్ వంటివి లేకుండా పూర్తి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అందుకోసం కఠినమైన చర్యలు తీసుకుంటోంది. ఏపీలో ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానప్పటికీ షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుంచే ఈసీ కొరడా ఝుళిపిస్తోంది. అప్పటినుంచే రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుచేస్తోంది. షెడ్యూల్ విడుదలైన 20 రోజుల్లోనే కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి 4,584 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. ఇందులో 4,337 ఎఫ్ఐఆర్‌లు నగదు, వస్తువుల జప్తుకు సంబంధించినవి కాగా, అనుమతుల్లేకుండా నియమావళికి విరుద్ధంగా ప్రచారం చేస్తున్న వారిపై 247 కేసులు నమోదు చేశారు.

### నేరుగా ఫిర్యాదుకు నిర్దేశిత సమయం

**రోజు సా.4-5 గంటల మధ్య స్వీకరణ**



సాధారణ ఎన్నికల ప్రక్రియపై ఎన్నికల సంఘాన్ని నేరుగా కలిసి ఫిర్యాదు లేదా విజ్ఞాపనపత్రం ఇవ్వాలనుకనే వారికి రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం నిర్దేశిత సమయాన్ని కేటాయించింది. ప్రతిరోజు సా.4–5 గంటల మధ్య తమకు నేరుగా అందజేయవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ పనిదినాలతో పాటు ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా తాము కార్యాలయంలో అందుబాటులో ఉంటే అందజేయవచ్చన్నారు. తాను కార్యాలయంలో అందుబాటులో లేని పక్షంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారులకు లేదా సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారికి అందజేయవచ్చన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో ఫిర్యాదులివ్వడానికి వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం గ్రౌండ్ ఫ్లోర్ రూమ్ నెం.129 లోని ఫిర్యాదు సెల్‌లో అందుబాటులో ఉంటుందని ముకేష్‌కుమార్ పేర్కొన్నారు.

### రూ.47.49 కోట్లు జప్తు..

ఇక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఏప్రిల్ 5 వరకు రూ.47.49 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ప్రకటించింది. ఇందులో..

- నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళ్తున్న రూ.17.85 కోట్ల నగదు, రూ.8.82 కోట్ల విలువైన మద్యం, రూ.1.63 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు, రూ.12.36 కోట్ల విలువైన బంగారం వంటి విలువైన లోహాలను స్వాధీనం చేసుకున్నారు.
- ఇవికాక.. ఓటర్లను ప్రలోభాలు పెట్టేందుకు సిద్ధంచేసిన రూ.1.56 కోట్ల విలువైన వివిధ వస్తువులతో పాటు రూ.5.24 కోట్ల విలువైన ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది.
- ఎన్నికల వేళ లైసెన్స్‌లు కలిగిన ఆయుధాలను పోలింగ్ స్టేషన్‌లో సమర్పించాల్సి ఉండగా ఇప్పటివరకు 8,681 ఆయుధాలను డిపాజిట్ చేయగా ఇంకా 17 చేయాల్సి ఉంది.
- మరోవైపు.. ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో 32 హింసాత్మక సంఘటనలు నమోదయ్యాయి. అలాగే, ఎన్నికల సందర్భంగా సమస్యలను సృష్టించడానికి అవకాశమున్న 432 మందిని గుర్తించామని ఇంకా 21 మందికి నాన్ బెయిలబుల్ వారెంట్స్ జారీచేయాల్సి ఉందని ఈసీ పేర్కొంది.
- సీ–విజిల్ యాప్ ద్వారా 7,838 ఫిర్యాదులు రాగా అందులో 90 శాతం కేసులను నిర్దేశిత 100 నిమిషాల్లోనే పరిష్కరించినట్లు తెలిపింది.
- రాష్ట్రంలోను, రాష్ట్ర సరిహద్దుల వద్ద నిఘా కోసం 298 చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది.
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై ఏర్పాటుచేసిన 5,07,561 బ్యానర్లు, హోర్డింగులు తొలగించారు.

## నూర్‌బాషా, దూదేకుల సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటు

**నూర్‌బాషా, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ ఓతూరి రసూల్**


చైర్మన్ రసూల్‌ను సత్కరిస్తున్న సంఘం నేతలు

**గన్నవరం:** రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని రకాల తోడ్పాటునందించినట్లు నూర్‌బాషా, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ ఓతూరి రసూల్ తెలిపారు. కృష్ణాజిల్లా, గన్నవరం మండలంలోని దావాజీగూడెంలో శుక్రవారం నూర్‌బాషా, దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిమర్తి చిన్నమస్తాన్ ఆధ్వర్యంలో రసూల్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్ నూర్‌బాషా, దూదేకుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు సంక్షేమ పథకాలతో ఆదుకున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు నూర్‌బాషా, దూదేకులు కృషి చేయాలని కోరారు. మతోన్మాద బీజేపీతో చేతులు కలిపిన టీడీపీ, జనసేన కూటమిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## క్లుప్తంగా...

### వైద్య,ఆరోగ్యశాఖ కమిషనర్‌గా కృష్ణబాబుకు పూర్తి అదనపు బాధ్యతలు



**సాక్షి, అమరావతి:** రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్‌తో పాటు, నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం) ఎండీగా వైద్యశాఖ ప్రత్యేక, ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) తీసుకున్నారు. దీంతో పాటు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ డాక్టర్ వెంకటేశ్వర్ వ్యక్తిగత సెలవుపై వెళ్లిన క్రమంలో కృష్ణబాబు ఎఫ్ఏసీగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవోగా వైద్యశాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మనికి ఎఫ్ఏసీ ఇచ్చారు. ఆరోగ్యశ్రీ సీఈవో, వైద్యశాఖ కమిషనర్, ఎన్‌హెచ్ఎం ఎండీగా వ్యవహరిస్తున్న డి.కె.బాలాజీ కృష్ణాజిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే.

### క్యూ ఆర్ స్కాన్‌తో సాధారణ రైలు టికెట్లు



**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):** డిజిటల్ చెల్లింపులు, నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించే క్రమంలో విజయవాడ డివిజన్‌లో జనరల్ బుకింగ్ కౌంటర్ (అన్ రిజర్వ్‌డ్)లో క్యూఆర్ కోడ్ ప్రవేశపెట్టినట్లు సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు తెలిపారు. డివిజన్‌లోని ప్రధాన రైల్వేస్టేషన్‌లైన విజయవాడ, ఏలూరు, తెనాలి, రాజమండ్రిలలో 19 జనరల్ బుకింగ్ కౌంటర్‌లలో ప్రయోగాత్మకంగా ఈ విధానం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కౌంటర్ వద్ద టికెట్ కొనుగోలు చేసే సమయంలో ప్రయాణం ఎక్కడ నుంచి ఎక్కడ వరకు, పిల్లలు/పెద్దల సంఖ్య, చార్జీలు వివరాలను బుకింగ్ క్లర్క్ నమోదు చేయగానే కౌంటర్ బయట ఏర్పాటు చేసిన స్క్రీన్‌లో ఆ వివరాలు కనిపిస్తాయి. ప్రయాణికులు వాటిని సరిచూసుకుని అక్కడ కనిపించే క్యూ ఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌లోని పేమెంట్ యాప్ ద్వారా స్కాన్ చేయడంతో టికెట్ జనరేట్ అవుతుందన్నారు. త్వరలోనే ఈ సౌకర్యాన్ని డివిజన్‌లోని అన్ని స్టేషన్‌లలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు సీనియర్ డీసీఎం తెలిపారు.

### శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలకు నేడు అంకురార్పణ

- భారీగా తరలివస్తున్న భక్తులు



**శ్రీశైలం టెంపుల్:** శ్రీశైలం మహాక్షేత్రంలో నిర్వహించనున్న ఉగాది మహోత్సవాలకు శనివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేయనున్నారు. ఈ ఉత్సవాలకు తెలుగురాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దీంతో శ్రీగిరి క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఐదు రోజుల పాటు జరుగనున్న ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. పాదయాత్ర భక్తులకు తాగునీరు, వైద్య శిబిరాలు, దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ, చలువ పందిళ్లు ఏర్పాటు చేసింది. స్వామి, అమ్మవార్ల దర్శనానికి మూడు రకాల క్యూలైన్లు సిద్ధం చేసింది. ఉత్సవాల్లో ప్రతిరోజు శ్రీభ్రమరాంబదేవికి ప్రత్యేక అలంకారం, శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి విశేష వాహన సేవ నిర్వహిస్తారు.

### తొలిసారిగా టీటీడీ తెలుగు క్యాలెండర్

- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి



**తిరుమల:** తొలిసారిగా తెలుగు పంచాంగాన్ని టీటీడీ ప్రచురించినట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...ఈ పంచాంగాన్ని తిరుమల, తిరుపతిలోని టీటీడీ బుక్‌స్టాళ్లలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. హైదరాబాద్, విశాఖ, విజయవాడ, చెన్నై, బెంగళూరులోని టీటీడీ సమాచార కేంద్రాల్లోనూ పంచాంగాన్ని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏప్రిల్ 9న శ్రీవారి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 21–23 వరకు తిరుమలలోని వసంత మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 22న ఉదయం స్వామి, అమ్మవార్లు స్వర్ణరథంపై ఊరేగుతారని చెప్పారు. ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఈ నెల 17–25 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 22న శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

## వినాయకుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

**కాణిపాకం (చిత్తూరు రూరల్):** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకుడిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయానికి వచ్చిన వీరికి ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం జస్టిస్ కిరణ్మయికి స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదాలను అందజేశారు.


జస్టిస్ కిరణ్మయికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో వెంకటేశు

## నేడు నింగిలోకి అగ్నిబాన్ రాకెట్

- శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభం
- ఉదయం ఆరు గంటల అనంతరం ప్రయోగం

**సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా):** అగ్నికుల్ కాస్మోస్ ప్రయివేట్ లిమిటెడ్ (చెన్నై) అనే ప్రయివేట్ అంతరిక్ష సంస్థకు చెందిన అగ్నిబాన్ ఎస్ఓఆర్ టీఈడీ మిషన్–01 అనే చిన్న తరహా రాకెట్‌ను సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని అగ్నికుల్ ప్రయోగవేదిక నుంచి శనివారం ఉదయం 6గంటలకు ప్రయోగించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ విషయాన్ని షార్ శుక్రవారం మీడియాకు తెలిపింది. ఇస్రోలోని వాణిజ్యవిభాగమైన ఇన్‌స్పేస్ సంస్థ ఆహ్వానం మేరకు షార్‌లోని సౌండింగ్ రాకెట్ లాంచ్‌పాడ్ నుంచి ఈ ప్రయోగాన్ని నిర్వహించనున్నారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభమవుతుంది. ఈ ప్రయోగంలో సుమారు వంద కిలోలు బరువు కలిగిన పేలోడ్ (ఉపగ్రహం)ను లోయర్ ఎర్త్ ఆర్బిట్ (లియో)లోకి పంపించనున్నారు. అయితే రాకెట్‌కు సంబంధించిన అన్ని విషయాలను అగ్నికుల్ సంస్థ చూసుకుంటుండగా, షార్ అధికారులు, ఇంజినీర్లు ప్రయోగాన్ని పర్యవేక్షిస్తున్నారు. అందుకే ఈ రాకెట్‌కు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో వెల్లడించడం లేదు. అయితే షార్ వేదికగా ప్రయివేట్ అంతరిక్ష సంస్థల్లో స్కైరూట్, అగ్నికుల్ అనే రెండు సంస్థలకు చెందిన చిన్న తరహా ప్రయోగాలకు ఇస్రో వీలు కల్పిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రయోగ వేదికలను కూడా కల్పించి మరీ ప్రయివేట్ అంతరిక్ష సంస్థలకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తోంది. అందుకే అగ్నికుల్ సంస్థకు షార్‌కేంద్రంలో ఒక ప్రయోగవేదికను కూడా కేటాయించారు.

**అగ్నిబాన్ రాకెట్ వివరాలివి**

పేటెంట్ పొందిన అగ్నిలెట్ ఇంజన్‌లతో ఈ రాకెట్ నడవడం విశేషం. ఇది త్రీడీ–ప్రింటెడ్ 6 కేఎన్ సెమీ క్రయోజనిక్ ఇంజిన్ సాయంతో నిలువునా నింగిలోకి ఎగురుతుంది. అగ్నికుల్ రాకెట్ 18 మీటర్లు ఎత్తు కలిగి 1.3 మీటర్లు వెడల్పు ఉంది. ప్రయోగ సమయంలో 14వేల కిలోల బరువు కలిగి ఉంటుంది. ఈ అగ్నిలెట్ ఇంజిన్లలో ద్రవ ఆక్సిజన్, ద్రవ ఆక్సిడైజర్ అనే ఇంధనం సాయంతో మూడు దశలుగా రాకెట్‌ను ప్రయోగిస్తారు. అగ్నికుల్ కాస్మోస్ సంస్థ గతేడాది ఆగస్టు 15న ఒకసారి ప్రయోగాన్ని నిర్వహించగా, రెండోసారి శనివారం ప్రయోగానికి శ్రీకారం చుట్టారు.


అన్ని దశలను అనుసంధానం చేసిన తర్వాత వర్టికల్ పొజిషన్‌లో ప్రయోగవేదికపై 'అగ్నిబాన్'



అగ్నికుల్ ప్రయోగ వేదికపై సిద్ధంగా ఉన్న అగ్నిబాన్ రాకెట్

## రాష్ట్రానికి వలస పక్షులు బాబు, పవన్, కిరణ్

- రాష్ట్రాన్ని విడగొట్టిన కిరణ్‌ను చిత్తుగా ఓడిస్తాం
- నిప్పులు చెరిగిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**పుంగనూరు (చిత్తూరు జిల్లా):** అడ్డగోలుగా రాష్ట్రాన్ని విడగొట్టి ఆంధ్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేయడమే కాకుండా తప్పుడు కేసుల్లో జగన్‌మోహన్‌రెడ్డిని జైలుకు పంపిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడిస్తామని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలోని ఆరడిగుంట, సింగిరిగుంట, మేలుందొడ్డి, వనమలదిన్నె గ్రామాల్లో సిద్ధం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి మంత్రి ప్రారంభించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, పవన్‌కళ్యాణ్‌కు రాష్ట్రంలో సొంత ఇళ్లు కూడా లేవని , వీరంతా ఎన్నికల కోసం వచ్చిన వలస పక్షులేనని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లోని అయ్యప్ప సొసైటీ కాంప్లెక్స్‌లో ప్రతి ఫ్లోర్‌లోనూ కిరణ్, ఆయన సోదరులు కలసి ప్రతి ఫైల్‌కు డబ్బులు వసూలు చేసి, వేల కోట్లు దోచుకున్నారని, అలాంటి వారికి తమ కుటుంబాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. అవినీతి అక్రమాలతో సీఎం పదవిని చేపట్టిన కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానంతో కుమ్మక్కై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు కేసులు నమోదు చేసి, జైలులో పెట్టారని మంత్రి పెద్దిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు కలసి పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధిని అన్ని విధాలా అడ్డుకున్నారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రూ.వేల కోట్లతో పుంగనూరును అభివృద్ధి చేసి, ఆదర్శంగా నిలిపామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో చంద్రబాబు మరోసారి ప్రజలను మోసగించేందుకు సూపర్–6, 7 పథకాలు అమలు చేస్తానంటున్నారని, అయితే ఆ పథకాల అమలుకు రూ.2.54 లక్షల కోట్లు కావాలని , ఇందుకు రాష్ట్ర బడ్జెట్ కూడా సరిపోదని చెప్పారు. ఇలాంటి తప్పుడు హామీలతో ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజం అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు


టీడీపీ నేత శ్రీకుమార్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పెడన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు రాము, చంద్రశేఖర్


గంగూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంత్రి జోగి సమక్షంలో పార్టీలో చేరిన జనసేన నేతలు


తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో పార్టీలో చేరిన వెలగలేరుకు చెందిన టీడీపీ కార్యకర్తలు


ఏలూరు జిల్లా వింజరంలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీ అభ్యర్థి కారుమూరి ఆధ్వర్యంలో పార్టీలో చేరికలు

**పెనమలూరు/పెడన/పెనుగొండ/కైకలూరు:** కృష్ణా జిల్లా తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని జనసేన పార్టీ ముఖ్య నేతలు 100 మందితో శుక్రవారం మంత్రి జోగి రమేష్ సమక్షంలో గంగూరులో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిలో తాడిగడప మున్సిపాలిటీ జనసేన ఉపాధ్యక్షుడు వంకాయలపాటి ప్రవీణ్ ఉన్నారు. పెడనలో మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ సోదరుడు మాజీ జడ్పీటీసీ బూరగడ్డ శ్రీకుమార్ తన అనుచరులతో కలిసి పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) సమక్షంలో ఆ పార్టీలో చేరారు. పశ్చిమ గోదావరి జిల్లా వెలగలేరుకు చెందిన టీడీపీ నేతలు ఉండ్రాజవరపు శివ, శివంగుల భవానీ ప్రసాద్, శివంగుల నగేష్, ఉండ్రాజవరపు శ్రీహరి, మామిడిశెట్టి నాగరాజులతో పాటు పలువురు యువకులు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో పార్టీలో చేరారు. ఏలూరు జిల్లా వింజరంలోని టీడీపీ, జనసేన నేతలు 150 మంది వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి 250 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి.


ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 250 కుటుంబాలు

# ఎన్నికల భారతం చూసొద్దాం!

## ఎలక్షన్ టూరిజం.. ఇదో సరికొత్త ట్రెండ్

ఓట్ల పండుగను కళ్లారా చూసేందుకు విదేశీ టూరిస్టుల క్యూ | విహార యాత్రలతో కలగలిపి ప్యాకేజీలు | రూ.40,000 – 1.5 లక్షల రేంజ్‌లో...

| | |
|---|---|
| 97 కోట్ల మంది ఓటర్లు | 1.5 కోట్ల మంది పోలింగ్‌-భద్రతా సిబ్బంది |
| 55 లక్షల ఈవీఎంలు | 10.5 లక్షల పోలింగ్‌ స్టేషన్లు |

ప్రపంచ ప్రజాస్వామ్య జాతరలో పూనకాలు లోడింగ్‌... అని చెప్పేందుకు ఈ అంకెలు చాలు! 1952 నుంచి ఇప్పటిదాకా ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా క్రమం తప్పకుండా ఎన్నికలు జరిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్‌ ట్రాక్‌ రికార్డు ఇది. అంతేకాదండోయ్‌... యూరప్‌ మొత్తం జనాభా (75 కోట్లు) కంటే ఈ ఎన్నికల్లో మన ఓటర్లే ఎక్కువ! అందుకే ఇప్పుడు ప్రపంచమంతా మన ఓట్ల పండుగ వైపు చూస్తోంది. విదేశీ టూరిస్టులు కూడా ఈ కోలాహలాన్ని కళ్లారా చూసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ ఆసక్తిని గమనించిన పలు భారతీయ ట్రావెల్‌ కంపెనీలు వినూత్న ఐడియాతో వారికి 'ద గ్రేట్‌ ఇండియన్‌ ఎలక్షన్‌ మేజిక్‌'ను చూపించేందుకు ప్లాన్‌ చేశాయి. అదే 'ఎన్నికల టూరిజం'. దేశంలో ఇప్పుడిది నయా ట్రెండ్‌!

'కోడ్‌' కూతతో 7 విడతల్లో 44 రోజుల పాటు ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మెగా సార్వత్రిక సమరంలో పార్టీల ప్రచారం జోరందుకుంది. ఇసుకేస్తే రాలనంత జనంతో భారీ సభలు.. పోటీ చేసే అభ్యర్థులు చేసే విన్యాసాలు... ప్రసంగాల్లో నేతల వాగ్దాటి... రాత్రికిరాత్రే పార్టీలు మార్చే ఆయారాంలు, గయారాంలు.. హోరెత్తించే ర్యాలీలు.. కార్యకర్తల సందడితో దేశమంతా ఎన్నికల జ్వరం ఆవహించింది. మనకు ఇవేమీ కొత్తకాదు. అయితే, ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల క్రతువును ప్రత్యక్షంగా చూడాలనుకునే విదేశీయుల కోసం దేశంలోని పలు ట్రావెల్‌ ఏజెన్సీలు ఎన్నికల టూరిజం పేరుతో ప్రత్యేక ప్యాకేజీలను అందిస్తున్నాయి.



2019లో ప్రత్యేకంగా పార్లమెంట్‌ ఎన్నికలను చూసేందుకు దాదాపు 8,000 మంది విదేశీ టూరిస్టులు వచ్చినట్లు అంచనా. ముఖ్యంగా అమెరికా, చైనా, నేపాల్, యూఏఈ, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్‌ దేశాలకు చెందిన వారు ఇందులో ఉన్నారు. విద్యార్థులు, జర్నలిస్టులు, రీసెర్చ్‌ స్కాలర్లు, మహిళా బృందాలు, చరిత్ర–సంస్కృతి, రాజకీయాల పట్ల మక్కువ చూపేవారు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఈసారి ఎన్నికల టూరిజం కోసం 25,000 మందికి పైగానే విదేశీ పర్యాటకులు రావచ్చని ట్రావెల్‌ కంపెనీలు లెక్కలేస్తున్నాయి.

### మెక్సికో స్ఫూర్తి

2005లో మెక్సికోలో బాగా విజయవంతమైన పోల్‌ టూరిజం స్ఫూర్తితో అహ్మదాబాద్‌కు చెందిన అక్షర్‌ ట్రావెల్స్‌ అనే సంస్థ ఈ కాన్సెప్ట్‌ను తొలిసారి దేశంలో ప్రవేశపెట్టింది. 2012 గుజరాత్‌ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రత్యేక ప్యాకేజీలతో ఆకట్టుకుంది. వణ్యప్రాణుల టూరిజం... మెడికల్‌ టూరిజం... విలేజ్‌ టూరిజం... హిమాలయన్‌ ట్రెక్కింగ్‌ టూరిజం... తీర్థయాత్రల టూరిజం... దేవాలయాలు–ఆధ్యాత్మిక టూరిజం.. యోగా టూరిజం.. ఇలా విదేశీ టూరిస్టులను ఆకర్షిస్తున్న జాబితాలోకి ఎన్నికల టూరిజాన్ని కూడా చేర్చింది. గుజరాత్‌లో సక్సెస్‌ కావడంతో 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ దేశవ్యాప్తంగా దీన్ని కొనసాగించినట్లు ఆ సంస్థ చైర్మన్‌ మనీష్‌ శర్మ చెప్పారు. 'ఎన్నికల సమయంలో భారత్‌ను సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్న విదేశీ టూరిస్టుల్లో యూరోపియన్లు, మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియాకు చెందిన వారు ఎక్కువ. ర్యాలీల్లో లక్షలాది మంది పాల్గొనడం వారికి సరికొత్త అనుభూతిని అందిస్తోంది' అని ఆయన వివరించారు. ప్రస్తుతం దేశంలో 20కి పైగానే ట్రావెల్‌ ఏజెన్సీలు ఎలక్షన్‌ టూరిజం ప్యాకేజీలను ఆఫర్‌ చేస్తున్నాయి. 6 రోజులకు ప్రారంభ ధర రూ. 40,000 కాగా, 2 వారాల ప్యాకేజీకి గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి.

### ప్యాకేజీల ప్రత్యేకతేంటి?

అటు పర్యాటకంగా, ఇటు రాజకీయంగా ఆసక్తి రేకెత్తించే కీలక ప్రాంతాలు, రాష్ట్రాలను ఏజెన్సీలు ప్రధానంగా ఎంచుకుంటున్నాయి. వారణాసి, ఢిల్లీతో సహా కేరళ, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌ వంటివి ఎన్నికల టూరిజం ప్యాకేజీల్లో ప్రధానంగా చోటు దక్కించుకుంటున్నాయి. భారీ ఎన్నికల ర్యాలీలు, సభల్లో పాల్గొనడంతో పాటు స్థానిక రాజకీయ నాయకులతో మాటామంతీ, కలిసి భోజనం చేయడం, గ్రామ పంచాయతీలను సందర్శించడం వంటివన్నీ ప్యాకేజీల్లో చేరుస్తున్నారు. పోటీ చేసే అభ్యర్థులను కలుసుకునే అవకాశాన్ని కూడా టూరిస్టులకు కల్పిస్తున్నారు. దీనివల్ల వారి ప్రచార వ్యూహాలు, ఇతరత్రా ఎన్నికల సంబంధ విషయాలను నేరుగా తెలుసుకోవడానికి వీలవుతుంది. కేవలం ఎన్నికల కార్యక్రమాలనే కాకుండా చుట్టుపక్కల గుళ్లు గోపురాలు, కోటలు, బీచ్‌ల వంటి ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలను చుట్టేసే విధంగా ప్యాకేజీలను రూపొందిస్తున్నామని శర్మ వివరించారు. అంతేకాదు ధాబాల్లో భోజనం, స్థానికంగా నోరూరించే వంటకాలను రుచి చూపించడం, ఆ ప్రాంతంలోని సంస్కృతి, సాంప్రదాయాలతో పర్యాటకులు మమేకం కావడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కాగా, ఢిల్లీకి చెందిన ఇన్‌క్రెడిబుల్‌ హాలిడేస్‌ అనే సంస్థ విదేశీ టూరిస్టులతో పాటు దేశీ పర్యాటకులకు కూడా ఇలాంటి ప్యాకేజీలను అందిస్తోంది. సందర్శనీయ ప్రదేశాలను చూపడంతో పాటు ఎన్నికల సంబంధ కార్యక్రమాల్లో కూడా పాల్గొనే విధంగా పర్యాటకుల అభిరుచిని బట్టి ప్యాకేజీలను రూపొందిస్తున్నామని ఈ కంపెనీ కన్సల్టింగ్‌ పార్ట్‌నర్‌ సుదేశ్‌ రాజ్‌పుత్‌ పేర్కొన్నారు. ఒక్కో వ్యక్తికి ప్యాకేజీ రూ.25,000 నుంచి ప్రారంభమవుతుందని ఆయన వివరించారు. ట్రావెట్రేట్‌.కామ్‌ ప్యాకేజీ కూడా ఇలాంటిదే. ఢిల్లీలోని ఎలక్షన్‌ మ్యూజియం సందర్శనలో మన ఎన్నికల చరిత్ర, చిరస్మరణీయ నాయకుల గురించి తెలుసుకోవడం, పోలింగ్‌ను తీరును చూపించడం, ఫలితాల రోజు కౌంటింగ్‌ కేంద్రాల వద్ద ఉత్కంఠ, విజేతల సంబరాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం వంటి పలు ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి.

– సాక్షి, నేషనల్‌ డెస్క్‌




### ఎన్నికల వి'చిత్రం'

కేరళలోని త్రిసూర్‌ జిల్లాలో అధికార ఎల్డీఎఫ్‌కు చెందిన త్రిసూర్‌ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి వీఎస్‌ సునీల్‌ కుమార్‌ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో ఇలా ఓ మహిళ సెల్ఫీ సరదా తీర్చుకున్నారు.

# ముంచుకొస్తున్న బర్డ్‌ఫ్లూ ముప్పు!

- అమెరికాలో మరో హెచ్‌5ఎన్‌1 వేరియంట్‌ కేసు
- కోవిడ్‌–19 తరహాలో మహమ్మారిగా మారొచ్చు
- అమెరికా సైంటిస్టుల హెచ్చరిక

ప్రపంచమంతటా కోవిడ్‌–19 మహమ్మారి సృష్టించిన విలయం అందరికీ తెలిసిందే. లక్షల మంది బలయ్యారు. అలాంటి ప్రాణాంతక మహమ్మారి మరొకటి మానవులకు వ్యాపించే అవకాశాలు అధికంగా ఉన్నాయని అమెరికా సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. అమెరికాలోని టెక్సాస్‌లో బర్డ్‌ఫ్లూ వైరస్‌లో హెచ్‌5ఎన్‌1 అనే వేరియంట్‌ తొలుత ఆవులకు, తర్వాత ఆవుల నుంచి ఓ కార్మికుడికి వ్యాప్తి చెందినట్లు గుర్తించారు. అతడిని పరీక్షించగా బర్డ్‌ఫ్లూ పాజిటివ్‌గా తేలింది. ఏప్రిల్‌ 1న ఈ కేసు బయటపడినట్లు యూఎస్‌ సెంటర్‌ ఫర్‌ డిసీజ్‌ కంట్రోల్, ప్రివెన్షన్‌(సీడీసీ) నిర్ధారించింది. బాధితుడి కళ్లు ఎర్రగా మారాయి. బర్డ్‌ఫ్లూ లక్షణాల్లో కండ్లకలక కూడా ఒకటి. అమెరికాలో మనిషికి బర్డ్‌ఫ్లూ హెచ్‌5ఎన్‌1 వేరియంట్‌ సోకడం ఇది రెండో కేసు. బాధితుడిని ఐసోలేషన్‌కు తరలించి, చికిత్స అందించారు. ప్రస్తుతం కోలుకుంటున్నట్లు డాక్టర్లు చెప్పారు. వైరస్‌ సోకినట్లు వెంటనే గుర్తించడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు.

- అమెరికాలో మనుషులకు సోకిన తొలి బర్డ్‌ఫ్లూ కేసు 2022లో కొలరాడోలో బయటపడింది.
- బర్డ్‌ఫ్లూ వైరస్‌ గత కొన్ని దశాబ్దాలుగా మహమ్మారుల జాబితాలో తొలి స్థానంలో ఉందని పిట్స్‌బర్గ్‌కు చెందిన బర్డ్‌ఫ్లూ పరిశోధకుడు డాక్టర్‌ సురేశ్‌ కూచిపూడి చెప్పారు. ఇది ప్రమాదకరంగా మారుతోందని, మనుషులకు సోకే అవకాశాలు పెరుగుతున్నాయని వెల్లడించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
- కోవిడ్‌–19తో పోలిస్తే బర్డ్‌ఫ్లూ హెచ్‌5ఎన్‌1 వేరియంట్‌ 100 రెట్లు ప్రాణాంతకం కావొచ్చని ఫార్మా ఇండస్ట్రీ కన్సల్టెంట్‌ జాన్‌ ఫల్టన్‌ వెల్లడించారు. ఇందులో మ్యుటేషన్లు(మార్పులు) జరిగితే బాధితుల్లో మరణాల రేటు భారీగా పెరుగుతుందని చెప్పారు.
- నిజానికి ఇతర దేశాల్లోనూ మనుషులకు బర్డ్‌ఫ్లూ సోకిన సంఘటనలున్నాయి. 2003 జనవరి 1 నుంచి 2024 ఫిబ్రవరి 26 దాకా 23 దేశాల్లో 887 కేసులు బయటపడ్డాయి. వీరిలో 462 మంది బాధితులు ప్రాణాలు కోల్పోయారు. అంటే 52 శాతం మంది మృత్యువాత పడినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియజేసింది.
- మనుషులు బర్డ్‌ఫ్లూ బారినపడితే శ్వాస ఆడకపోవడం, చలి, అలసట, తలనొప్పి, గొంతునొప్పి, జ్వరం, కండరాల నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. బాధితులకు యాంటీ వైరల్‌ ఔషధాలు ఇస్తుంటారు.

సాక్షి, నేషనల్‌ డెస్క్‌

### సోమా కాంతిసేన్‌కు బెయిల్‌

**న్యూఢిల్లీ:** 2018 నాటి ఎల్గార్‌ పరిషత్‌–మావోయిస్ట్‌ సంబంధాల కేసులో ఉద్యమకారిణి సోమా కాంతి సేన్‌(66)కు సుప్రీంకోర్టు బెయిల్‌ మంజూరు చేసింది. ఆమెను సుదీర్ఘకాలం నిర్బంధించడంతోపాటు అభియోగాల నమోదులో అవుతున్న జాప్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు జస్టిస్‌ అనిరుద్ధ బోస్, జస్టిస్‌ ఆగస్టీన్‌ జార్జి మసీహ్‌ల ధర్మాసనం తెలిపింది. మావోయిస్ట్‌ పార్టీకి కొత్త రిక్రూట్‌మెంట్ల కోసం ఆమె సాయం చేసినట్లుగా ఎన్‌ఐఏ ఎటువంటి ఆధారాలను చూపలేకపోయిందని పేర్కొంది.

### కేజ్రీవాల్‌ అరెస్ట్‌ వెనుక బీజేపీ సీనియర్‌ కుట్ర

**ఆప్‌ ఎంపీ సంజయ్‌సింగ్‌ ఆరోపణ**

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ఎక్సయిజ్‌ పాలసీలో అవకతవకల కేసులో బీజేపీ సీనియర్‌ నేత ఒకరు కుట్ర పన్ని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్‌ చేయించారని ఆమ్‌ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్‌ సింగ్‌ ఆరోపించారు. కేసులో అప్రూవర్‌గా మారిన మాగుంట రాఘవ్‌పై ఒత్తిడి చేసి కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా తప్పుడు వాంగ్మూలం ఇచ్చేలా చేశారని శుక్రవారం ఢిల్లీలో పత్రికాసమావేశంలో సంజయ్‌ చెప్పారు. ఇదే కేసులో చాలా వారాలపాటు జ్యుడీషియల్‌ కస్టడీలో ఉండి సంజయ్‌ రెండు రోజుల క్రితమే బెయిల్‌పై విడుదలైన సంగతి విదితమే. '' కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాలని లోక్‌సభ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డిపై బీజేపీ ఒత్తిడి చేసింది. అందుకు ఆయన ఒప్పుకోలేదు. దీంతో ఆయన కుమారుడు మాగుంట రాఘవ్‌ను లక్ష్యంగా చేసుకుని అరెస్ట్‌చేశారు. పలుమార్లు అధికారులు ప్రశ్నించడంతో మాగుంట రాఘవ్‌ కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా తప్పుడు వాంగ్మూలం ఇచ్చారు. ఇలా పెద్ద కుట్రలో భాగమయ్యారు. ఢిల్లీ సీఎంను కటకటాల వెనక్కి పంపడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది' అని సంజయ్‌ అన్నారు.

### రష్యాపై డ్రోన్లతో దాడి

**కీవ్‌:** రష్యా భూభాగంపై ప్రతి దాడులను ఉక్రెయిన్‌ ముమ్మరం చేసింది. శుక్రవారం సరిహద్దుల్లోని రష్యాకు చెందిన రోస్టోవ్‌ ప్రాంతంపైకి ఉక్రెయిన్‌ పదుల సంఖ్యలో డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో మొరొజొవ్‌స్కీ ఎయిర్‌ ఫీల్డ్‌లోని ఆరు సైనిక విమానాలు ధ్వంసం కాగా, మరో ఎనిమిదింటికి నష్టం వాటిల్లిందని ఉక్రెయిన్‌ తెలిపింది. 20 మంది సిబ్బంది చనిపోయినట్లు ప్రకటించుకుంది. మొరొజొవ్‌స్కీ ప్రాంతంపైకి వచ్చిన 44 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. వైమానిక స్థావరంపై దాడి, యుద్ధ విమానాలకు జరిగిన నష్టంపై రష్యా స్పందించలేదు. దాడుల్లో ఒక విద్యుత్‌ ఉపకేంద్రం మాత్రం ధ్వంసమైందని పేర్కొంది. సరటోవ్, కుర్‌స్క్, బెల్గొరోడ్, క్రాస్నోడార్‌లపైకి వచ్చిన డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా ఆర్మీ తెలిపింది.

# ఐదు న్యాయాలు.. 25 గ్యారంటీలు

## కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టో 'న్యాయ్‌ పత్ర–2024' విడుదల

**సాక్షి, న్యూఢిల్లీ:** సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందు వివిధ సందర్భాల్లో ఇచ్చిన హామీలతో కూడిన ఎన్నికల ప్రణాళిక(మేనిఫెస్టో)ను కాంగ్రెస్‌ పార్టీ విడుదల చేసింది. యువతకు ఉద్యోగాల కల్పన, నిమ్నవర్గాల సంక్షేమం, సంపద సృష్టి వంటి కీలక హామీలను ప్రకటించింది. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ఆపన్న హస్తం అందిస్తామని వాగ్దానం చేసింది. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, అగ్నిపథ్‌ పథకం రద్దు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఎత్తివేత, దేశవ్యాప్తంగా కుల గణన వంటి అంశాలను మేనిఫెస్టోలో చేర్చింది. శుక్రవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌ గాంధీ, మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌ చిదంబరం, కాంగ్రెస్‌ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్‌ 'న్యాయ్‌ పత్ర–2024' పేరిట 45 పేజీల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఇందులో ప్రధానంగా వివిధ వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఐదు న్యాయాలను ప్రకటించారు. ఒక్కో న్యాయం కింద ఐదు గ్యారంటీల చొప్పున మొత్తం 25 గ్యారంటీలు ఇచ్చారు.




శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్‌ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తున్న సోనియా, ఖర్గే, రాహుల్‌

### ఐదు న్యాయాలు ఏమిటంటే..

**నారీ న్యాయ్‌**
- మహాలక్ష్మీ పథకం కింద దేశవ్యాప్తంగా పేద కుటుంబాల్లోని మహిళకు ఏడాదికి రూ.లక్ష నగదు బదిలీ
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు
- ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు రెట్టింపు వేతనం
- మహిళ హక్కుల రక్షణ కోసం ప్రత్యేకంగా 'మైత్రి' అధికారి నియామకం
- మహిళా ఉద్యోగుల కోసం సావిత్రి బాయి పూలే పేరుతో వసతి గృహాలు

**యువ న్యాయ్‌**
- కేంద్ర ప్రభుత్వంలో వివిధ శాఖల్లో 30 లక్షల ఉద్యోగాల భర్తీ
- యువత కోసం 'అప్రెంటీస్‌షిప్‌ హక్కు చట్టం'. డిప్లొమా చదివినవారికి లేదా 25 ఏళ్లలోపు ఉన్న గ్రాడ్యుయేట్‌కు ఏడాది పాటు అప్రెంటీస్‌షిప్‌ చేసే అవకాశం. వారికి సంవత్సరానికి రూ.లక్ష సాయం.
- ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కఠిన చట్టం
- గిగ్‌ వర్కర్ల సామాజిక భద్రతకు చర్యలు
- స్టార్టప్‌ కంపెనీలు ప్రారంభించే యువత కోసం రూ.5,000 కోట్ల నిధి

**కిసాన్‌ న్యాయ్‌**
- స్వామినాథన్‌ కమిషన్‌ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస గిట్టుబాటు ధర(ఎంఎస్పీ)కు చట్టబద్ధత
- రుణమాఫీ కమిషన్‌ ఏర్పాటు
- పంట నష్టపోయిన 30 రోజుల్లో బీమా పరిహారం చెల్లింపు
- రైతులు లబ్ధి పొందేలా ఎగుమతి, దిగుమతి విధానం
- వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ మినహాయింపు

**శ్రామిక్‌ న్యాయ్‌**
- కార్మికుల కోసం ఆరోగ్య హక్కు చట్టం
- కనీస వేతనం రోజుకు రూ.400. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సైతం వర్తింపు
- పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకం అమలు
- అసంఘటిత రంగాల్లోని కార్మికులకు జీవిత బీమా, ప్రమాద బీమా వర్తింపు
- ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాలు రద్దు

**హిస్సేదారీ న్యాయ్‌**
- అధికారంలోకి రాగానే సామాజిక, ఆర్థిక కుల గణన
- ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల విషయంలో 50 శాతం సీలింగ్‌(పరిమితి) తొలగింపు
- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ అమలుకు ప్రత్యేక బడ్జెట్‌ కేటాయింపు
- జల్, జంగల్, జమీన్‌పై చట్టబద్ధమైన హక్కులు
- గిరిజనులు అధికంగా ఉన్న ప్రాంతాలకు షెడ్యూల్డ్‌ ఏరియాలుగా గుర్తింపు

### న్యాయ్‌ పత్రలోని కీలక హామీలు

- సీనియర్‌ సిటిజన్లు, వితంతువులకు నెలకు రూ.1,000 చొప్పున పెన్షన్‌
- రైల్వే ప్రయాణాల్లో వృద్ధులకు రాయితీ
- 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' ఆలోచనకు చెల్లుచీటీ..
- పదో షెడ్యూల్‌ సవరణ. పార్టీ ఫిరాయించిన నేతల లోక్‌సభ, అసెంబ్లీ సభ్యత్వాలు రద్దు
- సైన్యంలో నియామకాలకు ఉద్దేశించిన అగ్నిపథ్‌ పథకం రద్దు
- అన్ని కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈడబ్ల్యూఎస్‌) విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో 10 శాతం కోటా అమలు.
- జమ్మూకశ్మీర్‌కు, పుదుచ్చేరికి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా
- ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా

### ఎన్నికల తర్వాత ప్రధాని అభ్యర్థి: రాహుల్‌

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అధికార ఎన్డీయేకు పరాభవం తప్పదని కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీ స్పష్టంచేశారు. 2004లో 'భారత్‌ వెలిగిపోతోంది' అంటూ ఎన్నికలకు వెళ్లిన ఎన్డీయే బోల్తా పడిందని, ఈసారి కూడా అదే పునరావృతం కాబోతోందని జోస్యం చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్‌ మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో 'ఇండియా' కూటమి విజయం ఖాయమని అన్నారు. ఎన్నికల్లో నెగ్గిన తర్వాత తమ ప్రధానమంత్రి అభ్యర్థిని ఉమ్మడిగా నిర్ణయిస్తామని తెలిపారు. తమ పార్టీ మేనిఫెస్టోను ప్రజలే రూపొందించారని, ఇందులో అక్షరాలను మాత్రమే తాము ముద్రించామని వివరించారు. 99 శాతం మంది ప్రజలు కోరుకున్న అంశాలు మేనిఫెస్టోలో ఉన్నాయని తెలిపారు. అదానీ లాంటి కేవలం ఒకటి, రెండు శాతం మంది బడా బాబులు కోరుకున్న అంశాలు బీజేపీ మేనిఫెస్టోలో ఉంటాయని ఎద్దేవా చేశారు.

# ఆ పదాలు తొలగింపు

## స్కూలు పాఠ్యపుస్తకాల్లో మార్పులు సూచించిన ఎన్‌సీఈఆర్‌టీ

**న్యూఢిల్లీ:** పాఠశాల పాఠ్యపుస్తకాల్లో బాబ్రీ మసీదు కూల్చివేత, గుజరాత్‌ అల్లర్లలో ముస్లింల హత్య, హిందూత్వ తదితర పదాలు, వాక్యాలను తొలగిస్తున్నట్లు జాతీయ విద్యాపరిశోధనా, శిక్షణా మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) పేర్కొంది. పాఠ్యపుస్తకాల్లో కాలానుగుణంగా చేయాల్సిన మార్పుల్లో భాగంగా ఈ సవరణలు చేపట్టినట్లు ఎన్‌సీఈఆర్‌టీ తెలిపింది. ఆర్టికల్‌ 370 రద్దుకు సంబంధించిన అంశంలో పాక్‌ ఆక్రమిత జమ్మూకశ్మీర్‌(పీఓకే) అనే పదానికి బదులు ఆజాద్‌ పాకిస్తాన్‌ అనే పదాన్ని చేర్చారు. పుస్తకాల నుంచి కొన్ని పాఠ్యాంశాల తొలగింపుపై ఎన్‌సీఈఆర్‌టీ స్పందించింది. '' పుస్తకాల ఆధునీకరణలో జరిగే సాధారణ ప్రక్రియ ఇది. నూతన విద్యా ప్రణాళిక కింద చేసే కొత్త పాఠ్యపుస్తకాల తయారీకి దీనితో ఏ సంబంధం లేదని అధికారులు స్పష్టంచేశారు. ఇతర తరగతుల పుస్తకాలతోపాటు 11, 12 తరగతుల రాజనీతి శాస్త్రం, సామాజిక శాస్త్ర పాఠ్య పుస్తకాల్లో ఈ మార్పులు చేశారు. 11వ తరగతిలో లౌకికవాదం అనే 8వ చాప్టర్‌లో '' 2002 గుజరాత్‌ గోద్రా అల్లర్ల తర్వాత వేయికిపైగా ఊచకోతకు బలయ్యారు. ఇందులో ముస్లింలే ఎక్కువ'' అనే వాక్యంలో ముస్లింలు అనే పదం తొలగించారు. అల్లర్ల ప్రభావం అన్ని మతాలపై ఉన్న కారణంగా ఒక్క మతాన్నే ప్రస్తావించడం సబబు కాదని ఎన్‌సీఈఆర్‌టీ భావించింది. 12వ తరగతి రాజనీతిశాస్త్రం పుస్తకంలోని 'స్వాతంత్ర్యం నుంచి భారత రాజకీయాలు' చాప్టర్‌లో కొత్తగా ఆర్టికల్‌ 370 రద్దును జతచేశారు. 8వ చాప్టర్‌లో '' 1992 డిసెంబర్‌లో బాబ్రీ మసీదు కూల్చివేతతో ఎన్నో విపరిణామాలు జరిగాయి. ఇది బీజేపీ, హిందూత్వ వ్యాప్తికి దారితీసింది''అన్న వాక్యాలకు బదులు 'శతాబ్దాలనాటి రామజన్మభూమి ఆలయ వివాదం దేశ రాజకీయాలనే మార్చేసింది'' అని మార్చారు. ఇందులో హిందూత్వ పదాన్ని తొలగించారు.

## ఎలక్షన్‌ బీట్‌

### అసలైన అభివృద్ధి ముందుంది

**గత పదేళ్ల పాలన భోజనంలో ఒక స్టార్టర్‌ మాత్రమే: మోదీ**



**జైపూర్‌:** ప్రధాని నరేంద్ర మోదీ తమ పదేళ్లకాలంలో దేశంలో జరిగిన అభివృద్ధిని ఆకలి పుట్టించే స్టార్టర్‌గా అభివర్ణించారు. అసలైన అభివృద్ధి భోజనం ముందుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజస్థాన్‌లోని చురులో జరిగిన ర్యాలీలో మోదీ మాట్లాడారు. భారత సైన్యాన్ని కాంగ్రెస్‌ అవమానిస్తోందని ఇదే కాంగ్రెస్‌ అసలైన మనస్తత్వమని విపక్ష పార్టీపై మోదీ విమర్శలు గుప్పించారు. ' ఇప్పుడున్న నయా భారత్‌ శత్రువును ఇంట్లోకి చొరబడి మరీ దెబ్బ కొట్టగలదు. శత్రువు గడ్డపైనా దాడి చేసే సరికొత్త భారత్‌ ఆవిష్కృతమైంది' అని అన్నారు. '' గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి ఒక ట్రైలర్‌ మాత్రమే. అది భోజనాల వేళ ఆకలి పుట్టించే స్టార్టర్‌ మాత్రమే. అసలైన మెయిన్‌ కోర్సు భోజనం(అభివృద్ధి) ముందుంది. చేయాల్సిన అభివృద్ధి ఇంకా చాలా ఉంది. ఇంకా ఎన్నో కలలున్నాయి. దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి మనం' అని అన్నారు.

### మంత్రి అతిశికి ఈసీ నోటీసులు



**సాక్షి, న్యూఢిల్లీ:** ఆప్‌ నాయకురాలు, ఢిల్లీ మంత్రి అతిశికి కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం షోకాజ్‌ నోటీసులు జారీ చేసింది. బీజేపీలో చేరకపోతే నెలరోజుల్లోపు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ అరెస్ట్‌చేస్తుందని బీజేపీ తనను తన సన్నిహిత వ్యక్తి ద్వారా సంప్రదించిందని అతిశి ఏప్రిల్‌ రెండో తేదీన సంచలన వ్యాఖ్యలు చేయడం తెల్సిందే. ఈ వాఖ్యలు అవాస్తవాలని పేర్కొంటూ బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దీంతో శుక్రవారం అతిశికి ఈసీ షోకాజ్‌ నోటీసులు పంపింది. బీజేపీపై చేసిన వ్యాఖ్యలకు బలం చేకూర్చే అంశాలను పేర్కొంటూ సోమవారం మధ్యాహ్నంకల్లా తమకు వివరణ ఇవ్వాలని షోకాజ్‌ నోటీసులో ఈసీ పేర్కొంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న వేళ ఇతర పార్టీల నేతలపై ఆరోపణలు చేసేప్పుడు అప్రమత్తంగా ఉండాలని, నిరాధార ఆరోపణలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందకు వస్తాయని ఈసీ స్పష్టంచేసింది.

### బీజేపీలో చేరిన ఎంపీ సుమలత



**యశవంతపుర:** బహుభాషా నటి, కర్ణాటకలోని మాండ్య స్వతంత్ర ఎంపీ సుమలతా అంబరీశ్‌(60) శుక్రవారం బీజేపీలో చేరారు. బెంగళూరులోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్‌ నేత యడియూరప్ప, పార్టీ రాష్ట్ర చీఫ్‌ విజయేంద్ర తదితరుల సమక్షంలో సుమలత పార్టీ కండువా కప్పుకున్నారు. తన రాజకీయ జీవితంలో ఇది ముఖ్యమైన మంచి రోజుగా సుమలత పేర్కొన్నారు.

### ఎస్పీ అభ్యర్థి నామినేషన్‌ తిరస్కృతి

**పన్నా(మధ్యప్రదేశ్‌):** మధ్యప్రదేశ్‌లోని ఖజురహో లోక్‌సభ స్థానంలో ప్రతిపక్ష ఇండియా కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా కాంగ్రెస్‌ పార్టీ ఈ స్థానాన్ని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)కి కేటాయించింది. ఎస్పీ అభ్యర్థి వేసిన నామినేషన్‌ పత్రాలను రిటర్నింగ్‌ అధికారి తిరస్కరించారు. 'ఎస్పీ అభ్యర్థిని మీరా యాదవ్‌ బీ ఫారంలో సంతకం చేయలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ధ్రువీకరించిన ప్రతిని జత చేయలేదు. ఈ కారణాలతో రిటర్నింగ్‌ అధికారి కూడా అయిన పన్నా జిల్లా కలెక్టర్‌ ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు' అని సీనియర్‌ అధికారి ఒకరు తెలిపారు.

### శశి థరూర్‌కు రూ. 55 కోట్ల ఆస్తులు

**తిరువనంతపురం:** కేరళలోని తిరువనంతపురం లోక్‌సభ సీటును వరుసగా నాలుగోసారి కైవసం చేసుకోవాలని చూస్తున్న కాంగ్రెస్‌ నేత శశి థరూర్‌ తనకు రూ.55 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు ప్రకటించారు. ఇందులో చరాస్తుల విలువ రూ.49 కోట్లు కాగా, రూ.6.75 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.4.32 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రెండు కార్లు ఉన్నట్లు చెప్పారు. 2014 ఎన్నికల సమయంలో రూ.23 కోట్ల ఆస్తులు, 2019 ఎన్నికల అఫిడవిట్‌లో రూ.35 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు థరూర్‌ వెల్లడించారు.

### ప్రపంచంలోనే 'పిన్న' బిలియనీర్‌గా లివియా



**వాషింగ్టన్‌:** ప్రపంచంలోనే అత్యంత చిన్న వయసులోనే ఫోర్బ్స్‌ బిలియనీర్ల జాబితాలో స్థానం సంపాదించి 19 ఏళ్ల కాలేజీ అమ్మాయి లివియా వొయిట్‌ చరిత్ర సృష్టించింది. 20 ఏళ్లుకూడా నిండని ఈమెకు అత్యంత సంపన్నుడైన తాత నుంచి వారసత్వంగా కోట్ల షేర్లు దక్కడంతో ఒక్కసారిగా వేల కోట్ల అధిపతి అయ్యింది. బ్రెజిల్‌కు చెందిన డబ్ల్యూఈజీ కంపెనీని లివియా తాత వెర్నెర్‌ రికార్డో వొయిట్‌ మరో ఇద్దరితో కలిసి స్థాపించారు. ఫోర్బ్స్‌ సంస్థ 33 ఏళ్ల వయసులోపు ఉన్న 25 మంది యువ బిలియనీర్ల జాబితాను తాజాగా విడుదలచేసింది. ఇందులో లివియా పేరు కూడా ఉంది. దాదాపు రూ.9,165 కోట్ల(1.1 బిలియన్‌ డాలర్ల) సంపదతో ప్రపంచంలో బిలియనీర్‌ అయిన అత్యంత చిన్న వయస్కురాలుగా ఈమె పేరు రికార్డులకెక్కింది. కోట్లకు పడగలెత్తినా ఇంకా ఆమె కంపెనీ బోర్డులో సభ్యురాలిగా చేరలేదు. ఆస్తులతో నాకేం పని అన్నట్లుగా నిరాడంబరంగా లివియా ప్రస్తుతం బ్రెజిల్‌ విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదువుతోంది.

### అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి

**న్యూయార్క్‌:** అమెరికాలోని ఓహియో రాష్ట్రం క్లీవ్‌లాండ్‌లో ఉమా సత్యసాయి గద్దె అనే తెలుగు విద్యార్థి చనిపోయాడు. ఈ విషయాన్ని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్‌ కార్యాలయం శుక్రవారం తెలిపింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్లు 'ఎక్స్‌'లో పేర్కొంది. ఉమా గద్దె మృతదేహాన్ని సాధ్యమైనంత త్వరగా భారత్‌కు పంపేందుకు అవసరమైన సాయం అందిస్తామని తెలిపింది.

## ఆక్వా సంక్షోభానికి కారణం నువ్వు కాదా..?

### చంద్రబాబు వ్యాఖ్యలపై ఏపీఏసీఏ కో వైస్ చైర్మన్ రఘురాం ధ్వజం



సాక్షి, అమరావతి: చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆక్వా రంగాన్ని ఏనాడు పట్టించుకోని ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ కపటప్రేమను చూపిస్తున్నారని ఏపీ ఆక్వా కల్చర్ అథారిటీ కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. నర్సాపురంలో శుక్రవారం జరిగిన ప్రజాగళం సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఆక్వా రంగాన్ని ఈ ప్రభుత్వం సంక్షోభంలో నెట్టేసిందని, తానొచ్చి మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తానంటూ చంద్రబాబు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు నిర్వాకంతో సంక్షోభంలో కూరుకుపోయిన ఆక్వా రంగానికి అన్ని విధాలుగా అండగా నిలిచింది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. జగన్ సర్కార్ తీసుకున్న చర్యల ఫలితంగా సంక్షోభం నుంచి మళ్లీ గాడిలో పడిందన్నారు. ఆక్వా కార్యకలాపాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు ఆక్వా కల్చర్ అథారిటీని ఏర్పాటుచేసి నాణ్యమైన సీడ్, ఫీడ్ అందించేందుకు ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఆక్వా సాగు చేసే రైతులకు సచివాలయాల ద్వారా లైసెన్సులు జారీ చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.340 కోట్ల విద్యుత్ సబ్సిడీ బకాయిలన్నీ చెల్లించిందన్నారు. అస్తవ్యస్థంగా ఉన్న ఆక్వా జోన్ విధానాన్ని చక్కదిద్ది, జోన్ పరిధి లోని 10 ఎకరాల్లోపు సాగు చేసే రైతులందరికీ యూనిట్ రూ.1.50లకే విద్యుత్‌ను అందిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. గడిచిన రూ.3600 కోట్ల విద్యుత్ రాయితీని అందించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తన పాలనలో 100 కౌంట్ రూ.130లకు పడిపోతే ఒక్కరోజైనా రొయ్య రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న ఆలోచన కూడా చంద్రబాబు చేయలేదన్నారు. కానీ జగన్ ప్రభుత్వం ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రతీకౌంట్‌కు ధరలు నిర్ణయించి రైతులకు దక్కేలా ప్రతీ 15 రోజులకోసారి సమీక్షించిందన్నారు. మూడుసార్లు పెంచిన ఫీడ్ ధరలను తగ్గించి నాణ్యమైన సీడ్, ఫీడ్ అందించిందన్నారు. కరోనా విపత్తు వేళ రైతుల వద్ద ఉన్న ప్రతీ రొయ్యకు గిట్టుబాటు ధర కల్పించిందన్నారు. ఆక్వా రైతులకు ఉపయోగపడేలా నర్సాపురం వద్ద ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటు చేసిందన్నారు. గుంటూరులో మెగా ఆక్వా పార్కు, నక్కపల్లి వద్ద ఆక్వాటిక్ క్వారంటైన్ సెంటర్ ఏర్పాటు చేస్తోందన్నారు. గడిచిన ఐదేళ్లలో తమకు అండగా నిలిచిన జగన్ సర్కార్ వెంట ఆక్వారైతులు ఉన్నారని, బాబును నమ్మే స్థితిలో రాష్ట్రంలో ఏ ఒక్క ఆక్వా రైతు లేడని వివరించారు.

# పెళ్లి సాయంపైనా కుళ్లు రాతలు

## మాస్ మ్యారేజ్ స్కీమ్‌ను అమలులోకి తెచ్చిన దివంగత వైఎస్సార్

- 2015లో 'దుల్హన్'గా పేరు మార్చిన చంద్రబాబు
- రూ.177.96 కోట్ల బకాయిలు చెల్లించిన సీఎం వైఎస్ జగన్
- 56,194 జంటలకు రూ.427.27కోట్ల లబ్ధి




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేద బిడ్డల పెళ్లికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంపైనా రామోజీ కుళ్లు రాతలు మానలేదు. క్రిస్టియన్ మైనారిటీలకు అందించే 'వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా' పథకంపై 'మేనిఫెస్టోలో ఆమెన్.. ఆనక మరిచెన్' అనే తప్పుడు కథనంతో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేశారు. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే పేద బిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక ప్రోత్సాహం పెంచడంతో పాటు గత ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలను సైతం లబ్ధిదారులకు అందించిందనే విషయాన్ని ఈనాడు విస్మరించింది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికులకు చెందిన 56,194 జంటలకు రూ.427.27 కోట్ల ఆర్థిక సాయం అందించి వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది.

**ఆరోపణ: వాగ్దానాల అమలుకు ఒక్క రోజు కూడా చర్యలు తీసుకోలేదు**

వాస్తవం: గత ప్రభుత్వం హామీలను గుప్పించి అమలు చేయకపోగా అధికారిక వెబ్‌సైట్‌లోనూ మేనిఫెస్టో మాయం చేశారు. ఇది రామోజీ పచ్చ కళ్లకు కన్పించ లేదు. మేనిఫెస్టోను ఖురాన్, బైబిల్, భగవద్గీతలా భావించి అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌ది. మేనిఫెస్టోను కళ్ల ముందే కన్పించేలా డిస్‌ప్లే చేస్తూ అందులో ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేసేలా షెడ్యూల్ ప్రకటించి ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవహరిస్తున్నారు. అయినా సీఎం వైఎస్ జగన్‌పై విషం కక్కే రాతలు రాసింది. క్రైస్తవులకు టీడీపీ హయాంలో అమలు చేసిన పెళ్లి కానుక పథకాన్ని పక్కన పెట్టినట్టు అబద్ధాలు రాసింది. క్రిస్టియన్ మైనారిటీలకు ఆర్థిక సాయం అందిస్తున్నప్పటికీ అదేం లేదంటూ అడ్డగోలు రాతలు అచ్చేసింది.

**ఆరోపణ: పెళ్లి కానుక అటకెక్కించారు**

వాస్తవం: క్రైస్తవ యువతుల పెళ్లికి గత టీడీపీ ప్రభుత్వం అండగా నిలిచినట్టు రామోజీ అడ్డగోలుగా అబద్ధాలు రాసేశారు. పేద బిడ్డల పెళ్లికి సాయం అందించేలా దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ 'మాస్ మ్యారేజ్' పేరుతో ఆర్థిక సాయాన్ని అందించారు. క్రైస్తవ ఆడ బిడ్డల పెళ్లికి రూ.25వేల ఆర్థిక సాయం, కొత్త బట్టలతోపాటు పెళ్లి వస్తువులు అందించేవారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో 'దుల్హాన్' పథకంగా పేరు మార్చి అమలు చేశారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు హడావుడిగా 2018లో రూ.25వేల సాయాన్ని రూ.50వేలకు పెంచుతున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. పెంచిన మొత్తాన్ని అందించకపోగా బకాయిలు పెట్టారు. 2018 నుంచి జరిగిన 43,490 జంటల(పెళ్లిళ్ల)కు రూ.177.96 కోట్ల బకాయిలను గత ప్రభుత్వం చెల్లించలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బకాయిలను సైతం విడుదల చేసింది. ఈ వాస్తవాన్ని ఈనాడు మరుగున పరిచింది.

**ఆరోపణ: పరిశీలన లేదు.. ఎంపిక లేదు**

వాస్తవం: గత ప్రభుత్వం గొప్పలను డబ్బా కొట్టిన ఈనాడుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శకంగా షాదీ తోఫా పథకాన్ని అమలు చేయడం మింగుడు పడలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడు నెలలకు(త్రైమాసికం) ఒకసారి లబ్ధిదారులందరికీ సాయం విడుదల చేస్తోంది. గత ప్రభుత్వం వధువుకు సాయం అందిస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వధువు తల్లికి అందజేస్తోంది. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ఐకేపీల పరిధిలోని మండల సమాఖ్య ద్వారా ఎంపిక చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఎంపిక చేస్తోంది. గత ప్రభుత్వంలో పట్టణ, గ్రామీణ లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలంటే అవస్థలు పడేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో రాష్ట్రంలోని 15,004 గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా స్థానికంగా దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు కలిగింది. గత ప్రభుత్వంలో బకాయిలు కాలానుగుణంగా విడుదల చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో వివాహం జరిగిన తేదీ నుండి 30 రోజులలోపు దరఖాస్తు చేసుకుంటే మూడు నెలలకు ఒకసారి అప్పటి వరకు వచ్చిన దరఖాస్తులకు ఆర్థిక సాయం అందిస్తోంది. ఆడ పిల్లల చదువులను ప్రోత్సహించాలనే మహోన్నత లక్ష్యంతో వివాహాలు చేసుకునే వారు కనీసం పదవ తరగతి విద్యార్హత ఉండాలని నిబంధన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెట్టింది. దీని వల్ల పేద వర్గాలకు చెందిన ఆడపిల్లలందరూ పదవ తరగతికి తగ్గకుండా చదువుకున్నారు. ఉన్నత చదువులు చదివించాలనే సీఎం వైఎస్ జగన్ ఉన్నతాశయం ఆచరణలో మంచి ఫలితాలు ఇస్తోంది. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన వంటి పథకాల ద్వారా ఉన్నత విద్యకు మంచి ప్రోత్సాహం అందిస్తున్నారు.

**ఆరోపణ: ఇచ్చిన జీవోకే మళ్లీ జీవో**

వాస్తవం: పేద బిడ్డల పెళ్లికి గత ప్రభుత్వం ఏం చేసింది.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతమేరకు సాయం అందిస్తోంది అనేది గమనిస్తే చాలు ఈనాడు రోత రాతల వెనుక ఉన్న మర్మం ఏమిటో తెలుస్తుంది. గత ప్రభుత్వం అరకొర సాయాన్ని కూడా సకాలంలో చెల్లించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాత బకాయిలు సైతం చెల్లించి ఆర్థిక సాయం పెంచి అందించింది.

### వివరాలు ఇవిగో

| కేటగిరి | జగనన్న ప్రభుత్వం (రూ.లలో) | గత ప్రభుత్వం (రూ.లలో.) |
|---|---|---|
| షెడ్యూల్డ్ కులం(ఎస్సీ) | 1,00,000 | 40,000 |
| షెడ్యూల్డ్ కులం(ఎస్సీ) కులాంతర వివాహం | 1,20,000 | 75,000 |
| షెడ్యూల్డ్ తెగ(ఎస్టీ) | 1,00,000 | 50,000 |
| షెడ్యూల్డ్ తెగ(ఎస్టీ) కులాంతర వివాహం | 1,20,000 | 75,000 |
| వెనుకబడిన తరగతులు(బీసీ) | 50,000 | 35,000 |
| వెనుకబడిన తరగతులు(బీసీ) కులాంతర వివాహం | 75,000 | 50,000 |
| మైనారిటీలు | 1,00,000 | 50,000 |
| విభిన్న ప్రతిభావంతులు | 1,50,000 | 1,00,000 |
| భవన నిర్మాణ కార్మికులు | 40,000 | 20,000 |

### సామాజిక వర్గాల వారీగా సాయం

| సామాజికవర్గం | ఎంతమందికి | రూ.కోట్లు |
|---|---|---|
| బీసీ | 30,033 | 162.48 |
| ఎస్సీ | 17,153 | 173.85 |
| ఎస్టీ | 2,877 | 29.64 |
| మైనారిటీ | 4,997 | 51.53 |
| భవన నిర్మాణ, దివ్యాంగులు | 1,134 | 9.77 |

**మైనారిటీలను ఆదుకున్నది జగన్ ప్రభుత్వం**



రాష్ట్రంలో మైనారిటీలను ఆదుకున్నది సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వమే అనేది గర్వంగా చెప్పగలం. ఏపీ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 1,82,270 మందికి రూ.416.56 కోట్ల లబ్ధి చేకూర్చింది. నవరత్నాల్లోని సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ ద్వారా రూ.13,239.49 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా మరో 11,064.88కోట్ల లబ్ధిని అందించింది. ఐదేళ్లలో మొత్తం రూ.24,304.37కోట్లు చెల్లించింది. మైనారిటీ వర్గాలను రాజకీయ, సామాజిక, ఆర్థికంగా ముందుకు నడిపిస్తూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ నిలుస్తున్నారు.

– బొల్లవరపు జాన్ వెస్లీ, చైర్మన్, ఏపీ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్

# రాష్ట్రం నిప్పుల కుంపటి!

- పలు చోట్ల 44 డిగ్రీల నమోదు
- ప్రతాపం చూపిన వడగాడ్పులు
- నేడు, రేపు మరింత పెరిగే అవకాశం
- 46 డిగ్రీలకు చేరుకోనున్న ఉష్ణోగ్రతలు?
- 8, 9 తేదీల్లో తేలికపాటి వర్షాలతో ఉపశమనం



సాక్షి, విశాఖపట్నం: వేసవి ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడంతో రాష్ట్రం నిప్పుల కుంపటిలా మారింది. మే మధ్యలో నమోదు కావలసిన ఉష్ణోగ్రతలు ఏప్రిల్ మొదటి వారంలోనే రికార్డవుతున్నాయి. అనేక చోట్ల వడగాడ్పులు, కొన్నిచోట్ల తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. ఫలితంగా జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. వడగాడ్పులు రోజురోజుకూ అధికమవుతున్నాయి. ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 3 నుంచి 6 డిగ్రీలు అధికంగా నమోదవుతూ దడ పుట్టిస్తున్నాయి. కొన్ని చోట్ల 44 డిగ్రీలకు మించిపోగా, పలు చోట్ల 40 నుంచి 43 డిగ్రీలు నమోదయ్యాయి. ముఖ్యంగా రాయలసీమలోని నంద్యాల, కర్నూలు, వైఎస్సార్, చిత్తూరు, తిరుపతి, దక్షిణ కోస్తాంధ్రలోని ప్రకాశం, పల్నాడు, ఏలూరు జిల్లాల్లో, ఉత్తర కోస్తాలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో ఉష్ణతీవ్రత అధికంగా ఉంది. శుక్రవారం అత్యధికంగా నంద్యాల జిల్లా ఆలమూరులో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. లద్దగిరి (కర్నూలు) 44.2, మద్దూరు (వైఎస్సార్), గురజాల (పల్నాడు)ల్లో 44.1, తిప్పాయపాలెం (ప్రకాశం) 44, జి.సిగడాం (శ్రీకాకుళం) 43.8, మాడుగుల (అనకాపల్లి) 43.7, నింద్ర (చిత్తూరు) 43.6, గుర్ల (విజయనగరం) 43.5, పెదమాండ్యం (అన్నమయ్య) 43.4, ఎం.నెల్లూరు (తిరుపతి), తలుపుల (సత్యసాయి)ల్లో 43, రెంటచింతల (పల్నాడు) 42.6 డిగ్రీలు డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**నేడు, రేపు మరింత తీవ్రం**

రానున్న రెండు రోజులు రాష్ట్రంలో ఎండలు, వడగాడ్పులు మరింత తీవ్రం కానున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం తెలిపింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల వరకు చేరుకునే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం రాష్ట్రంలోని 94 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 159 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. ఈ సంస్థ అంచనా ప్రకారం.. శనివారం 179 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 208 మండలాల్లో వడగాడ్పులు, ఆదివారం 44 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 193 మండలాల్లో వడగాడ్పులు వీయనున్నాయి. శనివారం శ్రీకాకుళం జిల్లాలో 26, విజయనగరం 25, పార్వతీపురం మన్యం 15, అనకాపల్లి 16, అల్లూరి సీతారామరాజు 9, కాకినాడ 13, కోనసీమ 7, తూర్పు గోదావరి 16, ఏలూరు 4, కృష్ణా 4, ఎన్టీఆర్ 6, గుంటూరు 14, పల్నాడు 17, బాపట్ల 1, తిరుపతి 1, ప్రకాశం జిల్లాలోని 2 మండలాల్లోను తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని వివరించింది. మరోవైపు ఈనెల 8, 9 తేదీల్లో రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవవచ్చని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. ఫలితంగా ఆ రెండు రోజులు ఉష్ణోగ్రతలు తగ్గి ఉష్ణతాపం నుంచి తాత్కాలిక ఉపశమనం కలిగించనుంది.

# బాబు కోసం బరితెగించొద్దు!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి మండిపడ్డారు. ఈసీ రాజ్యాంగ నిబంధనలను పాటిస్తూ కొత్తగా ఒక ఐజీ, ఐదుగురు ఎస్పీలు, ముగ్గురు కలెక్టర్లను నియమిస్తే 'వీళ్లా.. కొత్త ఎస్పీలు' అంటూ ప్రశ్నించే హక్కు రామోజీకి ఎక్కడిదని ప్రశ్నించారు. నిరాధార ఆరోపణలతో ఈనాడు పత్రిక ఈసీ ప్రతిష్టకు భంగం కలిగించడంతోపాటు యావత్ ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐపీఎస్ అధికారులంటే.. రామోజీ తన ఫిల్మ్ సిటీలో పని చేస్తున్న గార్డులుగా భావిస్తున్నట్లుందని పౌర సంఘాలు సైతం తీవ్రంగా తప్పుపట్టాయి. ఎలక్షన్ కమిషన్ నియామకాలను తప్పు పడుతున్నారంటే రామోజీ తనకు తాను రాజ్యాంగేతర శక్తిగా భావిస్తున్నట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఒక వర్గానికి కొమ్ము కాసేలా, రెండు ప్రభుత్వ వ్యవస్థల మధ్య అపోహలు కల్పించేలా ఈనాడు, దాని తోక పత్రిక, కొంత మంది టీడీపీ నేతలు నిత్యం పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని నిప్పులు చెరిగాయి.

## రాజ్యాంగేతర శక్తి అనుకుంటున్నారు..

చింత చచ్చినా పులుపు చావలేదు అంటే ఇదేనేమో.. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు ఛీకొట్టి నిర్ద్వందంగా తిరస్కరించి ఐదేళ్లు అవుతున్నా ఈనాడు రామోజీరావు మాత్రం తాను ఇంకా రాజ్యాంగేతర శక్తినేనని భావిస్తున్నారు. తాను చెప్పిందే శాసనం.. తన మాటే వేదం అన్నట్టుగా సాగాలని అనుకుంటున్నారు. అందుకోసం ఏకంగా రాజ్యాంగ బద్ధ సంస్థ ఎన్నికల కమిషన్ (ఈసీ)నే తూలనాడుతున్నారు. ఈసీ అంటే తన జేబు సంస్థ అన్నట్టుగా... తన ఆదేశాలే పాటించాలని, ఈనాడు ఉద్యోగుల్లా తన మనసెరిగి మసలుకోవాలని హుకుం జారీచేస్తున్నారు. తమ బాబుకు అనుకూలంగా జరిగితే ఆహా.. ఓహో.. అంటామని, అలా కాకుండా రాజ్యాంగ నిబంధనల మేరకు నిక్కచ్చిగా వ్యవహరిస్తామంటే మాత్రం ఎవరినైనా సరే బురదజల్లి బజారుకీడుస్తామని రామోజీరావు పాత్రికేయ వీరంగం వేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో కొందరు ఎస్పీలను ఈసీ నియమిస్తే.. 'వీళ్లా కొత్త ఎస్పీలు..?' అంటూ ఈనాడు పతాక శీర్షికన కథనాన్ని అచ్చేయడం రామోజీరావు పెత్తందారి పోకడలకు నిదర్శనం. ఎస్పీలు అంటే అఖిల భారత సర్వీసు అధికారులు కాదు.. తన ఇంటి నౌకర్లు.. ఫిలింసిటీ గార్డులు అన్నట్టుగా రామోజీరావు తన ఈనాడు పత్రిక నిండా విషాక్షరాలు కక్కడం పాత్రికేయ నైచత్వానికి పరాకాష్ట. ఈనాడు పాత్రికేయ దుర్మార్గంపై రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వంటి రాజ్యాంగబద్ధ సంస్థ ఎన్నికల కమిషన్ ప్రతిష్టకు భంగకరంగా ఈనాడు పత్రిక దుష్ప్రచారం చేసిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి మండిపడ్డారు. అసలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నప్పుడు అధికారుల పోస్టింగుల ప్రక్రియ ఎలా సాగుతుందన్న కనీస పరిజ్ఞానం ఈనాడు పత్రికకు ఉందా అని ఆయన నిలదీశారు. నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారుల మనో స్థైర్యాన్ని దెబ్బ తీసేందుకు ఈనాడు పత్రిక కుట్ర పన్నిందని రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ధ్వజమెత్తింది. అటువంటి దుష్ప్రచారానికి పాల్పడుతున్న వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని కూడా స్పష్టం చేసింది. ఈనాడు రామోజీరావు రాజ్యాంగబద్ధ సంస్థల ప్రతిష్టను దెబ్బతీస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని పౌర సమాజం తీవ్రంగా దుయ్యబట్టింది. ఈనాడు పత్రిక రాజకీయ కుట్రలపై ఈసీకి, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేస్తామని ఏపీ ఇంటెలెక్చువల్ అండ్ సిటిజన్స్ ఫోరం, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ తెలిపాయి. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగబద్ధ సంస్థ ఈసీతోపాటు యావత్ అధికార యంత్రాంగంపై ఈనాడు రామోజీరావు దుష్ప్రచారం చేయడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతోంది.


వీళ్లా కొత్త ఎస్పీలు?
సగానికి పైగా వైకాపా విధేయులే!

## పరాజయానికి సాకులు

త్వరలో నిర్వహించనున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ మరోసారి దారుణంగా ఓడిపోనుందన్నది ఇప్పటికే స్పష్టమైంది. 'జై జగన్' అనే జన నినాదాలతో 'సిద్ధం' సభలు మార్మోగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజలు 'వన్స్ మోర్ జగన్' అని ముక్తకంఠంతో నినదిస్తున్నారని జాతీయ చానళ్ల సర్వేలు పదేపదే వెల్లడిస్తున్నాయి. దాంతో బెంబేలెత్తిన చంద్రబాబు, రామోజీరావులు తమకు అలవాటైన రీతిలో కుట్ర రాజకీయాలకు తెరతీశారు. అందులో భాగంగా అధికార యంత్రాంగం మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు పన్నాగం పన్నారు. మరిది మనసెరిగి మసలుకుంటున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, చంద్రబాబు దత్త పుత్రుడు పవన్ కళ్యాణ్ ఈ కుట్రలో భాగస్వాములయ్యారు. దాంతో ఈ ఎల్లో గ్యాంగ్ దురుద్దేశపూరితంగా రాష్ట్రంలోని ఎస్పీలు, కలెక్టర్లు, ఇతర అఖిల భారత సర్వీసు అధికారులపై నిరాధార ఆరోపణలతో హడావుడి చేస్తోంది. సమర్థ పనితీరు, చిత్తశుద్ధితో నిమిత్తం లేకుండా శ్రీకాకుళం జిల్లా నుంచి అనంతపురం జిల్లా వరకు మొత్తం ఎస్పీలు, కలెక్టర్లు, డీఐజీలు, డీజీ స్థాయి అధికారుల వరకు ఓ జాబితా తయారు చేసి వారందరినీ బదిలీ చేయాలని ఈసీకి విజ్ఞప్తులపై విజ్ఞప్తులు చేశారు. ఓ వైపు చంద్రబాబు, లోకేశ్.. మరోవైపు పురందేశ్వరి, పవన్.. దీనికి తోడు టీడీపీ అనుకూల ఎల్లో మీడియా రాష్ట్రంలోని ఉన్నతాధికారులపై అవాకులు చవాకులు పేలుతూ ప్రజల్ని తప్పుదారి పట్టించడానికి, వ్యవస్థలను ప్రభావితం చేసేందుకు యత్నించారు. తద్వారా రానున్న ఎన్నికల్లో తమ ఓటమికి ఇప్పటి నుంచే సాకులు వెతుక్కునే పనిలో పడింది పచ్చ ముఠా.

## అది రాజకీయ దురుద్దేశమే



ఎన్నికల విధులు నిర్వహిస్తున్న రాష్ట్ర అధికార యంత్రాంగం నిబద్ధత, మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఈనాడు పత్రిక దురుద్దేశపూరిత కథనాన్ని ప్రచురించడం ఏ మాత్రం భావ్యం కాదని సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు. అధికారుల ప్రతిష్టకు భంగం కలిగిస్తూ వారిని అవమానపరిచే రీతిలో రాసిన కథనాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఒక్కో పోస్టుకు మూడేసి పేర్లతో పంపిన జాబితాను పరిశీలించి ఈసీ తన విచక్షణాధికారాల మేరకు నిర్ణయం తీసుకుంటుందన్నారు. తాము పంపించే జాబితాపై సందేహాలు ఉంటే దాన్ని తిరస్కరిస్తూ కొత్తగా మరికొందరు అధికారుల పేర్లతో మరో జాబితాను పంపించమని ఈసీ ఆదేశిస్తుందన్నారు. గుంటూరు ఐజీ పోస్టు కోసం తాము పంపిన జాబితాను ఈసీ వెనక్కి పంపడంతో మరో జాబితాను పంపించామని తెలిపారు. కీలకమైన ఎన్నికల తరుణంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అఖిల భారత సర్వీసు అధికారుల ప్రతిష్టకు భంగకరంగా ఈనాడు తప్పుడు కథనాన్ని ప్రచురించడం వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని భావిస్తున్నామన్నారు. పాత్రికేయ ప్రమాణాలు, విలువలకు విరుద్ధంగా ఈనాడు పత్రిక వ్యవహరించిందని చెప్పారు. ఈనాడు కథనంపై తన అభిప్రాయాన్ని సైతం బ్యానర్‌గా ప్రచురించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. లేదంటే న్యాయపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని స్పష్టం చేశారు.

## ఈసీ, ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు

ఈనాడు దినపత్రికలో శుక్రవారం పతాక శీర్షికన ప్రచురితమైన కథనం ఒక వర్గానికి కొమ్ము కాసేలా, రెండు ప్రభుత్వ వ్యవస్థల మధ్య అపోహలు కల్పించేదిగా ఉందంటూ ఎన్నికల సంఘానికి రెండు పౌర సంఘాలు ఫిర్యాదు చేశాయి. ఏపీ ఇంటెలెక్చువల్ అండ్ సిటిజన్స్ ఫోరం, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలోని ఎన్నికల కార్యాలయంలోని ఫిర్యాదుల విభాగానికి ఈ మేరకు ఒక లేఖను అందజేశారు. అనంతరం ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు పి.విజయబాబు మాట్లాడుతూ.. ఈనాడులో 'వీళ్లా కొత్త ఎస్పీలు.. సగానికి పైగా వైకాపా విధేయులే' అన్న కథనం ఎటువంటి ఆధారాలు లేని అర్థరహిత కథనంగా ఉందన్నారు. ఒక రాజకీయ పార్టీపై వ్యతిరేకతతో ప్రభుత్వ


విజయబాబు


కృష్ణంరాజు

ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి పై అసత్య ఆరోపణలు చేసే విధంగా వార్తను ప్రచురించారని, అందువల్ల ఆ పత్రిక యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనాడు పత్రిక కథనాలు సత్య దూరంగా ఉంటున్నాయని, అందువల్ల దీనిపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు కూడా ఫిర్యాదు చేయబోతున్నామని ఆయన తెలిపారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. కొత్త ఎస్పీల నియామకం నిబంధనల ప్రకారమే జరిగినప్పటికీ జవహర్ రెడ్డి పై అనవసర విమర్శలు చేశారన్నారు. జవహర్ రెడ్డి ఒక్కో పోస్టుకు ముగ్గురు అభ్యర్థుల పేర్లను మాత్రమే సూచించారని వారిలో ఒకరి పేరు నిర్ధారించే అధికారం ఎన్నికల సంఘానికే ఉందని కృష్ణంరాజు వివరించారు. ఎస్పీల నియామకాన్ని తప్పు పట్టడం అంటే ఎన్నికల సంఘాన్ని తప్పు పట్టడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉన్నంతకాలం వివిధ పత్రికల్లో వస్తున్న అసత్య, అర్ధసత్య వార్తలను ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాది ఎం. విఠల్‌రావు, పలువురు ప్రముఖులు ఎన్నికల సంఘాన్ని కలిసిన వారిలో ఉన్నారు.

## సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటాం



పోలీసు అధికారుల మనో స్థైర్యాన్ని దెబ్బ తీసేందుకు ఈనాడు పత్రిక దుష్ప్రచారం చేస్తోందని రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్రంగా విమర్శించింది. ప్రజల భద్రత, ఎన్నికల సక్రమ నిర్వహణ కోసం రాష్ట్రంలోని పోలీసు యంత్రాంగం మొత్తం సమష్టిగా కృషి చేస్తోందని స్పష్టం చేసింది. తమ విద్యుక్త ధర్మాన్ని సక్రమంగా నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు ఈనాడు పత్రిక దురుద్దేశాలు ఆపాదించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ దురుద్దేశంతోనే అవాస్తవ కథనాలను ప్రచురించారని మండి పడింది. దుష్ప్రచారం చేస్తున్న వారికి వ్యతిరేకంగా సంబంధిత ఐపీఎస్ అధికారులు వ్యక్తిగతంగా, సమష్టిగా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటారని తెలిపింది. ఈ మేరకు ఐపీఎస్ అధికారుల సంఘం తరపున ఆ సంఘం కార్యనిర్వాహక సభ్యుడు క్రాంతిరాణా టాటా శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పలువురు ఐఏఎస్ అధికారులు సైతం ఈనాడు వైఖరిని తీవ్రంగా తప్పుపట్టారు. తామంతా ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరించాలన్నట్లు రామోజీ వైఖరి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచిది కాదని, రామోజీ తన హద్దులెరిగి ప్రవర్తించాలన్నారు.

## కాదనడానికి మీరెవరు రామోజీ?

దేశంలో అత్యంత ఉన్నతమైన అధికార వ్యవస్థ అఖిల భారత సర్వీసులు. ఏటా దేశంలో అత్యంత ప్రతిభావంతులైనవారే ఈ సర్వీసులకు ఎంపికవుతారు. అటువంటి అత్యున్నత వ్యవస్థను ఉద్దేశించి 'వీళ్లా కొత్త ఎస్పీలు' అని రామోజీరావు తూలనాడారంటే చంద్రబాబుకు మేలు చేయడం కోసం ఆయన ఎంతగా బరితెగించారో తెలుస్తోంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తన ఇంట్లో నౌకర్ల మాదిరిగా.. తన మోచేతి నీళ్లు తాగేవారి మాదిరిగా చిత్రీకరిస్తూ హేళన చేయడం రామోజీ పెత్తందారి పోకడలకు నిదర్శనం. ఆ అధికారులేమీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన వారు కాదు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అఖిల భారత సర్వీసులకు ఎంపికైనవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు నుంచి రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నవారే. టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా వివిధ హోదాల్లో నిబద్ధతతో విధులు నిర్వర్తించిన అధికారులేనని అఖిల భారత అధికారుల సంఘం గుర్తు చేస్తోంది. కానీ అప్పుడు తప్పుబట్టని చంద్రబాబు, రామోజీ.. ఇప్పుడు మాత్రం వారు అధికారులు కాదు.. నౌకర్లు... అన్నట్టుగా అవమానపరచడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. అసలు ఈసీ నియమించిన ఎస్పీలను కాదని అనడానికి మీరెవరు రామోజీ? ఆనాడు ఎన్టీ రామారావును కుట్రతో కూలదోసిన కుట్రలో చంద్రబాబు భాగస్వామి కాబట్టి.. ఆయనకు మీరు ఇంద్రుడు.. చంద్రుడిగా కనిపిస్తారేమో. అందుకే మీరు వేలాది ఎకరాలు కొల్లగొట్టడానికి ఆయన సహకరించి ఉండొచ్చు. టీడీపీ ప్రభుత్వంలో మీరు రాజ్యాంగేతర శక్తిగా చెలరేగిపోయినా సహించి ఉండొచ్చు. కానీ రాజ్యాంగ బద్ధ సంస్థ ఈసీకి మీరు ఓ సాధారణ వ్యక్తే. మీ ఉడత ఊపులకు బెదిరిపోవాల్సిన ఆగత్యం ఈసీకి లేదు. ఇక అఖిల భారత సర్వీసులకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మీకు జీ హుజూర్ అని ఎందుకు అంటారు? మిమ్మల్ని చూసి బెంబేలెత్తిపోయి దాసోహం కావాల్సిన గతి పట్టలేదు. రామోజీ.. ఇక చంద్రబాబును మీరు నెత్తిన పెట్టుకుని ఊరేగితే ఊరేగండి. మీరిద్దరూ కలసి ఏ ఏట్లో దూకినా ఎవరికీ పట్టదు. కానీ నిరంకుశుడు, ప్రజాకంటకుడు, అవినీతి చక్రవర్తి అయిన చంద్రబాబును మోయాల్సిన అగ్యతం రాష్ట్ర ప్రజలకు ఏమాత్రం లేదు. ఆ విషయాన్ని కుండబద్దలుగొడుతూ 2019లోనే ఇచ్చిన విస్పష్టమైన తీర్పును 2024 ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలని ప్రజలు ఇప్పటికే డిసైడయ్యారు. ఆ నిజాన్ని భరించేందుకు మీరు, మీ చంద్రబాబు సిద్ధంగా ఉండాలని సిద్ధం సభలే స్పష్టం చేస్తున్నాయి. టీడీపీ ఘోర పరాజయాన్ని జీర్ణించుకోగలిగితే సరి. లేకపోతే మీ చంద్రబాబు, మీరు కలసి ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో చేరేందుకు అంబులెన్స్‌ను సిద్ధం చేసుకోండి.

## బదిలీ చేస్తే ఈసీ ఆహా ఓహో అంటారా..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న చిలకలూరిపేట సభను అవకాశంగా చేసుకుని అసత్య ఆరోపణలతో ఎల్లో మీడియా ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించింది. వాహనాలు సమకూర్చినా, డబ్బులు ఇస్తామన్నా సరే సభకు ఆశించిన స్థాయిలో జనం హాజరు కాకపోవడంతో ఆ సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. తమ వైఫల్యాన్ని అంగీకరించలేక చంద్రబాబు రాష్ట్రంలోని అధికారులపై సాకు నెట్టేసేందుకు యత్నించారు. అందుకే పలువురు అధికారుల జాబితాను రూపొందించి వారిని బదిలీ చేయాలని ఈసీకి విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు తానా అంటే పురందేశ్వరి, పవన్ కళ్యాణ్ తందానా అన్నారు. పోనీ.. సక్రమంగా ఎన్నికల నిర్వహణకు ప్రతిపక్షాలు సహకరిస్తాయనే ఉద్దేశంతో ఈసీ.. ఒక ఐజీ, ఐదుగురు ఎస్పీలు, ముగ్గురు కలెక్టర్లను బదిలీ చేసింది. తమ దుష్ప్రచార కుట్ర ఫలించడంతో రామోజీ 'ఈడ్చి కొట్టిన ఈసీ' అంటూ ఈనాడు పత్రికలో బ్యానర్ వార్త రాశారు. ఆ అధికారులను బదిలీ చేయడాన్ని అధికార వైఎస్సార్‌సీపీ ఏమీ తప్పుపట్ట లేదు. ఈసీ తన విచక్షణాధికారాలతో తీసుకున్న నిర్ణయాన్ని హుందాగా స్వీకరించి గౌరవించింది.

## కొత్త అధికారులను నియమిస్తే తూలనాడతారా?

బదిలీ చేసిన ఐజీ, ఐదుగురు ఎస్పీలు, ముగ్గురు కలెక్టర్ల స్థానంలో ఈసీ కొత్త అధికారులను నియమించింది. అందుకోసం రాజ్యాంగ నిబంధనలను పక్కాగా పాటించింది. కానీ ఈనాడు రామోజీరావుకు మాత్రం ఆ నిర్ణయం రుచించ లేదు. అధికారులను నియమించే ముందు ఈసీ హైదరాబాద్ శివారులో ఉన్న ఫిల్మ్ సిటీలో తాను అక్రమంగా నిర్మించిన తన బంగ్లాకు వచ్చి.. తాను మెట్లు దిగేవరకు వేచి చూసి.. ఎవరెవర్ని ఎస్పీలుగా, కలెక్టర్లుగా నియమించాలని తనను అడిగి.. తాను ఇచ్చిన జాబితాను మహా ప్రసాదంగా తీసుకుని వెళ్లి.. వారికి పోస్టింగులు ఇవ్వాలని రామోజీరావు భావించినట్టు ఉన్నారు. ఎందుకంటే చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అలానే చేసేవారన్నది ఆయన ఉద్దేశం. పాపం.. ఈసీకి ఆ విషయం తెలియదు కదా! రాజ్యాంగ నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుని గుంటూరు ఐజీ, ఐదుగురు ఎస్పీలు, ముగ్గురు కలెక్టర్లను నియమించింది. అందుకోసం ముందుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)ని ప్రతిపాదనలు పంపమని ఆదేశించింది. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ సీఎస్ ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున మొత్తం మీద 27 మంది అధికారుల పేర్లను ప్రతిపాదిస్తూ ఈసీకి జాబితా సమర్పించారు. ఆ జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి ఎంఎన్ హరేంధిరప్రసాద్, అదనపు డీజీ (శాంతి, భద్రతలు) ఎస్ఎస్ బాగ్చీలతో కూడిన కమిటీ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదించింది. ఆ జాబితాపై కేంద్ర ఎన్నికల కమిషన్ సమగ్రంగా సమీక్షించింది. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ప్రతిపాదించిన అధికారుల సీనియారిటీ, పనితీరు, ట్రాక్ రికార్డ్‌ను కూలంకషంగా పరిశీలించింది. సీఎస్ పంపిన జాబితాకే ఈసీ కట్టుబడాలని లేదు. స్వయం ప్రతిపత్తిగల ఈసీ తన విచక్షణాధికారాలతో నిర్ణయం తీసుకుంటుంది. సీఎస్ తన జాబితాలో పేర్కొన్న ప్యానళ్లలో అధికారుల సమర్థత, నిబద్ధతపై ఈసీకి సందేహాలు ఉంటే వారి పేర్లను తిరస్కరించవచ్చు. కొత్త ప్యానళ్లతో అధికారుల పేర్లను పంపించమని ఆదేశించవచ్చు. తాజాగా గుంటూరు ఐజీ పోస్టు కోసం సీఎస్ పంపిన మూడు పేర్లతో కూడిన ప్యానల్‌పై ఈసీ సంతృప్తి చెందలేదు. దాంతో మరో ముగ్గురు అధికారుల పేర్లతో కొత్త ప్యానల్‌ను సీఎస్ పంపారు. అనంతరం ఆ జాబితా నుంచి కొత్త ఐజీ, ఐదుగురు ఎస్పీలు, ముగ్గురు కలెక్టర్లను ఈసీ నియమించింది. ఈ ప్రక్రియ అంతా పక్కాగా నిబంధన మేరకు సాగింది. రాజ్యాంగాన్ని అనుసరిస్తూ ఈసీ సక్రమంగా వ్యవహరించడంతో రామోజీరావుకు పిచ్చి నషాళానికి ఎక్కింది. 'వీళ్లా ఎస్పీలు...' అంటూ అధికారులను తూలనాడుతూ, అవమానపరుస్తూ, ఈసీ అధికారాలను ప్రశ్నిస్తూ విద్వేషపు విషం చిమ్మారు.

### ఉద్యోగుల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తున్న వారిపైనా

# చర్యలు తీసుకోవాలి

- ఎన్నికల సంఘానికి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫిర్యాదు
- చింతమనేని ప్రభాకర్, యనమల అల్లుడిపైనా ఫిర్యాదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిష్పక్షపాతంగా పనిచేస్తున్న అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న తెలుగుదేశం పార్టీపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని ఎన్నికల కమిషన్‌కు ఆధారాలు అందజేశారు. అనంతరం విష్ణు మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఎన్నిసార్లు మొట్టికాయలు వేసినా చంద్రబాబు, టీడీపీ నేతలు పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని చెప్పారు. బహిరంగ సభలలో సీఎం జగన్ గురించి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తుండటమే కాకుండా, చివరకు అధికారులు, ఉద్యోగులపైనా అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. వీటన్నింటినీ ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్ ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం జగన్ పైన, వైఎస్సార్‌సీపీ పైన వాడిన భాష తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. దీనిపైనా ఆధారాలను ఈసీకి ఇచ్చామన్నారు. యనమల రామకృష్ణుని అల్లుడు చావలి వెంకట గోపినాథ్ ఓ ఐఆర్ఎస్ అధికారి అయి ఉండి, ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, ట్యాబ్‌లు పంపిణీ చేస్తూ ప్రలోభాలకు గురిచేయడంపైనా ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. గోపినాథ్‌పై ఎన్నో అవినీతి ఆరోపణలు ఉన్నాయని, తునిలోని పారిశ్రామికవేత్తలను ఆయన బెదిరిస్తూ దందాలు చేస్తున్నారని చెప్పారు. దీనికి సంబంధించి


ఫిర్యాదు అందజేస్తున్న మల్లాది విష్ణు, నారాయణ మూర్తి, మనోహర్ రెడ్డి

అక్కడి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇచ్చిన ఫిర్యాదును కూడా ఈసీకి సమర్పించామన్నారు. ప్రజలందరూ మార్పు కోరుకుంటున్నారని ఏలూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను పూర్తిగా విస్మరించి రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న బీజేపీకి ఏపీలో ఓటు అడిగే నైతిక హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఈసీ రాసిన లేఖపై సకాలంలోనే వివరణ ఇచ్చినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మంచి పనులను వివరిస్తూ తామంతా ఓట్లు అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. చెప్పుకునేవి ఏమీ లేక టీడీపీ విష ప్రచారానికి పరిమితమైందని, అయినా ప్రజలందరూ వైఎస్సార్‌సీపీకి పూర్తి అనుకూలంగా ఉన్నారని చెప్పారు. అందువల్లే చంద్రబాబు, టీడీపీ నేతలు వ్యవస్థలపైన దాడి చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ డ్రామాలు, గోబెల్స్ ప్రచారాలను ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ తిరుగులేని మెజార్టీతో విజయం సాధించడం, సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రెసిడెంట్ మలసాని మనోహర్ రెడ్డి, నవరత్నాలు కార్యక్రమం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఎ.నారాయణమూర్తి ఉన్నారు.

# బీజేపీ నేత సీఎం రమేష్‌పై కేసు

- ఏపీ డీఆర్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ ఫిర్యాదు మేరకు నమోదు చేసిన చోడవరం పోలీసులు
- చోడవరం టీడీపీ అభ్యర్థి రాజు, టైల్స్ దుకాణం యజమాని, మరికొందరిపై కూడా..
- డీఆర్ఐ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఘటనపై చర్యలు

సాక్షి, అనకాపల్లి: చోడవరం మండలం గాంధీ గ్రామంలో జీఎస్టీ చెల్లించకుండా అనధికారికంగా వ్యాపారం సాగిస్తున్న బుచ్చిబాబు ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం (డీఆర్ఐ) అధికారుల విధులకు ఆటంకం కల్గించడమే కాకుండా వారిపై దౌర్జన్యం చేసినందుకు బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌పై శుక్రవారం చోడవరం పోలీసులు కేసులు నమోదు చేశారు. తమ విధులకు ఆటంకం కలిగించారని ఏపీ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ చేసిన ఫిర్యాదు మేరకు సీఎం రమేష్‌తోపాటు టీడీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్, బుచ్చిబాబు ట్రేడర్స్ యజమాని శిల్పరశెట్టి బుచ్చిబాబు, ఆయన సోదరుడు శిల్పరశెట్టి రామకృష్ణ, వారి కుమారులు శిల్పరశెట్టి పాల్‌చంద్, శిల్పరశెట్టి ప్రభుకుమార్ పాటు అక్కడకు వచ్చిన టీడీపీ, బీజేపీ నాయకులతోపాటు


సీఎం రమేష్

సిబ్బందిపై కూడా కేసులు నమోదు చేశారు. ఓటర్లను రెచ్చగొట్టేలా ప్రవర్తించడంతోపాటు ఎన్నికల నియమావళిని ధిక్కరించడం, విధుల్లో ఉన్న అధికారులపై దౌర్జన్యాలకు పాల్పడడం వంటి సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. ఐపీసీ 143, 506, 342, 353, 201, 188 రెడ్ విత్ 149 సెక్షన్ల కింద చోడవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

## డీఎస్పీ నేతృత్వంలో విచారణ కమిటీ

డీఆర్ఐ అధికారులపై దౌర్జన్యం కేసులో తొలుత ఆరుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీరితోపాటుగా అదర్స్ అని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై వీడియో సర్వైలెన్స్ టీం తీసిన వీడియో ద్వారా డీఆర్ఐ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడిన, వారికి మద్దతిచ్చిన వారిని కూడా పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. వీడియోలో బీజేపీ, టీడీపీ నాయకులు ఈర్లె శ్రీరామ్మూర్తి, గున్నె మల్లునాయుడు, నౌడు శ్రీను, సుధతోపాటు మరికొందరు నాయకులు ఉన్నారు. వీడియోలు పరిశీలించి అందులో ఎవరెవరు ఉన్నారో వారందరిపై కేసులు నమోదు చేస్తామని పోలీసు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై విచారణ కోసం డీఎస్పీ అప్పలరాజు అధ్యక్షతన కమిటీని నియమించారు.

# టీడీపీ నేత అచ్చెన్నాయుడికి ఎన్నికల సంఘం నోటీసు

అయ్యన్నపాత్రుడుకు కూడా..

సాక్షి, అమరావతి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, సీనియర్ నాయకుడు అయ్యన్నపాత్రుడులకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీచేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము జారీచేసిన నోటీసులకు 48 గంటల్లోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మీద అభ్యంతరకర, అనుచిత వ్యాఖ్యలు చేయడం, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టడంపై ఈ నెల రెండో తేదీన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను సైతం అందజేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన రాష్ట్ర ఎన్నికల సంఘం అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడులకు శుక్రవారం నోటీసులు జారీచేసింది.

# చింతకాయల విజయ్‌పై కేసు నమోదు

- అనుమతిలేకుండా నాతవరంలోని ఆలయంలో టీడీపీ సమావేశం
- ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన విజయ్, మరో నలుగురిపై కేసు

నాతవరం(అనకాపల్లి జిల్లా): ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన టీడీపీకి చెందిన మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పెద్ద కుమారుడు చింతకాయల విజయ్‌తోపాటు మరో నలుగురిపై నాతవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ముందస్తు అనుమతి లేకుండా నాతవరం గ్రామంలోని శ్రీ కోటమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో గురువారం టీడీపీ నాయకులు బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో డబ్బు పంపిణీపై చర్చించేందుకు గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాటుచేసిన ఈ సమావేశం గురించి తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శ్రీ కోటమ్మ తల్లి ఆలయం వద్దకు వెళ్లగా, విజయ్‌తోపాటు టీడీపీ నాయకులు పారిపోయారు. ఈ సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నాతవరం ఎస్ఐ రామారావుకు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం సాయంత్రం ఫిర్యాదుచేశారు. అదే విధంగా చింతకాయల విజయ్‌పై నర్సీపట్నంలో ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్‌కు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఫిర్యాదు చేశారు. మరోవైపు టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించిన ప్రదేశాన్ని నాతవరం మండల ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, స్థానిక పోలీసులు పరిశీలించారు. ముందస్తు అనుమతిలేకుండా టీడీపీ నాయకులు సమావేశం ఏర్పాటుచేసినట్లు ఎంపీడీవో జాగరపు రాంబాబు కూడా ఎస్ఐ రామారావుకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల మేరకు చింతకాయల విజయ్, నాతవరం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, బాబులుపై ఐపీసీ 188 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు శుక్రవారం తెలిపారు.

## టీడీపీ నేతలపై 'ఎన్నికల' కేసులు

శ్రీకాకుళం క్రైమ్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించినందుకు శ్రీకాకుళం టీడీపీ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ప్రస్తుత టీడీపీ అభ్యర్థి గొండు శంకర్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్లలో కేసు నమోదైంది. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. మార్చి 27న అరసవల్లిలోని తన గృహంలో అనుమతి తీసుకోకుండా గుండ లక్ష్మీదేవి టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. దీనిపై శ్రీకాకుళం ఎంసీసీ (మోడ్ ఆఫ్ కోడ్ కాండాక్ట్) ఇన్‌ఛార్జి ఈశ్వరమ్మ, తహసీల్దారు గెయిల్ ఈ నెల ఒకటో తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెక్షన్ 188 ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ పేర్కొన్నారు. అలాగే.. శ్రీకాకుళం టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ గత నెల (మార్చి) 26న నగరంలోని గ్రాండ్ హోటల్‌లో టీడీపీ కార్యకర్తలు, అనుయాయులతో సమావేశం నిర్వహించారు. దీనిపై శ్రీకాకుళం తహసీల్దారు గెయిల్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెక్షన్ 188 ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు తెలిపారు.

# పాపం.. పండుటాకులు!

**చంద్రబాబు కుట్రలతో పింఛన్ కోసం వెళ్తూ ఎండ తీవ్రతకు మృత్యువాత**

- మూడు రోజుల్లో మొత్తం 46 మంది మృతి
- పచ్చ ముఠా కుట్రల వల్లే తమకీ దుర్గతి పట్టిందని లబ్ధిదారుల మండిపాటు
- వచ్చే ఎన్నికల్లో టీడీపీకి గుణపాఠం చెబుతామని హెచ్చరిక

**సాక్షి, నెట్‌వర్క్:** టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలతో పండుటాకులు శుక్రవారం కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నెల వలంటీర్లతో పింఛన్ల పంపిణీ చేయించకుండా పచ్చ ముఠా పన్నిన కుట్రలతో లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ క్రమంలో ఎండదెబ్బ తాళలేక అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మృత్యువాత పడ్డారు. బుధవారం 20 మంది, గురువారం 19 మంది మృతి చెందగా శుక్రవారం మరో ఏడుగురు పింఛన్ లబ్ధిదారులు టీడీపీ తెచ్చిన కష్టాలతో అశువులు బాశారు. మూడు రోజుల్లోనే మొత్తం 46 మంది పింఛన్ లబ్ధిదారులు చంద్రబాబు కుట్రలకు ప్రాణాలు పోగొట్టుకున్నారు. తమకీ కష్టాలు రావడానికి ఆయనే కారణమని లబ్ధిదారులు, మృతుల కుటుంబ సభ్యులు ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు గుణపాఠం చెబుతామని, టీడీపీ కూటమిని చిత్తుగా ఓడిస్తామని కుండబద్దలు కొట్టారు.

వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం కె.వడ్డెపల్లెకు చెందిన ఏనుగు వెంకట నారాయణ (67) పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లి వడదెబ్బతో మృతి చెందాడు. సింహాద్రిపురం మండలం లోమడలో నారాయణమ్మ (70) అనే వితంతువు పింఛన్ కోసం వెళ్లి ఎండ దెబ్బకు తాళలేక ప్రాణం పోగొట్టుకుంది. బి.మఠం మండలం మల్లేపల్లె పంచాయతీ చెంచయ్యగారిపల్లెకు చెందిన పొంగూరు సుబ్బయ్య(65) పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లి వడదెబ్బతో మరణించాడు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం మెళవాయికి చెందిన లక్ష్మీనరసమ్మ (66) పింఛన్ కోసం ఎర్రటి ఎండలో గ్రామ సచివాలయానికి వెళ్లింది. పింఛన్ తీసుకుని ఇంటికి చేరుకున్న ఆమె కాసేపటికే తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు హిందూపురం ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మన్నసముద్రం గ్రామానికి చెందిన గల్లా రామిరెడ్డి (75) పింఛన్ తీసుకునేందుకు సుమారు 3.5 కిలోమీటర్ల దూరంలోని బండారుపల్లి సచివాలయానికి కాలినడకన బయలుదేరాడు. సచివాలయంలో పింఛన్ తీసుకుని ఇంటికి వెళ్లాడు. ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేటప్పటికే మృతిచెందాడు. ప్రకాశం జిల్లా పొదిలి ఎస్టీ కాలనీకి చెందిన పోలా రమణయ్య (54) దివ్యాంగుడు. భార్యను తోడుగా తీసుకుని రెండు కిలోమీటర్ల దూరంలోని సచివాలయానికి వెళ్లాడు. పింఛన్ తీసుకుని ఇంటికి వచ్చాక ఎండ తీవ్రతకు అస్వస్థతతో మరణించాడు. యర్రగొండపాలెం మండలం వై.కొత్తపల్లికి చెందిన ఆముదం చిన్న యోగిరెడ్డి పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లాడు. ఇంటికొచ్చాక అస్వస్థతకు గురై మృత్యువాత పడ్డాడు.

## 61.37 లక్షల మందికి రూ. 1,847.85 కోట్లు

**93.42 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి**

**సాక్షి, అమరావతి:** టీడీపీ అధినేత చంద్రబాబు.. వలంటీర్లపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయించి తీవ్ర అవాంతరాలు సృష్టించాలని చూసినా ప్రభుత్వం ఠంచన్‌గా పింఛన్ పంపిణీ చేసింది. కేవలం రెండున్నర రోజుల వ్యవధిలోనే 61,37,464 మంది లబ్ధిదారులకు రూ.1,847.85 కోట్లను అందించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి పంపిణీ ప్రారంభించి, శుక్రవారం సాయంత్రానికి 93.42 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ పూర్తి చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో ఎక్కువ అనారోగ్య సమస్యలు ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దే సచివాలయాల ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు. చిత్తూరు, ఏలూరు, విశాఖపట్నం జిల్లాల్లో 95 శాతం మందికి పైగా పంపిణీ పూర్తయినట్టు అధికారులు తెలిపారు. శనివారం కూడా ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు సచివాలయాల వద్ద పంపిణీ కొనసాగుతుంది.

## అవ్వాతాతల ప్రాణాలు బలిగొన్న హంతకులు టీడీపీ నేతలు

**ఎంపీ మార్గాని భరత్‌రామ్**



**రాజమహేంద్రవరం సిటీ:** వలంటీర్ వ్యవస్థపై విషం చిమ్ముతూ.. వారి సేవలను అడ్డుకుని వృద్ధుల ప్రాణాలను బలిగొంటున్న టీడీపీ నాయకులు హంతకులని, వారికి ఎటువంటి శిక్ష వేయాలో ప్రజాకోర్టులోనే తీర్పు చెప్పాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం 30వ డివిజన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచనుగా అందే పింఛన్ సమయానికి రాక కొందరు, పింఛన్ల కోసం సచివాలయాలకు వెళ్లి, వేసవి తాపం తట్టుకోలేక మరికొందరు, గుండెపోటుతో ఇంకొందరు వృద్ధులు.. ఇలా ఇప్పటి వరకు 39 మంది మృత్యువాత పడ్డారన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే భర్త, టీడీపీ ప్రస్తుత అభ్యర్థి ఆదిరెడ్డి వాసు వలంటీర్ల ద్వారా పెన్షన్లు ఇవ్వకుండా చంద్రబాబు, లోకేశ్‌కు చెప్పి, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయించింది తానే అని భుజాలెగరేసుకుంటూ మరీ బహిరంగంగా మీడియా సాక్షిగా చెప్పారని ఎంపీ భరత్‌రామ్ అన్నారు. ఇంతమంది అవ్వాతాతల ప్రాణాలు గాలిలో కలిసిపోవడానికి కారణం వాసు, చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్‌లేనని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలు, నేతల బంధువులే ఎక్కువ లబ్ధిదారులని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పార్టీ రహితంగా సంక్షేమ పథకాలు అందజేస్తోందని చెప్పారు. వలంటీర్ల విధులపై ఎన్నికల సంఘం ఆంక్షలు విధించడంపై సర్వత్రా నిరసన వ్యక్తం కావడంతో టీడీపీ నేతలు కలవరపాటుకు గురై, చేసిన తప్పు సరిదిద్దుకోవడానికి ఇప్పుడు నానా అవస్థలూ పడుతున్నారని ఎంపీ భరత్‌రామ్ విమర్శించారు.

## ఏపీ ఆర్ సెట్ షెడ్యూల్ విడుదల

**తిరుపతి సిటీ:** ఏపీ ఆర్ సెట్ 2023–24 షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేసినట్లు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు వెల్లడించారు. మే 2 నుంచి 5వరకు ఉదయం 9గంటల నుంచి 11వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 4.30వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 10 నుంచి ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన 14 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయని, 10,000 మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.

## మత్స్యకారుల బోటులో అగ్ని ప్రమాదం

- ఇంజన్ పేలడంతో ఎగసిపడ్డ మంటలు
- 9 మందికి గాయాలు..
- కాపాడిన ఐసీజీఎస్ వీరా నౌక



దగ్ధమవుతున్న మత్స్యకారుల బోటు



బాధితులను రక్షిస్తున్న కోస్టుగార్డు సిబ్బంది

**మహారాణిపేట(విశాఖ దక్షిణ)/కాకినాడ రూరల్:** విశాఖ సముద్ర తీరంలో శుక్రవారం మధ్యాహ్నం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల బోటు ఇంజన్ పేలిన ఘటనలో తొమ్మిది మంది గాయపడ్డారు. ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా నలుగురు స్వల్ప గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. కాకినాడ జిల్లాకు చెందిన వీరంతా గత నెల 26వ తేదీన శ్రీదుర్గాభవాని ఐఎన్‌డీ ఏపీ 47 బోటులో చేపల వేటకు వెళ్లారు. ఈ నెల 14వ తేదీన తిరిగి రావాల్సి ఉండగా ప్రమాదం జరిగింది.

### 20 నాటికల్ మైళ్ల దూరంలో..

విశాఖకు 20 నాటికల్ మైళ్ల దూరంలో మత్స్యకారుల బోటులో షార్ట్ సర్క్యూట్ కారణంగా జనరేటర్ పేలడంతో మంటలు ఎగసిపడ్డాయి. సమీపంలో మరో పడవలో ఉన్నవారు వారికి సాయం అందించి కోస్ట్‌గార్డ్ అధికారులకు సమాచారం చేరవేశారు. సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఐసీజీఎస్ వీరా నౌక సిబ్బంది వారికి ప్రథమ చికిత్స అందించిన అనంతరం నేవల్ డాక్‌యార్డ్‌కు తీసుకొచ్చి క్షతగాత్రులను అంబులెన్సుల ద్వారా కేజీహెచ్‌కు తరలించారు. మత్స్యకారులు ఆర్.సత్తిబాబు, ఎస్.వజ్రం, ఎస్.సత్తిబాబు, కె.ధర్మారావు, వై.సత్తిబాబులకు తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న కాకినాడ మత్స్యశాఖ అధికారి కరుణాకర్, ఫిషింగ్ హార్బర్ పీవో అనురాధ మత్స్యకారుల వివరాలు సేకరించారు. కాకినాడ మత్స్యకారులకు ప్రమాదం తప్పిందని, కోస్టుగార్డు సిబ్బంది వారిని సురక్షితంగా విశాఖకు తరలించారని, చికిత్స అనంతరం తిరిగి కాకినాడ చేరుకుంటారని అధికారులు తెలిపారు.

# చట్ట ప్రకారమే జిల్లాల ప్రధాన కేంద్రాల ఏర్పాటు

**ప్రభుత్వం ఎక్కడా చట్టాన్ని ఉల్లంఘించలేదు**



- ఆ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేం
- పిటిషనర్ల అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది
- ఆ తర్వాతే జిల్లా ప్రధాన కేంద్రాల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చింది
- కోర్టులు ప్రభుత్వ నిర్ణయాన్ని పరీక్షించజాలవు
- ఆ నిర్ణయ ప్రక్రియను మాత్రమే పరీక్షించగలవు
- సీజే నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం తీర్పు
- జిల్లా కేంద్రాల ఏర్పాటుపై దాఖలైన వ్యాజ్యాలు కొట్టివేత

**సాక్షి, అమరావతి:** హిందూపూర్ పార్లమెంటరీ నియోజకవర్గాన్ని శ్రీసత్యసాయి జిల్లాగా ప్రకటించి, పుట్టపర్తిని ఆ జిల్లా కేంద్రంగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు సమర్థించింది. అదే విధంగా.. అన్నమయ్య జిల్లా ప్రధాన కేంద్రాన్ని రాజంపేట కాకుండా రాయచోటిగా చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను, రామచంద్రాపురంను కొత్తగా ఏర్పాటుచేసిన కోనసీమ జిల్లాలో విలీనం చేస్తూ జారీచేసిన ఉత్తర్వులను కూడా హైకోర్టు సమర్థించి ప్రభుత్వ ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాల (పిల్‌లు)ను హైకోర్టు కొట్టేసింది. కొత్త జిల్లాల ఏర్పాటు, జిల్లా ప్రధాన కేంద్రాల ప్రకటన విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం, తదనుగుణ ఉత్తర్వులు ఎంతమాత్రం చట్టవిరుద్ధం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. కొత్త జిల్లాల ఏర్పాటు, జిల్లా ప్రధాన కేంద్రాల ప్రకటన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్ట ప్రకారం అభ్యంతరాలను ఆహ్వానించడమే కాక, వచ్చిన అభ్యంతరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుందని తేల్చిచెప్పింది. ఆ తర్వాతే తుది నోటిఫికేషన్ జారీచేసిందని హైకోర్టు తెలిపింది. ఈ విషయంలో ప్రభుత్వం ఎక్కడా చట్టాన్ని ఉల్లంఘించలేదని వెల్లడించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది.

### జిల్లా కేంద్రాల ఏర్పాటుపై పిల్‌లు..

హిందూపూర్ పార్లమెంటరీ నియోజకవర్గాన్ని శ్రీసత్యసాయి జిల్లాగా ప్రకటించి, పుట్టపర్తిని జిల్లా ప్రధాన కేంద్రంగా మారుస్తూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హిందూపూర్ అఖిలపక్ష కమిటీ కన్వీనర్ బాలాజీ మనోహర్ 2022లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పుట్టపర్తిని కాకుండా హిందూపూర్‌ను జిల్లా ప్రధాన కేంద్రంగా ప్రకటించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. అలాగే, అన్నమయ్య జిల్లాకు ప్రధాన కేంద్రాన్ని రాయచోటిగా నిర్ణయించడాన్ని సవాలు చేస్తూ జిల్లా కేంద్ర సాధన సమితి అన్నమయ్య జిల్లా కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ 2022లో పిల్ దాఖలు చేశారు. రాయచోటిని కాకుండా రాజంపేటను జిల్లా ప్రధాన కేంద్రంగా ప్రకటించేలా ఆదేశాలివ్వాలని కోర్టును అభ్యర్థించారు. ఇదే అభ్యర్థనతో అడ్వొకేట్స్ జేఏసీ రాజంపేట, రైల్వే కోడూరు, నందలూరు న్యాయవాదుల సంఘంతోపాటు చార్టెర్డ్ అకౌంటెంట్ సాధు సుబ్రహ్మణ్యం పంత్ వేర్వేరుగా పిల్‌లు దాఖలు చేశారు. మరోవైపు.. తూర్పు గోదావరి జిల్లాలో రామచంద్రాపురంను కొత్తగా ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో విలీనం చేయడాన్ని సవాలు చేస్తూ వై. వీరవెంకట సత్యనారాయణ రామరాజు అనే వ్యక్తి పిల్ దాఖలు చేశారు. వీటన్నింటిపై విచారణ జరిపిన సీజే ధర్మాసనం ఈ ఏడాది జనవరి 3న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా.. గురువారం తన తీర్పులను వెలువరించింది. జిల్లా ప్రధాన కేంద్రాల ఏర్పాటు విషయంలో తమ అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదన్న పిటిషనర్ల వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. అలాగే, ప్రభుత్వ సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా, ఆంధ్రప్రదేశ్ జిల్లాల ఏర్పాటు చట్ట నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందన్న వాదనను కూడా ధర్మాసనం తిరస్కరించింది. తీర్పు ప్రధాన పాఠం ఇలా..

### జిల్లాల్లో కావాల్సిన ప్రాంతాలను కలపొచ్చు..

'2014 పునర్విభజన చట్టం కింద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విభజించారు. 13 జిల్లాలతో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైంది. ఏపీ జిల్లాల ఏర్పాటు చట్టంలోని సెక్షన్ 3 (1) ప్రకారం రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ కింద రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటుచెయ్యొచ్చు. పాలనా సౌలభ్యం కోసం, అభివృద్ధి కోసం సెక్షన్ 3 (2) కింద కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామాలు ఏర్పాటుచేయవచ్చు. అంతేకాక.. జిల్లాలో, రెవెన్యూ డివిజన్‌లో, మండలాల్లో కావాల్సిన ప్రాంతాలను కలపొచ్చు. అలాగే, ఈ సెక్షన్ కింద నోటిఫికేషన్ జారీచేసి జిల్లా, రెవెన్యూ డివిజన్, మండలం విస్తీర్ణాన్ని పెంచొచ్చు, కుదించవచ్చు. సరిహద్దులను కూడా మార్చొచ్చు. సెక్షన్–4 కింద నిబంధనలను రూపొందించవచ్చు. ఈ చట్ట నిబంధనల కింద రాష్ట్ర ప్రభుత్వం 2020లో కొత్త జిల్లాల ఏర్పాటుపై అధ్యయనం చేసే విషయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఓ రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీకి సహకరించేందుకు జిల్లా స్థాయిలో కమిటీలనూ ఏర్పాటుచేసింది.

### ప్రభుత్వ నిర్ణయ ప్రక్రియనే కోర్టులు పరీక్షించగలవు..

ప్రభుత్వం కేవలం అభ్యంతరాలను ఆహ్వానించడమే కాకుండా పిటిషన్ల అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకుని, ఆ తరువాతే తుది నోటిఫికేషన్ జారీ చేసింది. ఇక్కడ సుప్రీంకోర్టు రఘుపతి వర్సెస్ స్టేట్ ఆఫ్ ఏపీ కేసులో ఇచ్చిన తీర్పును ఉదహరించడం అవసరం. ప్రభుత్వం మండల ప్రధాన కేంద్రాల ఏర్పాటులో జారీచేసిన నోటిఫికేషన్ విషయంలో ఇదే హైకోర్టు జోక్యం చేసుకుంటూ, ఆ నోటిఫికేషన్‌ను రద్దుచేసింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. మండల కేంద్రం ఎక్కడ ఉండాలన్నది ప్రభుత్వ పాలన నిర్ణయమని సుప్రీంకోర్టు చెప్పింది. ఇప్పటికే స్థిరపరిచిన న్యాయ సూత్రం ప్రకారం అధికరణ 226 కింద న్యాయస్థానాలు ప్రభుత్వ నిర్ణయాన్ని పరీక్షించజాలవు. ఆ నిర్ణయ ప్రక్రియను మాత్రమే పరీక్షించగలవు. ప్రస్తుత కేసులో జిల్లా ప్రధాన కేంద్రాల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్ట విరుద్ధంగా వ్యవహరించలేదు. అందువల్ల ఈ వ్యాజ్యాలన్నింటినీ కొట్టేస్తున్నాం'.. అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.

### అభ్యంతరాలను పట్టించుకోలేదన్నది పిటిషనర్ల ఆరోపణ..

కొత్త జిల్లాల ఏర్పాటు విషయంలో అభ్యంతరాలను ఆహ్వానిస్తూ ప్రభుత్వం ముసాయిదా నోటిఫికేషన్ జారీచేసింది. దీనికి అనుగుణంగా పిటిషనర్లు తమ అభ్యంతరాలను తెలిపారు. అయితే, తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా, ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు, జిల్లా ప్రధాన కేంద్రాల ఏర్పాటు విషయంలో చట్ట విరుద్ధంగా వ్యహరించిందన్నది పిటిషనర్ల ఆరోపణ. అయితే, ప్రభుత్వం మాత్రం వీరి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని చట్ట ప్రకారమే వ్యవహరించామని చెబుతోంది. ఈ విషయంలో మేం ప్రభుత్వ కౌంటర్లను పరిశీలించాం. పిటిషనర్ల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నోటిఫికేషన్ జారీచేసిందని ప్రభుత్వం తన కౌంటర్లలో పేర్కొంది. అంతేకాక.. కోనసీమ జిల్లా పేరును బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా కూడా మార్చిన విషయం తెలిపింది.

## క్లుప్తంగా...

### గిద్దలూరు నుంచే పోటీ

**జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు స్పష్టీకరణ**



**కంభం:** గిద్దలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు ప్రకటించారు. ఇప్పటికే కూటమి తరఫున టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి ఇక్కడ నుంచి పోటీలో ఉన్న నేపథ్యంలో స్వాములు ప్రకటన సంచలనంగా మారింది. కంభంలోని ఓ హోటల్‌లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆమంచి సమావేశం నిర్వహించి తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ జనసేన పార్టీ తరఫున, పవన్ కళ్యాణ్ ఫొటోతోనే తాను గిద్దలూరు నియోజకవర్గంలో ప్రచారానికి వెళ్లనున్నట్లు స్పష్టం చేశారు. త్వరలో కంభం, గిద్దలూరులో పార్టీ కార్యాలయాలు ప్రారంభించనున్నట్లు వివరించారు. తనకు టీడీపీ, బీజేపీ నాయకుల మద్దతు లేకపోయినా విజయం సాధించి పవన్ కళ్యాణ్‌కు గిఫ్ట్‌గా ఇస్తానన్నారు. టికెట్ తనకేనంటూ పవన్ నమ్మకంగా చెప్పడంతో ఇంతకాలం వేచి చూశానన్నారు. గిద్దలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబా తన గురించి వ్యతిరేకంగా మాట్లాడుతున్న విషయాన్ని నాయకులు అధినేతల దృష్టికి తీసుకువెళ్లారని ఆ విషయమై అధిష్టానమే నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాగా స్వాములు నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని జనసేన నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాసుల పాండు, ఉదయగిరి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### సీఎస్‌పై చర్యలు తీసుకోవాలి

**కేంద్ర ఎన్నికల సంఘానికి బాబు లేఖ**

**సాక్షి, అమరావతి :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అధికార వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి (సీఈసీ) టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు శుక్రవారం లేఖ రాశారు. ఇంటింటికీ పెన్షన్ల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం కారణంగా 33 మంది పెన్షనర్లు చనిపోయారని, ఇందుకు బాధ్యులైన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వోద్యోగులను ఉపయోగించుకోవడం ద్వారా లబ్ధిదారులకు పథకాలు అందించాలని కేంద్ర ఎన్నికల సంఘం చేసిన సూచనను రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. సీఈసీ సూచనలకు విరుద్ధంగా పెన్షన్ల పంపిణీ గ్రామ, సచివాలయాల వద్ద చేపట్టాలని సెర్ప్ సీఈఓ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో 1,34,694 మంది ఉద్యోగులు అందుబాటులో ఉన్న దృష్ట్యా వారి ద్వారా ఇంటి వద్దకే పెన్షన్లు పంపిణీ చేయవచ్చన్నారు. పెన్షనర్లకు సకాలంలో నిధులు, సరైన సౌకర్యాలు అందించనందుకు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

### ఢిల్లీకి 'విశాఖ' పంచాయితీ!

**టీడీపీ అభ్యర్థి భరత్‌ను మార్చి జీవీఎల్‌కు సీటు ఇవ్వాలని డిమాండ్**

**సాక్షి, విశాఖపట్నం:** విశాఖ లోక్‌సభ స్థానాన్ని టీడీపీ అభ్యర్థికి కేటాయించడంపై బీజేపీలో వ్యతిరేకత రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఇప్పటికే కూటమి పొత్తులో భాగంగా బాలకృష్ణ చిన్న అల్లుడు, లోకేశ్ తోడల్లుడు ఎం.భరత్‌కు కేటాయించిన సంగతి తెలిసిందే. దీంతో ఇన్నాళ్లూ ఈ సీటును ఆశించిన బీజేపీ రాజ్యసభసభ్యుడు జీవీఎల్ నరసింహారావు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీజేపీలోని ఒక వర్గం కూడా భరత్‌కు కాకుండా జీవీఎల్‌కే విశాఖ సీటు ఇవ్వాలని పట్టుపడుతోంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం విశాఖ బీజేపీ కార్యాలయం ఆవరణలోనే బహిరంగంగా భరత్‌ను మార్చి జీవీఎల్‌కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు కూడా లేఖ రాశారు. దీనికంతటికీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలే కారణమని అందులో పేర్కొన్నారు. తాజాగా ఒక అడుగు ముందుకేసి మరికొందరు నాయకులు శుక్రవారం ఢిల్లీకి పయనమయ్యారు. ఢిల్లీలో అధ్యక్షుడు నడ్డా, బీజేపీ ఏపీ ఇన్‌చార్జి, పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ అపాయింట్‌మెంట్ కూడా తీసుకున్నట్టు సమాచారం. ఆయనతో వీరు భేటీ అయి విశాఖలో బీజేపీకి ఉన్న బలం, గతంలో ఇక్కడ ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను గెలుచుకున్న విషయాన్ని, జీవీఎల్ మూడేళ్లుగా విశాఖలో పార్టీకి చేసిన కృషిని వివరించనున్నారు. ఈ తాజా పరిణామాలు పురందేశ్వరితో పాటు కూటమి టీడీపీ అభ్యర్థి భరత్‌కు, టీడీపీ శ్రేణులకు మింగుడు పడడం లేదు. విశాఖ లోక్‌సభ సీటుపై ఢిల్లీకి చేరిన పంచాయితీలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని రెండు పార్టీల్లోనూ చర్చ జరుగుతోంది. కాగా ఢిల్లీకి పయనమైన వారిలో బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు వంశీయాదవ్, పార్టీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నరసింగరావు, మరికొందరు నాయకులు, ఉత్తరాదికి చెందిన 20 మందికి పైగా ప్రతినిధులు ఉన్నారు.

### రేపటి నుంచి మళ్లీ పవన్ ఎన్నికల ప్రచారం

**సాక్షి, అమరావతి:** జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు జ్వరం కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోయిన ఆయన ఎన్నికల ప్రచారాన్ని ఏప్రిల్ 7 నుంచి ప్రారంభిస్తారని ఆ పార్టీ శుక్రవారం తెలిపింది. 7న అనకాపల్లిలో, 8న యలమంచిలి నియోజకవర్గంలో పవన్ ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొంది. 9న పిఠాపురం నియోజకవర్గంలో ఉగాది వేడుకల్లో పవన్ పాల్గొంటారని వెల్లడించింది.

# వీళ్లా.. అభ్యర్థులు!

## రోజురోజుకు బలహీన పడుతున్న తెలుగుదేశం పార్టీ



కోనేటి ఆదిమూలం



కొలికపూడి శ్రీనివాసరావు



మంతెన రామరాజు



రఘురామకృష్ణరాజు

**సాక్షి, అమరావతి :** ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ తెలుగుదేశం పార్టీ మరింతగా బలహీనపడిపోతోంది. 2019లో ప్రజలు కొట్టిన దెబ్బకు పార్టీ ఇప్పటికీ కోలుకోలేకపోతోంది. దీంతో ఈ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులే దొరకలేదు. డబ్బున్నదనో, ఇతర కారణాలతోనే మొత్తంమీద అభ్యర్థులనైతే ఎంపిక చేశారు. వీరిలో అధిక శాతం పోటీకైతే సిద్ధమయ్యారు కానీ, క్షేత్రస్థాయిలో కనీస ప్రభావం చూపించలేకపోతున్నారు. దీంతో టీడీపీ అధినేత చంద్రబాబు బెంబేలెత్తుతున్నారు. కొందరిని అయినా మార్చి ఇంకా ధన బలం ఉన్న వారిని పోటీకి పెట్టడానికి కసరత్తు చేస్తున్నారు. మరోపక్క సీఎం జగన్ చేపట్టిన సిద్ధం సభలు, బస్సు యాత్రతో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఎంత ఆదరణ ఉందో స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో కనీస పోటీ ఇచ్చేందుకైనా మరింత బలమైన అభ్యర్థులను నిలపాలని బాబు భావిస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో పార్టీ పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో మొన్నటివరకు తప్పుడు ప్రచారం ద్వారా హంగామా సృష్టించారు. ఎల్లో మీడియా, సోషల్ మీడియా, మౌత్ క్యాంపెయినర్ల ద్వారా వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేయించి ప్రజలను తికమక పెట్టాలని చేసిన ప్రయత్నం కూడా బెడిసికొట్టింది. అయినా వాపునే బలుపు అనుకుని టీడీపీ గ్రాఫ్ పెరిగిపోయిందని చంద్రబాబు, టీడీపీ నేతలు కొద్దిరోజులుగా గాల్లో తేలిపోయారు. తీరా ఎన్నికలు దగ్గరకు వచ్చాక వైఎస్సార్‌సీపీ నిర్వహించిన నాలుగు 'సిద్ధం' సభలు టీడీపీ అబద్ధపు ప్రచారాన్ని పటాపంచలు చేశాయి. ఇప్పుడు వైఎస్ జగన్ చేపడుతున్న బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటం ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఆదరణను తేటతెల్లం చేస్తోంది. దీంతో టీడీపీ అంతర్మథనంలో మునిగిపోయింది. పొత్తులు కూడా వికటించినట్లు తేలడంతో ఇప్పుడు 10 శాతం అభ్యర్థులనైనా మార్చి ఉన్నంతలో పరిస్థితిని చక్కదిద్దుకోవాలనే దిశగా చంద్రబాబు మల్లగుల్లాలు పడుతున్నారు.

**తప్పుడు ప్రచారమూ పని చేయలేదు..**

### పనిచేయని పొత్తులు

2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన తర్వాత టీడీపీ పరిస్థితి దయనీయంగా మారిపోవడంతో ఈ ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తులు ఉంటే తప్ప ముందుకు వెళ్లే పరిస్థితి లేదని గ్రహించిన చంద్రబాబు జనసేన, బీజేపీతో కలిశారు. అయినా పార్టీ బలం పెరగకపోగా మరింతగా క్షీణించడంతో సహనం కోల్పోయి ఎన్నికల ప్రచార సభల్లో అవాకులు చవాకులు పేలుతున్నారు. మరోవైపు చంద్రబాబు సభలు, రోడ్‌షోలకు జనం నుంచి స్పందన లేకపోవడంతో టీడీపీలో ఆందోళన పెరిగిపోతోంది. ఒకవైపు వైఎస్ జగన్ రోడ్‌షోలు, సభలకు జనం పోటెత్తుతుంటే తమ సభలకు జనం రాకపోవడంతో టీడీపీ నాయకులకు కళ్లెదుటే ఓటమి కనిపిస్తోంది. చంద్రబాబు నాలుగు నెలల క్రితమే ప్రకటించిన మేనిఫెస్టో, ఇప్పుడు తాజాగా ఇస్తున్న ఎన్నికల హామీలు ప్రజలను ఏమాత్రం నమ్మించలేకపోతున్నాయి.

### సత్యవేడు అభ్యర్థి మార్పు!

చిత్తూరు జిల్లా సత్యవేడులో ఫిరాయింపు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని మార్చడం దాదాపు ఖాయమైనట్లు చెబుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలానికి ప్రజల్లో ఆదరణ లేదని గ్రహించిన వైఎస్సార్‌సీపీ సీటు నిరాకరించింది. ఆయన్ని టీడీపీలో చేర్చుకుని చంద్రబాబు అదే సీటు కేటాయించారు. ఇప్పుడు తత్వం బోధపడటంతో ఆదిమూలాన్ని తప్పించి మరో వ్యక్తికి సీటు ఇవ్వాలని చూస్తున్నారు. అడ్డగోలు వాదనలు చేయడం ద్వారా ఎల్లో మీడియాలో గుర్తింపు పొందిన కొలికపూడి శ్రీనివాస్‌ని గొప్ప వ్యక్తిగా భావించి తిరువూరు సీటు ఇచ్చేశారు. కానీ అక్కడ ఆయన్ని తట్టుకోలేక సొంత పార్టీ నేతలే లబోదిబోమంటున్నారు. దీంతో శ్రీనివాస్‌ని వదిలించుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. చింతలపూడిలో స్థానిక నేతలను కాదని ఎన్ఆర్ఐ సొంగా రోషన్‌ను ఎంపిక చేశారు. ఆయన కనీస పోటీ ఇచ్చే పరిస్థితి లేదని తెలియడంతో మరొక డబ్బున్న నేత కోసం కసరత్తు చేస్తున్నారు. గజపతినగరం, శ్రీకాకుళం, పాతపట్నం, మడకశిర స్థానాల్లోనూ అభ్యర్థులను మార్చే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### ఉండి, అనపర్తి సీట్లపై అనిశ్చితి

పశ్చిమ గోదావరి జిల్లా ఉండి సీటుపైనా అనిశ్చితి నెలకొంది. ఉండి సీటును సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజుకు ప్రకటించినప్పటికీ, చంద్రబాబు ఒత్తిడితో వివాదాస్పద నేత రఘురామకృష్ణరాజును అక్కడ నుంచి పోటీ చేయిస్తారనే ప్రచారం జరుగుతోంది. రఘురామరాజుకు బీజేపీ నర్సాపురం ఎంపీగా అవకాశం ఇవ్వకపోవడంతో ఆయన టీడీపీలో చేరి ఉండి నుంచి పోటీ చేస్తారని చెబుతున్నారు. రఘురామరాజు నర్సాపురం ఎంపీ సీటు కోసం ఇంకా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అది సాధ్యం కాకపోతే ఉండి సీటు కేటాయించక తప్పదని టీడీపీ నేతలు చెబుతున్నారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని మాడుగల అభ్యర్థిని మార్చాలని అక్కడి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఒత్తిడి తెస్తుండడంతో ఆ దిశగానూ కసరత్తు నడుస్తోంది. కడప ఎంపీ, జమ్మలమడుగు ఎమ్మెల్యే స్థానాల మార్పుపైనా చంద్రబాబు తర్జనభర్జన పడుతున్నారు. అనపర్తి సీటు మళ్లీ తిరిగి టీడీపీకి కేటాయించే దిశగా బీజేపీ, టీడీపీ నేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. జనసేనకు కేటాయించిన నర్సాపురం స్థానాన్ని టీడీపీ తీసుకుంటుందనే చర్చ కూడా నడుస్తోంది. మొత్తంగా 20కిపైగా ఎమ్మెల్యే, ఒకట్రెండు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను మార్చడం ద్వారా బలమైన వైఎస్సార్‌సీపీకి కనీస పోటీ ఇచ్చేలా వాతావరణాన్ని మార్చాలని చంద్రబాబు ఆలోచిస్తున్నారు.

### బార్ కౌన్సిల్ చైర్మన్‌గా ద్వారకనాథరెడ్డి



ద్వారకనాథ్ రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న రామారావు, రామజోగేశ్వర రావు తదితరులు

**సాక్షి, అమరావతి:** ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర న్యాయవాద మండలి (బార్ కౌన్సిల్) చైర్మన్‌గా సీనియర్ న్యాయవాది ఎస్.ద్వారకనాథరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ కౌన్సిల్ చైర్మన్‌గా వ్యవహరించిన గంటా రామారావు ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. నిబంధనలకు అనుగుణంగా చైర్మన్ ఎన్నిక కోసం బార్ కౌన్సిల్ నోటిఫికేషన్ జారీ చేసింది. శుక్రవారం నామినేషన్ల గడువు ముగిసే సమయానికి ద్వారకనాథరెడ్డి ఒక్కరే బరిలో ఉండడంతో ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సభ్యులు ఆలూరు రామిరెడ్డి ప్రకటించారు. జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న ఓ న్యాయవాది బార్ కౌన్సిల్ చైర్మన్‌గా నియమితులు కావడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి. వైస్ చైర్మన్‌గా విశాఖపట్నంకు చెందిన సిరిపురపు కృష్ణమోహన్ ఏకగ్రీవంగానే ఎన్నికయ్యారు. ఈ విషయంలో బార్ కౌన్సిల్ సభ్యుడు యర్రంరెడ్డి నాగిరెడ్డి కీలక పాత్ర పోషించారు. కాగా, ద్వారకనాథరెడ్డి 2006 నుంచి బార్ కౌన్సిల్ సభ్యులుగా కొనసాగుతున్నారు. వరుసగా మూడుసార్లు ఆయన బార్ కౌన్సిల్ సభ్యుడిగా గెలుపొందారు. క్రమశిక్షణ కమిటీ–1కు గత 18 సంవత్సరాలుగా చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఎన్నిక అనంతరం మాజీ చైర్మన్ గంటా రామారావు నేతృత్వంలో మిగిలిన సభ్యులందరూ ద్వారకనాథరెడ్డిని గజమాలతో సత్కరించారు. కృష్ణమోహన్ 2001 నుంచి బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికవుతూ వస్తున్నారు. ప్రస్తుతం ఆయన క్రమశిక్షణ కమిటీ–2కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నికయిన ఈ ఇద్దరిని పలువురు న్యాయవాదులు అభినందించి సత్కరించారు.

## పుట్టింటి నాశనం కోరేవారిని మిమ్మల్నే చూస్తున్నాం

**షర్మిల, సునీతపై బద్వేల్ ఎమ్మెల్యే సుధ ధ్వజం**



**బద్వేల్ అర్బన్ :** లోకంలో ఎక్కడైనా మనం కష్టపడ్డా పుట్టింటి వారు సుఖంగా ఉండాలని కోరుకునే అక్కచెల్లెమ్మలను మాత్రమే చూశామని, కానీ కడుపు మంటతో శత్రువులతో చేతులు కలిపి పుట్టింటివారి నాశనం కోరుకొనే అక్క చెల్లెమ్మలను మిమ్మల్నే చూస్తున్నామంటూ షర్మిల, సునీతపై బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ విరుచుకుపడ్డారు. మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో వీరు చేస్తున్న ప్రచారం గోబెల్స్ ప్రచారాన్ని మించిపోయిందన్నారు. వైఎస్ వివేకాని ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనైతికంగా ఓడించిన బీటెక్ రవీంద్రారెడ్డి, ఆదినారాయణరెడ్డితో వీరే చేతులు కలుపుతారని, వీరే వైఎస్ కుటుంబంపై నిందలు వేస్తారని అన్నారు. డాక్టర్ సుధ శుక్రవారం వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సౌమ్యుడు, ప్రజాభివృద్ధిని కాంక్షించే వ్యక్తిగా ప్రజలందరికీ తెలిసిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై మూడేళ్లుగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. వివేకాని గొడ్డలితో నరికి చంపానని చెబుతున్న డ్రైవర్ దస్తగిరికి అండగా ఉండేది సునీత, ఆమె భర్త కాదా అని ప్రశ్నించారు. దస్తగిరిని రెండు నెలలు ఢిల్లీలో సీబీఐ అధికారుల వద్దే ఉంచి ట్రైనింగ్ ఇప్పించి, డబ్బులు ఇచ్చిందెవరని అన్నారు. ఇవన్నీ చూస్తే హత్యకు కారకులుగా సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి వైపే అన్ని వేళ్లూ చూపుతున్నాయని అన్నారు. వారు పన్నిన కుట్రలో అవినాష్‌రెడ్డి ఇరుక్కున్నారని చెప్పారు. మరోవైపు కేసు కోర్టులో విచారణలో ఉండగానే ఎంపీ అవినాష్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. కోర్టులో విచారణ పూర్తయితే అవినాష్‌రెడ్డి కడిగిన ముత్యంలా నిలుస్తారని అన్నారు.

**సీఎం జగన్‌ను ఎందుకు ఓడించాలి?**

ఈ అక్కచెల్లెళ్లు సీఎం వైఎస్ జగన్‌ని ఓడించాలంటున్నారని, ఎందుకు ఓడించాలని నిలదీశారు. తనలాంటి లక్షలాది ఆడపడుచులకు అండగా నిలిచినందుకా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ బద్వేల్ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను గెలిపించారని, ఎంతో మంది అర్హులు, ఆశావహులున్నా సామాన్యురాలినైనా తనకే మళ్లీ టికెట్ ఇచ్చారని తెలిపారు. సీఎం జగన్ వివిధ సంక్షేమ పథకాల ద్వారా రాజకీయాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా జిల్లావ్యాప్తంగా అక్కచెల్లెమ్మలకు రూ.12,136 కోట్లు, బద్వేల్ నియోజకవర్గంలో రూ.1,646 కోట్లు బ్యాంకు ఖాతాలకు జమ చేశారని, ఇందుకు ఓడించాలా అని ప్రశ్నించారు. వారిద్దరి శాపనార్థాల కంటే లక్షలాది సామాన్య మహిళలు, కోట్లాది ప్రజల ఆదరాభిమానాలు సీఎం వైఎస్ జగన్‌కు శ్రీరామరక్షగా ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, కుడా చైర్మన్ గురుమోహన్ పాల్గొన్నారు.

## షర్మిలది నీచమైన రాజకీయం

- వ్యక్తిగత ఎజెండాతో సీఎం జగన్‌పై షర్మిల నిందలు
- కోర్టు పరిధిలో ఉన్న వివేకా హత్యపై ఎలా మాట్లాడతారు?
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
- వైఎస్సార్‌సీపీ నాయకురాలు వాసిరెడ్డి పద్మ



**సాక్షి, అమరావతి:** షర్మిల నీచమైన రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మండిపడ్డారు. కోర్టు పరిధిలో ఉన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై ఆమె ఎలా మాట్లాడతారని, హంతకుడు అంటూ అవినాష్‌రెడ్డిపై ఎలా నిందలు వేస్తున్నారని నిలదీశారు. వాసిరెడ్డి పద్మ శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కోర్టు పరిధిలో ఉన్న కేసుపై షర్మిలే తీర్పు చెప్పేస్తున్నారని, శిక్ష కూడా ఆమే వేస్తున్నారని, వైఎస్సార్ కుమార్తె చేయాల్సిన పనేనా ఇది అని అన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలను ఎన్నికల అంశంగా మార్చి ఇంత అన్యాయంగా రాజకీయం చేయడం అవసరమా అని ప్రశ్నించారు. అది కూడా కడప గడ్డపై నిలబడి మాట్లాడుతున్నారన్నారు. షర్మిలకు కోర్టులపైన, వ్యవస్థలపైన నమ్మకం లేదా అని నిలదీశారు. కడప లోక్‌సభ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డి గురించి హంతకుడు అని ప్రచారం చేయడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

**వైఎస్సార్ కుటుంబంలో చిచ్చు పెట్టడానికే**

వైఎస్సార్ కుటుంబంలో చిచ్చు పెట్టడానికి మూడు దశాబ్దాలుగా కుట్ర జరుగుతోందన్నారు. వైఎస్సార్ బతికున్న సమయంలోనే కాంగ్రెస్ పార్టీలో ఉన్న పెద్ద తలకాయలు కొందరు చంద్రబాబుతో చేతులు కలిపి ఆ కుటుంబాన్ని విడదీయాలని చేసిన కుట్రలు కడప ప్రజలకు కొత్త కాదన్నారు. వైఎస్సార్ చనిపోయాక ఈరోజు వీరు సానుభూతి కోసం మాట్లాడుతున్న వివేకానందరెడ్డే వైఎస్ కుటుంబం నుంచి విడిపోయి ఓ మంత్రి పదవి కోసం కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపారని, సీఎం జగన్‌కి, వైఎస్ బిడ్డలకు వ్యతిరేకంగా రాజకీయం చేశారని, ఇదంతా కడప ప్రజలు చూడలేదా అని నిలదీశారు. వివేకానందరెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించిన బీటెక్ రవి ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేసిన వ్యక్తి అని, అదే బీటెక్ రవి ఇప్పుడు షర్మిల పక్కన మాట్లాడుతున్నారని అన్నారు. చంద్రబాబు ఉచ్చులో షర్మిల చిక్కుకున్నారని తెలిపారు. వైఎస్ కుటుంబంలో చిచ్చు పెట్టాలని బాబు చూస్తున్నారని, ఆయనతో కలిసి షర్మిల సీఎం జగన్‌పై కుట్రలు చేస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత ఎజెండాతో సీఎం జగన్‌పై నిందలు వేస్తున్నారని, వాటిని నమ్మే వారు ఒక్కరు కూడా రాష్ట్రంలో లేరని చెప్పారు. ఇప్పటికీ మండే ఎండలలో ప్రజలు సీఎం జగన్ కోసం ఎదురుచూస్తున్నారని, ఆయనపై ఉన్న అభిమానానికి ఇదే నిదర్శనమని తెలిపారు.

**వైఎస్సార్‌పై కేసులు పెట్టిన కాంగ్రెస్‌లో ఎందుకు చేరారు?**

షర్మిల ఏం రాజకీయం చేయాలనుకుంటున్నారో ప్రజలకు చెప్పాలని పద్మ డిమాండ్ చేశారు. స్వార్థపూరిత రాజకీయాల కోసం మీరు ఏమైనా చేస్తారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సమాధి దగ్గర షర్మిల కాంగ్రెస్ జాబితా చదువుతుంటే చాలామంది హృదయాలు ముక్కలయ్యాయన్నారు. వైఎస్సార్‌ను అవినీతిపరుడుగా చిత్రించి కేసులు పెట్టి, ఆయన పేరును ఛార్జిషీట్‌లో చేర్చిన కాంగ్రెస్ పార్టీలో షర్మిల ఎందుకు చేరారని నిలదీశారు. సీఎం జగన్‌ని జైలు నుంచి బయటకు రాకూడదని కుట్ర పన్నిన కాంగ్రెస్ పార్టీ తరఫున మాట్లాడుతున్న షర్మిలను చూసి ఊసరవెల్లులు కూడా సిగ్గుపడుతున్నాయని చెప్పారు. షర్మిల చాలా విషయాలలో యూటర్న్ తీసుకున్నారని తెలిపారు. తెలంగాణాలో పార్టీ ఎందుకు పెట్టారు, ఎందుకు ఎత్తేశారని ప్రశ్నించారు. ప్రజలకు షర్మిల సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక హోదాను విభజన చట్టంలో, మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఎందుకు పెట్టలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజల దృష్టిలో దోషి అని, ఆ పార్టీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## పిచ్చివేషాలు వేస్తే తాటతీస్తా..

- టీడీపీ కార్యకర్తలకు అధినేత చంద్రబాబు వార్నింగ్
- గోపాలపురం టికెట్ మార్చాల్సిందే అన్న ముళ్లపూడి వర్గీయులు
- ససేమిరా అన్న చంద్రబాబు
- ఆగ్రహంతో బాబు కాన్వాయ్ అడ్డగించిన ముళ్లపూడి వర్గీయులు
- అసహనంతో రెచ్చిపోయి బాబు బెదిరింపులు
- అనపర్తి ఎమ్మెల్యే స్థానంపైనా యూటర్న్
- మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లికే ఇస్తారంటూ ప్రచారం



నల్లజర్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు వార్నింగ్ ఇస్తున్న చంద్రబాబు

**సాక్షి, రాజమహేంద్రవరం/నల్లజర్ల:** టీడీపీ అధినేత చంద్రబాబుకు సొంత పార్టీ నేతల నుంచే నిరసన సెగ ఎదురైంది. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజును మార్చాలని చాలాకాలంగా చెబుతున్నా వినిపించుకోవడం లేదని రెచ్చిపోయి చంద్రబాబు కాన్వాయ్‌కు తమ్ముళ్లు అడ్డం తిరిగారు. దీంతో ఆగ్రహావేశానికి గురైన చంద్రబాబు తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. ఏం తమాషాలు చేస్తున్నారా..? పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే ఒక్కొక్కరి తాట తీస్తానంటూ బెదిరింపులకు దిగి అసహనం వ్యక్తం చేశారు. మద్దిపాటిని మార్చే విషయంలో ఎటువంటి స్పష్టతా ఇవ్వకుండా చంద్రబాబు బయలుదేరుతుండగా ఆయన కాన్వాయ్‌ను అడ్డుకుని బాపిరాజు వర్గీయులు ఆందోళనకు దిగారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. భద్రతా సిబ్బంది చంద్రబాబు కాన్వాయ్‌ను ముందుకు తీసుకెళ్లారు. గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా వెంకట్రాజును తప్పించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వర్గం పట్టుబట్టింది. ఆయనకు మినహా ఎవరికి ఇచ్చినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఆయనకు మాత్రం వద్దని స్పష్టం చేశారు. ఈ పరిణామం తమ్ముళ్ల మధ్య తన్నులాటకు దారి తీసింది. ఇది చివరకు అధినేత చంద్రబాబునే ఎదిరించి, ఆయన కాన్వాయ్‌ను అడ్డుకునే స్థాయికి చేరింది.

**ఫలించని బుజ్జగింపులు**

తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల ప్రియాంక కన్వెన్షన్ హాలులో చంద్రబాబు శుక్రవారం టీడీపీ నేతల సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత రాజమహేంద్రవరం, ఏలూరు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు వేర్వేరుగా సమీక్షలు నిర్వహించారు. అంతకుముందు రాత్రి నల్లజర్లలో బస చేసిన చంద్రబాబు గురువారం అసమ్మతి నేత, జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజుతో చర్చలు జరిపారు. గోపాలపురం ఎమ్మెల్యే స్థానం మార్పు విషయమై శుక్రవారం మాట్లాడుదామని ముగించారు. దీంతో శుక్రవారం ఉదయం 10 గంటలకే ముళ్లపూడి తన వర్గీయులతో బాబు వద్దకు వచ్చారు. సాయంత్రం 3 గంటలైనా తనను చంద్రబాబు పిలవకపోవడంతో అవమానంగా భావించిన ఆయన వర్గీయులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా 'మద్దిపాటి మాకొద్దు'ంటూ నినాదాలు చేశారు. దీంతో చంద్రబాబు 20 మందిని మాట్లాడేందుకు అనుమతించారు. వారు వెళ్లే సమయానికే ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట్రాజు వర్గీయులు అక్కడ కనిపించడంతో బాపిరాజు వర్గీయులు ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు. తమను చర్చలకు పిలిచి ప్రత్యర్థి వర్గాన్ని అక్కడే కూర్చోబెడతారా? అంటూ బాపిరాజు వర్గీయులు చంద్రబాబును నిలదీశారు. ఈ క్రమంలో ఆయన సమక్షంలోనే ఇరు వర్గాలు బాహాబాహీకి దిగడంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ముళ్లపూడికి నచ్చజెప్పేందుకు చంద్రబాబు ప్రయత్నం చేసినా బాపిరాజు వర్గం మాత్రం మద్దిపాటికి మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని మరోసారి స్పష్టంగా చెప్పారు. నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు తన అనుయాయులతో వచ్చి చంద్రబాబును కలసి బాపిరాజుతో కొద్దిసేపు మాట్లాడారు.

**వనితకు జేజేలు**

చంద్రబాబు విధానంపై విసుగుచెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కొందరు 'జై వనితమ్మ జైజై వనితమ్మ' అంటూ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనితకు మద్దతుగా నినాదాలు చేయడం కనిపించింది. ఏలూరు జిల్లా పోలవరంలో జనసేన అభ్యర్థిని మార్చి, టీడీపీ అభ్యర్థి బొరగం శ్రీనివాస్‌కు కేటాయించాలని నేతలు బాబు ఎదుట ఆందోళనకు దిగారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా తొలుత టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరు ప్రకటించి, అనంతరం బీజేపీకి చెందిన శివరామకృష్ణంరాజును ప్రకటించారు. ఈ పరిణామంతో కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న నల్లమిల్లిని పిలిపించి చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా అనపర్తి టికెట్ ఆయనకే కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పరిణామాలపై బీజేపీ నేతలు గుర్రుగా ఉన్నారు. తమకు కేటాయించిన స్థానాన్ని తిరిగి టీడీపీకి ఎలా కట్టబెడతారని ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

## వివేకాను చంపిన వాళ్లు రోడ్లపై తిరుగుతున్నారు

- హంతకులను కాపాడుతున్నది సీఎం జగనే
- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల
- కాంగ్రెస్‌లో చేరిన కిల్లి కృపారాణి



**కాశినాయన/కలసపాడు/పోరుమామిళ్ల/బి.కోడూరు/బద్వేలు అర్బన్ :** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డిని చంపిన వాళ్లు స్వేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నారని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. ఆమె శుక్రవారం వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం అమగంపల్లి నుంచి బస్సు యాత్ర ప్రారంభించారు. కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు తదితర ప్రాంతాల మీదుగా ఆమె రోడ్ షో సాగింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారాన్ని అడ్డుపెట్టి వివేకా హంతకులను కాపాడుతున్నారని అన్నారు. అవినాష్‌రెడ్డి వివేకాను చంపించారని, ఆయనే దోషి అని సీబీఐ చెబుతోందని అన్నారు. హత్య జరిగినపుడు హంతకులు, అవినాష్‌రెడ్డి ఒకే చోట ఉన్నట్లు రుజువులు ఉన్నాయన్నారు. గొడ్డలితో నరికితే హార్ట్ ఎటాక్ అని ఎలా చెబుతారని ప్రశ్నించారు. హార్ట్ ఎటాక్ అని సాక్షి మీడియాలోనే ముందుగా వచ్చిందన్నారు. సీఎం జగన్ బీజేపీ మెడలు వంచి ప్రత్యేక హోదా ఎందుకు తేలేదన్నారు. రాష్ట్రంలో పట్టుమని పది పరిశ్రమలు రాలేదని, అభివృద్ధి లేదని చెప్పారు. ఉపాధి లేదని, ప్రజలు వలస పోతున్నారని అన్నారు. పంటలు ఎండిపోతే ఒక్క రైతుకూ నష్ట పరిహారం ఇవ్వలేదని చెప్పారు. చంద్రబాబు రూ. 2 లక్షల కోట్లు అప్పులు చేస్తే, సీఎం జగన్ ఏకంగా రూ. 7 లక్షల కోట్లు అప్పులు చేశారని తెలిపారు. చంద్రబాబు, జగన్ ప్రభుత్వాలు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేదన్నారు. 2014లో బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు ప్రత్యేక హోదా పది కాదు పదిహేనేళ్లు కావాలన్నారని, ఐదేళ్లు పరిపాలన చేసి, కేంద్రంలో మంత్రి పదవులు తీసుకుని కూడా ప్రత్యేక ప్యాకేజీకి ఊకొట్టి ఊసరవెల్లిలా మారారన్నారు. సీఎం జగన్ మూడు రాజధానులని చెప్పి ఒక్కటి కూడా కట్టలేదన్నారు. మద్యపాన నిషేధమని చెప్పి సర్కారే మద్యాన్ని అమ్ముతోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీజేపీకి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిందని, విభజన హామీలపై పోరాడలేదని, కడప స్టీల్‌ప్లాంట్ ఊసే లేదని విమర్శించారు. వైఎస్ వివేకా కుమార్తె సునీత మాట్లాడుతూ ఎంపీ టికెట్ అవినాష్‌రెడ్డికి ఇవ్వవద్దని, షర్మిలకు ఇవ్వాలని చెప్పినందుకే వివేకాను హత్య చేశారన్నారు.

**షర్మిల రోడ్‌షోలకు స్పందన కరువు**

షర్మిల రోడ్‌షోలకు జనస్పందన కరువైంది. ఎక్కడా పట్టుమని రెండు వందల మంది జనం లేరు. అక్కడక్కడా షర్మిల కార్యక్రమం ముగింపులో ప్రజలనుంచి జై జగన్ నినాదాలు వినిపించాయి. కాగా, పోరుమామిళ్ల ప్రచారంలో సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ కనిపించలేదు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు కిల్లి కృపారాణి అమగంపల్లెలో కాంగ్రెస్‌లో చేరారు. షర్మిల ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## జై భారత్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా విడుదల

**ప్రకటించిన పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ**


**ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు):** సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితాను జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వి.వి. లక్ష్మీనారాయణ శుక్రవారం విడుదల చేశారు. తొలి జాబితాలో భాగంగా ఏపీలో 48 మంది ఎమ్మెల్యే, 6గురు ఎంపీ అభ్యర్థులను ప్రకటించారు. ఎంవీపీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఏపీలోని ఎంపీ స్థానాలకు గానూ అరకు నుంచి చంటిబాబు, శ్రీకాకుళం నుంచి ఇప్పిలి సీతారాజు, అనకాపల్లి నుంచి శరత్‌చంద్ర, కాకినాడ నుంచి ఏ వెంకన్నదొర, కర్నూల్ నుంచి సుంకర శ్రీధర్, హిందూపురం నుంచి బీపీ నాగరాజు పార్టీ తరఫున పోటీలో నిలవనున్నారన్నారు. ఉగాది అనంతరం మరో జాబితాను విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. జై భారత్ ఎన్నికల మేనిఫెస్టోను సైతం లక్ష్మీనారాయణ విడుదల చేశారు. కాగా తెలంగాణలో మూడు ఎంపీ స్థానాలకు పోటీ చేస్తున్నట్లు తెలిపారు.



● ప్రభాస్

## సరికొత్త ప్రయత్నం?

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. భైరవ పాత్రలో ప్రభాస్, పద్మావతి పాత్రలో దీపికా పదుకోన్, అశ్వత్థామ పాత్రలో అమితాబ్ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కావాల్సింది. అయితే వాయిదా పడే అవకాశం ఉందట. కాగా ఈ చిత్రం యూనిట్ ఓ సరికొత్త ప్రయత్నం చేస్తోందనే టాక్ ప్రచారంలోకి వచ్చింది. ఈ చిత్రంలో లీడ్ రోల్స్‌లో కనిపించే ప్రభాస్, దీపికా పదుకోన్, అమితాబ్ బచ్చన్‌ల పాత్రలకు సంబంధించిన పూర్వాపరాలను, ఆ పాత్రల తీరు తెన్నులను చెబుతూ ఓ యానిమేటెడ్ వీడియోను రెడీ చేస్తున్నారట. ఈ వీడియో నేరుగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుందని భోగట్టా. ఈ వీడియోలోని తన పాత్రకు ప్రభాస్ ఇప్పటికే డబ్బింగ్ కూడా పూర్తి చేశారని తెలిసింది. అయితే ఈ యానిమేటెడ్ వీడియో ఏ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఎప్పట్నుంచి స్ట్రీమింగ్ కానుంది? వీడియో నిడివి ఎంత? అసలు వార్తల్లో ఉన్నట్లు యానిమేటెడ్ వీడియో షూట్ జరిగిందా? లేదా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.



● రష్మిక

## బర్త్‌డే స్పెషల్

'పుష్ప: ది రైజ్' చిత్రంలో శ్రీవల్లి పాత్రతో నేషనల్ క్రష్‌గా మారిపోయారు రష్మికా మందన్న. ఇటు దక్షిణాదితో పాటు అటు ఉత్తరాదిలో వరుస సినిమాలు చేస్తూ ఫుల్ స్వింగ్‌లో దూసుకెళుతున్న రష్మికా మందన్న పుట్టినరోజు ఏప్రిల్ 5. ఈ సందర్భంగా ఆమె నటిస్తున్న తాజా చిత్రాలు 'పుష్ప 2: ది రూల్', 'ది గర్ల్ ఫ్రెండ్', 'రెయిన్ బో' నుంచి బర్త్ డే స్పెషల్‌గా ఆమె కొత్త లుక్స్ విడుదల చేశారు మేకర్స్. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పుష్ప: ది రూల్'. సుకుమార్ రైటింగ్స్ భాగస్వామ్యంతో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రష్మిక బర్త్ డే సందర్భంగా 'పుష్ప: ది రూల్'లో ఆమె పాత్ర గెటప్‌ను రివీల్ చేస్తూ పోస్టర్‌ను రిలీజ్ చేసింది యూనిట్. ఈ ఆగస్టు 15న ఈ సినిమా విడుదలవుతోంది. ఇదిలా ఉంటే.. రష్మికా మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నటుడు రాహుల్ రవీంద్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. వైవిధ్యమైన ప్రేమకథతో తెరకెక్కుతున్న ఈ మూవీ 60 శాతం షూటింగ్ పూర్తయింది. అదే విధంగా రష్మిక లీడ్ రోల్‌లో నటిస్తున్న మరో చిత్రం 'రెయిన్‌బో'. శాంతరూబన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దేవ్ మోహన్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. తెలుగు–తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ మూవీ నుంచి కూడా రష్మిక లుక్ విడుదలైంది.



● హన్స్ జిమ్మెర్, ఏఆర్ రెహమాన్

## రామాయణ్‌కు సంగీతం?

ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్స్ ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ హిందీ 'రామాయణ్'కు సంగీతం అందించనున్నారన్నది తాజా టాక్. రామాయణం ఆధారంగా దర్శకుడు నితీష్ తివారీ 'రామాయణ్' అనే ట్రయాలజీని తెరకెక్కిస్తున్నారనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ముంబైలోని ఓ స్టూడియోలో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోందని సమాచారం. ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడి పాత్రలో యశ్, కైకేయి పాత్రలో లారా దత్తా కనిపించనున్నారనే ప్రచారం జరుగుతోంది. నటీనటుల పేర్లను యూనిట్ అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా 'రామాయణ్' ట్రయాలజీకి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ సంగీతం అందించనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. హాలీవుడ్‌లో 'ది లయన్ కింగ్' (యానిమేటెడ్) 'డ్యూన్', 'గ్లాడియేటర్', 'ఇన్సెప్షన్' వంటి హిట్ సినిమాలకు హన్స్ జిమ్మెర్ సంగీతం అందించారు. 'ది లయన్ కింగ్', 'డ్యూన్' సినిమాలకు గాను హన్స్‌కు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఆస్కార్ అవార్డులు వచ్చాయి. 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాకుగాను బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఏఆర్ రెహమాన్‌కు ఆస్కార్ అవార్డులు వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. కాగా వచ్చే శ్రీరామ నవమి సందర్భంగా 'రామాయణ్' చిత్రాన్ని అధికారికంగా ప్రకటించాలనుకున్నారట మేకర్స్. మరి... ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తారా? నటీనటులు ఎవరు? అనేది ఆ రోజు తెలిసిపోతుంది. ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా, అల్లు అరవింద్, మధు మంతెన దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నారట.



● అశోక్ గల్లా

## ఏమయ్యిందే..!

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, హీరో మహేశ్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. 'గుణ 369' ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో వారణాసి మానస హీరోయిన్. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్‌పై సోమినేని బాలకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం (ఏప్రిల్ 5) అశోక్ గల్లా బర్త్ డే. ఈ సందర్భంగా ఈ మూవీ నుంచి 'ఏమయ్యిందే..' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. అశోక్, మానసల మధ్య వచ్చే ఈ పాట కలర్‌ఫుల్‌గా ఉంది.

● ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో అశోక్ గల్లా హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. ఈ చిత్రంతో ఉద్భవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'లవర్', 'మ్యాడ్' చిత్రాల ఫేమ్ శ్రీ గౌరీప్రియ కథానాయికగా నటించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్ట్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు నిర్మాతలు.

## ఇక వ్యక్తిగత జీవితంపై ఫోకస్

వ్యక్తిగత జీవితానికి తాను ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చుకోవాల్సిన తరుణం వచ్చిందన్నట్లుగా మాట్లాడుతున్నారు హీరోయిన్ తాప్సీ. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో తాప్సీ వివాహం గత నెల 23న ఉదయ్‌పూర్‌లో జరిగిందనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే తాప్సీ, మథియాస్ తమ పెళ్లి గురించి అధికారికంగా ప్రకటించలేదు. కానీ వధూవరులుగా తాప్సీ, మథియాస్ ఉన్న వీడియోలు వైరల్ అవుతుండటంతో వీరిద్దరికీ వివాహం జరిగిందని స్పష్టమైంది. కాగా పెళ్లి తర్వాత తాప్సీ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''కొన్నేళ్లు గడిచిన తర్వాత నేను నటించిన సినిమాల జాబితాను ఓ సారి చూసుకున్నప్పుడు ఆ జాబితా నాకు సంతోషాన్నివ్వాలి. ఎందుకుంటే నా జీవితంలోని ఎక్కువ సమయాన్ని సినిమాలకే కేటాయించాను. 24 గంటల్లో నేను పన్నెండు గంటలు పని చేసిన రోజులూ ఉన్నాయి. అయితే ఇకపై నేను నా వృత్తి జీవితంపైకన్నా, వ్యక్తిగత జీవితంపై ఎక్కువ ఫోకస్ పెట్టాలనుకుంటున్నా. అందుకే ఈ సినిమా వదులుకోకూడదు అనిపించేంత మంచి స్క్రిప్ట్ అయితేనే చేయాలనుకుంటున్నాను. కెరీర్‌కి మించిన జీవితం ఒకటి ఉంటుంది. ఆ జీవితాన్ని ఆస్వాదించాలనుకుంటున్నాను. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితులతో సమయం గడపాలనుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు తాప్సీ.



● మథియాస్, తాప్సీ



● తాప్సీ

## బ్యాక్ టు షూట్

దాదాపు రెండు నెలల తర్వాత తిరిగి నటిగా మేకప్ వేసుకున్నారు ప్రియాంకా చోప్రా. ఇద్రిస్ ఎల్బా, జాన్ సెనా, ప్రియాంకా చోప్రా, జాక్ క్వాయిడ్, స్టీఫెన్ రూట్ ప్రధాన పాత్రధారులుగా హాలీవుడ్‌లో 'హెడ్స్ ఆఫ్ స్టేట్' అనే కామెడీ యాక్షన్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాకు ఇలియా నైషుల్లర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ అమెరికాలో మొదలైంది. ''..అండ్ వుయ్ ఆర్ బ్యాక్..'' అంటూ 'హెడ్స్ ఆఫ్ స్టేట్' సినిమా స్క్రిప్ట్‌ను తన ఇన్‌స్టా స్టేటస్‌లో షేర్ చేశారు ప్రియాంకా చోప్రా. దీంతో 'హెడ్స్ ఆఫ్ స్టేట్' షూట్‌లో ఆమె పాల్గొంటున్నారని స్పష్టమైంది. ఇక రెండు నెలల క్రితం తన వ్యక్తిగత పనుల కోసం ప్రియాంకా చోప్రా ఇండియా వచ్చారు. సోదరుడు సిద్ధార్థ్ చోప్రా నిశ్చితార్థం వేడుకలో చురుగ్గా పాల్గొన్నారు ప్రియాంక. ఈ వేడుకతో పాటు మరికొన్ని పనులను చక్కబెట్టుకుని ప్రియాంకా చోప్రా మళ్లీ నటిగా బిజీ అవుతున్నారు.



● ప్రియాంకా చోప్రా

## స్నేహం నేపథ్యంలో...

దర్శకుడు కొరటాల శివ సమర్పణలో సత్యదేవ్ హీరోగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వీవీ గోపాలకృష్ణ దర్శకత్వం వహించిన ఈ మూవీలో అతీరా రాజ్, లక్ష్మణ్ మీసాల, రఘు కుంచె, నందగోపాల్ కీలక పాత్రధారులు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మించిన ఈ సినిమా మే 3 రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కృష్ణ కొమ్మాలపాటి మాట్లాడుతూ– ''రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా తెరకెక్కించిన సినిమా ఇది. ఈ సినిమాతో సత్యదేవ్ మరో రేంజ్‌కి చేరుకుంటారు. కాలభైరవ అద్భుతమైన సంగీతం ఇచ్చారు'' అన్నారు. ''ఇంటెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో స్నేహం విలువను చూపిస్తున్నాం'' అన్నారు వీవీ గోపాలకృష్ణ.



● సత్యదేవ్

## భవనమ్‌లో థ్రిల్

సప్తగిరి, ధనరాజ్, షకలక శంకర్, అజయ్, మాళవికా సతీషన్, స్నేహా ఉల్లాల్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'భవనమ్'. 'ది హాంటెడ్ హౌస్' అనేది ట్యాగ్‌లైన్. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్ గుడ్ ఫిలిమ్స్ సమర్పణలో ఆర్‌బి చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి నిర్మిస్తున్న ఈ చిత్రానికి బాలాచారి కూరెళ్ల దర్శకుడు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్, టీజర్‌ని విడుదల చేశారు. ''సస్పెన్స్ థ్రిల్లింగ్ హారర్‌తో పాటు కామెడీ ఎలిమెంట్స్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, కెమెరా: మురళీమోహన్ రెడ్డి ఎస్.



● అజయ్

---

# జస్టిస్ రామలింగేశ్వర్‌రావు కన్నుమూత

- గుండెపోటుతో జర్మనీలో మృతి
- సమర్థవంతమైన న్యాయవాదిగా, ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు
- 13 వేల తీర్పులు.. ఇందులో 100కుపైగా లా జర్నల్‌లో ప్రచురితం
- ప్రస్తుతం ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు
- సంతాపం తెలిపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్



**సాక్షి, హైదరాబాద్/సాక్షి, అమరావతి:** ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వర్‌రావు గుండెపోటుతో కన్నుమూశారు. జర్మనీలో ఉన్న కుమార్తెను చూడడానికి వెళ్లగా శుక్రవారం ఉదయం ఒక్కసారిగా ఆయనకు ఛాతీలో నొప్పి వచ్చింది. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్‌కు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 1956, మే 21న తూర్పుగోదావరి జిల్లాలో రామలింగేశ్వర్‌రావు జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేసిన ఆయన 1982లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. 1984లో జస్టిస్ ఎ.వెంకట్రామిరెడ్డి వద్ద జూనియర్‌గా చేరారు. 1987లో స్వతంత్ర న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. ఓవైపు న్యాయవాదిగా కొనసాగుతూనే.. మరోవైపు ఉస్మానియాలో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా పీజీ విద్యార్థులకు ఇంటర్నేషనల్ లాపైన పాఠాలు చెప్పారు. 2013లో హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టే వరకు సామాజిక న్యాయం, పర్యావరణంతోపాటు పలు విభాగాల్లో సమర్థవంతమైన న్యాయవాదిగా వాదనలు వినిపించారు. ఈ క్రమంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని అడవుల రక్షణకు వాదించిన కేసు దేశమంతటా ×సమత× కేసుగా ప్రసిద్ధి చెందింది. ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐవోఎస్) తదితరాలకు న్యాయవాదిగా పనిచేశారు. న్యాయమూర్తిగా దాదాపు 13 వేల తీర్పులు ఇచ్చారు. వీటిలో 100కు పైగా లా జర్నల్‌లో ప్రచురితం కావడం విశేషం. 2018లో న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. సాహిత్యం, కళలపై రామలింగేశ్వర్‌రావుకు మక్కువ ఎక్కువ. విపరీతంగా పుస్తకాలు చదవడంతో పాటు రాసేవారు.

### సీఎం వైఎస్ జగన్ సంతాపం

ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్ జస్టిస్ రామలింగేశ్వర్‌రావు కన్నుమూయడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జస్టిస్ రామలింగేశ్వర్‌రావు మరణవార్త తనను ఎంతో బాధించిందని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఆయన కుటుంబానికి సీఎం ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# వచ్చాడు బచ్చా.. వదిలిపెట్టను

- ప్రజాగళం సభలో సీఎం జగన్‌పై చంద్రబాబు వ్యాఖ్యలు
- తనది 40 ఏళ్ల రాజకీయ అనుభవమంటూ స్వోత్కర్ష



**సాక్షి, భీమవరం/నరసాపురం/నరసాపురం రూరల్/పాలకొల్లు సెంట్రల్/నల్లజర్ల/ :** నలభై ఏళ్లలో నా జోలికి ఎవడూ రాలేదు.. వచ్చాడు బచ్చా.. చూపిస్తా నేనేంటో.. వదిలిపెట్టనంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విపక్ష నేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, పాలకొల్లు, నల్లజర్లలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలో దేశం ముందుకు దూసుకుపోతుంటే జగన్ పాలనలో రాష్ట్రం రివర్స్‌లో పోతోందన్నారు. రైతు సమస్యలపట్ల ఈ ప్రభుత్వానికి అవగాహనలేదన్నారు. రోజుకు ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, రాష్ట్రంలో 93 శాతం మంది రైతులు అప్పుల్లో ఉన్నారని చెప్పారు. వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లు ఇవ్వలేక శవ రాజకీయాలు చేసిన నీచుడు జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. వర్క్ ఫ్రం హోం తీసుకొచ్చి ప్రపంచంలోని అన్ని కంపెనీలూ మీ ఊరికే తీసుకువస్తామన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లకు ఉద్యోగాలు రావన్నారు. ఇక ఆయా చోట్ల చంద్రబాబు అన్నీ అబద్ధాలు చెబుతుంటే ప్రజలు నవ్వుకున్నారు. అలాగే, నర్సాపురం ప్రాంతం డ్రగ్స్‌కు నిలయంగా మారిందంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇక పక్కా జీఓలతో శంకుస్థాపనలు జరిగి పనులు కూడా మొదలైన బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్, వశిష్ట వంతెన లాంటి ప్రాజెక్టులను తాను వస్తే కడతానని చెప్పడం విడ్డూరమని స్థానికులు మాట్లాడుకున్నారు. నరసాపురంలో హెలీప్యాడ్ వద్ద మండుటెండలో వేచివున్న విద్యార్థులతో మాట్లాడకుండా చంద్రబాబు వెళ్లిపోవడంపై వారంతా మండిపడ్డారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారికి చంద్రబాబు చేసిందేమీ లేకపోవడంతో ఏమీ మాట్లాడలేకే అలా వెళ్లిపోయాడంటూ బహిరంగంగానే ఎద్దేవా చేశారు.

**మాజీమంత్రి కొత్తపల్లికి పరాభవం..**

నరసాపురం సభలో మాజీమంత్రి, జనసేన నేత కొత్తపల్లి సుబ్బారాయుడికి పరాభవం ఎదురైంది. పక్కనే ఉన్న కొత్తపల్లి పేరును చంద్రబాబు ప్రస్తావించకపోవడంతో జనసేన శ్రేణులు నివ్వెరపోయారు. కనీసం ఆయనతో మాట్లాడనీయకపోవడంతో చర్చనీయాంశమైంది. ఇక పాలకొల్లు సభకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్ధిరెడ్డి అప్పారావు గైర్హాజరయ్యారు. మరోవైపు.. నరసాపురం, పాలకొల్లులో జరిగిన చంద్రబాబు సభలకు మాజీమంత్రి పీతల సుజాత కూడా గైర్హాజరయ్యారు.

**టీడీపీలోకి రఘురామకృష్ణరాజు**

ఇక పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు టీడీపీలో చేరారు. పాలకొల్లు సభలో చంద్రబాబు సమక్షంలో ఆయన పచ్చ కండువా కప్పుకున్నారు. ఆయన సేవలు ఎలా ఉపయోగించుకోవాలో పార్టీ నిర్ణయిస్తుందని చంద్రబాబు చెప్పారు. మరోవైపు.. కమలం గుర్తుపై ఓటేసి బీజేపీ ఎంపీగా శ్రీనివాసవర్మను గెలిపించాలని చంద్రబాబు కోరారు. దీంతో ఇక్కడ ఎంపీ అభ్యర్థి తానేనంటూ రఘురామకృష్ణరాజు చేసుకుంటున్న ప్రచారానికి తెరదించారు.

# షూటింగ్‌లు మానేసి ప్రజాసేవకు సిద్ధమా?

- ముఖానికి రంగు వేసుకునే వారిని ప్రజలు నమ్మరు
- పవన్‌కళ్యాణ్‌పై ముద్రగడ విమర్శలు
- జగన్ పాలనలోనే బీసీలకు సముచిత స్థానం: ఎమ్మెల్సీ కుడుపూడి



పిఠాపురం నియోజకవర్గ నాయకులు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో ముద్రగడ

**కిర్లంపూడి:** ముఖానికి రంగు వేసుకునే వారిని ప్రజలు నమ్మరని పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం విమర్శించారు. షూటింగ్‌లు మానేసి, హైదరాబాద్‌లోని ఆస్తులు పూర్తిగా అమ్మేసి, పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడానికి సిద్ధం కావాలని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన ఎన్టీ రామారావును మాత్రమే ప్రజలు విశ్వసించారన్నారు. తన కుమారుడికి సీఎం పీఠం కట్టబెట్టడానికే చంద్రబాబు ప్రజాగళం యాత్ర తప్ప మరొకరికి అధికారం ఇవ్వడానికి కాదన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, పిఠాపురం నియోజకవర్గానికి చెందిన వివిధ సామాజికవర్గాల నేతలు ముద్రగడను, యువనేత ముద్రగడ గిరిబాబును కిర్లంపూడిలోని వారి నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ముద్రగడ నాయకత్వంలో పిఠాపురంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని ఆ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు చెప్పారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ అఖండ మెజార్టీతో మరోసారి గెలిచి, ముఖ్యమంత్రిగా మరో 30 ఏళ్ల పాటు రామరాజ్యం స్థాపిస్తారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**వైఎస్సార్‌సీపీలో అన్నివర్గాలకు సముచిత స్థానం**

ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ, బీసీలకు సముచిత స్థానం కల్పించి, పదవులు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌దేనని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ సముచిత స్థానం కల్పిస్తున్న వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకుని రావాలని కోరారు. ముద్రగడ పద్మనాభం మద్దతుగా నిలవడంతో వైఎస్సార్ సీపీకి మరింత బలం చేకూరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమికి అధికారం అప్పగిస్తే రాష్ట్ర భవిష్యత్తు నియంతల చేతిలోకి పోతుందని హెచ్చరించారు.

# బెడిసి కొట్టిన సానుభూతి డ్రామా

- బొజ్జల సుధీర్‌రెడ్డిపై హత్యాయత్నం అంటూ హైడ్రామా
- వైఎస్సార్‌సీపీపైకి నింద నెట్టేయాలని సోషల్‌మీడియా ద్వారా ప్రచారం
- సెల్ఫీకోసం వచ్చిన ఓ వ్యక్తి బొడ్డులో చాకుని గుర్తించి టీడీపీ దుష్ప్రచారం
- ఆ వ్యక్తిని చితకబాది పోలీస్ స్టేషన్‌కు అప్పగించిన తమ్ముళ్లు
- తమ నాయకుడిపై వైఎస్సార్‌సీపీ హత్యాయత్నం అంటూ తప్పుడు ఫిర్యాదు
- పోలీసుల దర్యాప్తులో అసలు విషయం బట్టబయలు



పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు మహేష్‌కుమార్

**శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా):** ప్రజల్లో సరైన బలం లేక ఓటమిభయంతో కొట్టుమిట్టాడుతున్న టీడీపీ కూటమి అభ్యర్థులు తప్పుడు మార్గంలో సానుభూతికోసం చేసిన ప్రయత్నాలు బెడిసి కొడుతున్నాయి. శ్రీకాళహస్తి తెలుగుదేశం అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డితో సెల్ఫీ దిగేందుకు వచ్చిన ఓ వ్యక్తి బొడ్డులో కత్తి ఉండటంతో ఆయన ఏకంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తనను హత్యచేయించేందుకే పంపించారంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసి, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సానుభూతి పొందాలనుకుని అభాసుపాలైన సంఘటన తాజాగా వెలుగు చూసింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణం ఆరోవార్డు సాలిపేటలోని గజేంద్రనగర్ ప్రాంతంలో గురువారం ఉదయం టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రచారం చేస్తుండగా, అక్కడే ఉన్న మహేశ్‌కుమార్ అనే వ్యక్తి అతనితో సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించాడు. ఆ వ్యక్తి బొడ్డులో చాకును గుర్తించిన టీడీపీ నేతలు అతడికి దేహశుద్ధి చేసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అంతటితో ఆగకుండా వైఎస్సార్‌సీపీ అభ్యర్థే తమ నాయకుడిపై హత్యాయత్నం చేసేందుకు కత్తితో పంపించాడని, తనపై గెలవలేక హత్యారాజకీయాలు జరపడానికి చూస్తున్నారంటూ సోషల్ మీడియాలో బొజ్జల దుష్ప్రచారానికి దిగారు. ఆ పార్టీ నాయకుడు కాసరం రమేష్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు చేపట్టిన విచారణలో అసలు మహేశ్ అనే వ్యక్తి స్థానికుడు కాదని, చంద్రగిరికి చెందినవాడనీ, నల్లగంగమ్మ జాతర సందర్భంగా అత్తవారింటికి వచ్చాడనీ తేలింది. బుధవారం రాత్రి కొందరు తనపై దాడి చేయడంతో ఆత్మరక్షణకోసం చాకును బొడ్డులో దోపుకుని తిరుగుతున్నట్టు తేలింది. ఆ సమయంలో వీధిలోకి ప్రచారానికి వచ్చిన సుధీర్‌రెడ్డిని చూసి సెల్ఫీ దిగేందుకు వెళ్లినట్లు తేలింది.

**చెత్త రాజకీయాలు మానుకోండి**

బొజ్జల సుధీర్ రెడ్డి రాజకీయ ప్రయోజనాల కోసం ఓ అమాయకుడిపై అభాండాలు వేశారు. మహేశ్‌ను వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా ముద్ర వేసి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్‌రెడ్డిపై తనను పంపించారని ఆరోపించడం హేయమైన చర్య. ప్రజల మనసులు చూరగొనేలా రాజకీయాలు ఉండాలి గాని ఇలాంటి చెత్త ఆలోచనలు మానుకోవాలి.– మిద్దెల హరి, ఆర్టీసీ వైస్‌చైర్మన్

# 10 వరకు 'పాలిసెట్' దరఖాస్తు గడువు పొడిగింపు

ఏప్రిల్ 27న యథావిధిగా ప్రవేశ పరీక్ష | సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి

**సాక్షి, అమరావతి:** పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఏప్రిల్ 10వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, సాంకేతిక విద్య, శిక్షణా మండలి చైర్మన్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారంతో దరఖాస్తు గడువు ముగిసినప్పటికీ పలు వర్గాల వినతుల మేరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్ అప్లికేషన్‌లకు మరో ఐదు రోజులు గడువు పొడిగిస్తున్నామన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27వ తేదీన యథావిధిగా జరుగుతుందని తెలిపారు. పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయన్నారు. ఈ శిక్షణ తరగతులకు మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ, పాలిటెక్నిక్ తదుపరి అందివచ్చే ఉపాధి అవకాశాలను గురించి తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ శిక్షణకు మంచి డిమాండ్ ఉందని, విద్యార్థులు వారి తల్లిదండ్రుల కోరిక మేరకు ఈనెల 8వ తేదీ నుంచి మరో బ్యాచ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆమె చెప్పారు. రాష్ట్రంలోని 87 ప్రభుత్వ, 182 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో ఏప్రిల్ 24 వరకు తరగతులు నిర్వహిస్తామని, ఏప్రిల్ 25వ తేదీన గ్రాండ్ ప్రీ ఫైనల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఉంటుందని నాగరాణి వివరించారు. పొడిగించిన దరఖాస్తు గడువును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు నింపడంలో సహాయం చేసేందుకు అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఉచిత సహాయ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు.

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▲ 20 | 74,248 |
| నిఫ్టీ ▽ 1 | 22,514 |

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 16,299 | ▲ 249 |
| డోజోన్స్ | 38,977 | ▲ 380 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,911 | ▽ 65 |
| డాక్స్ | 18,175 | ▽ 228 |
| షాంఘై (బుధవారం ముగింపు) | 3,069 | ▽ 6 |
| నికాయ్ | 38,992 | ▽ 781 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో – ముంబై

| | |
|---|---|
| బంగారం (24 క్యారెట్) | 68,280 |
| బంగారం (22 క్యారెట్) | 65,030 |
| వెండి (కిలో) | 85,000 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 83.04 | 84.05 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 104.22 | 106.77 |
| € | యూరో | ఒకటి | 89.38 | 91.74 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 54.64 | 55.87 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 53.98 | 55.90 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 59.51 | 64.17 |
| SAR | సౌదీ రియాల్ | ఒకటి | 21.32 | 22.87 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ఒకటి | 21.79 | 23.57 |
| ¥ | చైనా యువాన్ | ఒకటి | 10.39 | 12.47 |

# ఆర్‌బీఐ ఏడోసారీ

## రెపో రేటును తగ్గించని ఆర్‌బీఐ

- 6.50 శాతంగా కొనసాగింపు
- ఆహార ద్రవ్యోల్బణం ఆందోళనకరంగా ఉండటం కారణం
- గృహ, ఆటో ఈఎంఐలు యథాతథం
- వృద్ధి 7%, ద్రవ్యోల్బణం 4.5 శాతంగా అంచనాలు

ముంబై: ఏప్రిల్ నుంచి జూన్ మధ్యలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే ఎక్కువ ఉండొచ్చన్న వాతావరణ శాఖ అంచనాలతో ఆహార ద్రవ్యోల్బణంపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ వరుసగా ఏడోసారీ కీలక వడ్డీ రేట్లలో ఎటువంటి మార్పులు చేయలేదు. రెపో రేటును ప్రస్తుత 6.5 శాతం స్థాయిలోనే కొనసాగించాలని నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర తొలి ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ ఈ మేరకు పాలసీ నిర్ణయం తీసుకుంది. దీంతో గృహ, వాహన రుణాలపై ఈఎంఐలు మరికొన్నాళ్ల పాటు స్థిరంగా ప్రస్తుత స్థాయిలోనే కొనసాగే అవకాశం ఉంది. 2023 ఫిబ్రవరి నుంచి రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును మార్చలేదు. అంటే ఏడు ద్వైమాసిక సమావేశాల నుంచి ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో రేటు యథాతథంగా కొనసాగింది. తాజాగా రెపో రేటును యథాతథంగా ఉంచాలన్న ప్రతిపాదనను మానిటరీ పాలసీ కమిటీలోని (ఎంపీసీ) ఆరుగురు సభ్యుల్లో ఒకరు వ్యతిరేకించగా అయిదుగురు సభ్యులు సానుకూలత వ్యక్తపర్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి 7 శాతం స్థాయిలోనూ (2023–24లో 7.6 శాతం), ద్రవ్యోల్బణం 4.5 శాతం స్థాయిలోను (2023–24లో 5.4 శాతం) ఉంటుందన్న అంచనాలను ఆర్‌బీఐ కొనసాగించింది. ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా, ఆహార ధరల బాస్కెట్ ద్రవ్యోల్బణం 8.66 శాతంగా నమోదైంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉంటుందని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం క్యూ1లో 4.9 శాతం, క్యూ2లో 3.8 శాతం, క్యూ3లో 4.6 శాతం, క్యూ4లో 4.5 శాతం చొప్పున మొత్తం మీద సగటున 4.5 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది. కాగా విదేశాల నుంచి స్వదేశానికి పంపించే డబ్బుకు (రెమిటెన్స్) సంబంధించి భారత్ తొలి స్థానంలో ఉన్నట్లు ఆర్‌బీఐ పేర్కొంది.

- యూపీఐని వినియోగించడం ద్వారా త్వరలో బ్యాంకుల్లో నగదు డిపాజిట్ సౌకర్యం
- ప్రభుత్వ బాండ్లలో రిటైల్ భాగస్వామ్యం సులభతరానికి మొబైల్ యాప్ ప్రారంభం
- ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్‌లో సావరిన్ గ్రీన్ బాండ్ల ట్రేడింగ్‌కు అనుమతి



- సీబీడీసీ వాలెట్‌లను అందించడానికి నాన్–బ్యాంక్ పేమెంట్ సిస్టమ్ ఆపరేటర్లకు అనుమతి
- బ్యాంకింగ్ ద్రవ్య సంబంధ ఇబ్బందులు పడకుండా లిక్విడిటీ కవరేజ్ రేషియో సమీక్ష
- 2023–24లో ఎఫ్‌పీఐల పెట్టుబడులు 41.6 బిలియన్ డాలర్లు. 2014–15 తర్వాత అత్యధికం

- డాలర్ మారకంలో రూపాయి విలువ స్థిర శ్రేణిలో కదలాడుతోంది. ఆందోళన అక్కర్లేదు
- నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు వ్యవస్థాగతంగా ఎటువంటి ఇబ్బందులూ లేవు
- జూన్ 5 నుంచి 7 వరకూ 2024–25 ఆర్‌బీఐ రెండవ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష

### పసిడి నిల్వల పెంపు

విదేశీ మారక ద్రవ్య నిల్వల పటిష్టతలో భాగంగా పసిడి వాటాను భారత్ పెంచుకుంటుందని ఆర్‌బీఐ పేర్కొంది. మార్చి 29వ తేదీ నాటికి భారత్ విదేశీ మారకద్రవ్య నిల్వలు ఆల్ టైమ్ హై 645.6 బిలియన్ డాలర్లకు చేరితే, అందులో పసిడి వాటా 51.487 బిలియన్ డాలర్లుగా ఉంది.

### ఆహార ధరలపై అనిశ్చితి..

ఆహార ధరల్లో నెలకొన్ని అనిశ్చితి రాబోయే రోజుల్లో ద్రవ్యోల్బణం తీరుతెన్నులపై ప్రభావం చూపవచ్చు. ఈ ఏడాది వేసవిలో కూరగాయల ధరల కదలికలపై మనం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఒకవైపు వృద్ధికి ఊతమిస్తూనే మరోవైపు లక్ష్యించుకున్న స్థాయికి (4 శాతం) ద్రవ్యోల్బణం దిగి వస్తే కీలక రేట్లను తగ్గించడంపైనే ఎంపీసీ ప్రధానంగా దృష్టి పెడుతుంది.

– శక్తికాంతదాస్, ఆర్‌బీఐ గవర్నర్

## సాగుపై చల్లని అంచనాలు

తీవ్ర వేసవి, నీటి ఎద్దడి భయాందోళనల నేపథ్యంలో ఆర్‌బీఐ ఎకానమీపై చల్లని అంచనాలను వెలువరించింది. తగిన వర్షపాతం అంచనాల నేపథ్యంలో వ్యవసాయ, గ్రామీణ క్రియాశీలతలో సానుకూలతలు కనిపిస్తున్నాయని పేర్కొంది. ఆశించిన స్థాయిలో సాధారణ రుతుపవనాల అంచనాలు, మంచి రబీ గోధుమ పంట, ఖరీఫ్ పంటల మెరుగైన అవకాశాలు దీనికి కారణంగా పేర్కొంది. బలమైన గ్రామీణ డిమాండ్, ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గడం, తయారీ– సేవల రంగంలో స్థిరమైన పురోగతి ప్రైవేట్ వినియోగాన్ని పెంచడానికి దోహదపడే అంశాలుగా పేర్కొంది. అయితే దీర్ఘకాలిక భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య మార్గాలలో పెరుగుతున్న అంతరాయాలు దేశ ఎకానమీకి ఆందోళన కలిగిస్తున్న అంశాలుగా పేర్కొంది.



## మార్కెట్ ఫ్లాట్

### ఆర్‌బీఐ పాలసీపై స్పందన కరువు



ముంబై: ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను ఏడోసారి యథాతథంగా కొనసాగించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 20 పాయింట్లు పెరిగి కొత్త రికార్డు స్థాయి 74,248 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఒక పాయింటు నష్టంతో 22,514 వద్ద నిలిచింది. ఉదయం సూచీలు ఫ్లాటుగా మొదలయ్యాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల ప్రభావంతో ట్రేడింగ్ ప్రారంభంలోనే నష్టాల్లోకి మళ్లాయి. సెన్సెక్స్ 286 పాయింట్లు క్షీణించి 73,947 వద్ద, నిఫ్టీ 86 పాయింట్లు కోల్పోయి 22,428 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. అయితే ఆర్‌బీఐ ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలు వెల్లడి తర్వాత బ్యాంకులు, ఫైనాన్స్, రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో సూచీలు ఆరంభ నష్టాలు భర్తీ చేసుకొని స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. మరోవైపు టెక్, ఐటీ, క్యాపిటల్ గూడ్స్, ఆటో, ఆయిల్అండ్ గ్యాస్, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,659 కోట్ల విలువ షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.3,370 కోట్ల విలువ షేర్లు అమ్మారు.

### బిగ్ 'సి' ఉగాది ప్రత్యేక ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్స్ విక్రయ సంస్థ బిగ్ 'సి' ఉగాది సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఏసీల కొనుగోలుపై 7.50% వరకు తక్షణ తగ్గింపు అందిస్తుంది. ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండా సులభ వాయిదాల పద్ధతిలో వీటిని కొనుగోలు చేయవచ్చు. మొబైల్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతితో పాటు సంవత్సరం పూర్తిగా, రెండో ఏటా రూ.8వేల వరకు 'మొబైల్ ప్రొటెక్షన్' అదనంగా పొందవచ్చు. బ్రాండెడ్ ఉపకరణాలపై 51% వరకు తగ్గింపు పొందవచ్చు. ప్రజలంతా ఉగాది ప్రత్యేక ఆఫర్లను వినియోగించుకోవాలని సంస్థ సీఎండీ బాలు చౌదరి కోరారు.




## రామ్‌కీ ఇన్‌ఫ్రాకు విశ్వకర్మ పురస్కారాలు..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ దిగ్గజం రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు 15వ సీఐడీసీ విశ్వకర్మ అవార్డుల కార్యక్రమంలో వివిధ విభాగాల్లో పురస్కారాలు లభించాయి. ఉత్తమ నిర్మాణ ప్రాజెక్టులు, సామాజిక అభివృద్ధి..ప్రభావం, ప్రొఫెషనల్‌గా అత్యుత్తమంగా నడుస్తున్న సంస్థ తదితర విభాగాల్లో ఈ అవార్డులు దక్కినట్లు కంపెనీ తెలిపింది. నిర్మాణ రంగంలో తాము పాటించే అత్యుత్తమ ప్రమాణాలకు ఇవి నిదర్శనమని రామ్‌కీ ఇన్‌ఫ్రా ఎండీ వై.ఆర్. నాగరాజ తెలిపారు. ప్లానింగ్ కమిషన్ (ప్రస్తుతం నీతి ఆయోగ్), భారతీయ నిర్మాణ పరిశ్రమ కలిసి ఏర్పాటు చేసిన కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీఐడీసీ) ఈ పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించింది.



**కోడిగుడ్లు** (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

| 6-4-2024 ఫామ్ ధర... | |
|---|---|
| విశాఖ | 415–00 |
| చిత్తూరు | 458–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 403–00 |
| విజయవాడ | 403–00 |
| రిటైల్ ధర (డజను) | 60.00 |
| హైదరాబాద్ | 375–00 |
| వరంగల్ | 377–00 |
| రిటైల్ ధర | 4.35 |

## యాపిల్‌లో 600 మంది ఉద్యోగులకు ఉద్వాసన



వాషింగ్టన్: టెక్ దిగ్గజం యాపిల్ 600 మందికి పైగా ఉద్యోగులను తొలగించింది. మే 27 నుంచి తొలగింపు వర్తిస్తుందంటూ మార్చి 28న 614 మంది వర్కర్లకు పంపిన లేఖలో యాపిల్ పేర్కొంది. ఈ ఉద్యోగులంతా శాంటా క్లారాలోని ఎనిమిది కార్యాలయాల్లో పని చేస్తున్నారు. కోవిడ్–19 తర్వాత యాపిల్ ఇంత భారీ స్థాయిలో ఉద్వాసనలకు తెర తీయడం ఇదే ప్రథమం. కోవిడ్ సమయంలో భారీగా రిక్రూట్‌మెంట్ చేపట్టిన చాలా మటుకు టెక్ కంపెనీలు గత రెండేళ్లుగా పెద్ద యెత్తున ఉద్యోగులను తొలగిస్తూ వస్తున్నాయి.

## బంధన్ బ్యాంక్‌కు సీఈవో గుడ్‌బై



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ సంస్థ బంధన్ బ్యాంక్ వ్యవస్థాపకుడు, సీఈవో సీఎస్ ఘోష్ బాధ్యతల నుంచి వైదొలగనున్నారు. ప్రస్తుత సర్వీసు 2024 జూలై9తో ముగియనుండటంతో పదవీవిరమణ చేయనున్నట్లు బ్యాంక్ తెలిపింది. వరుసగా మూడుసార్లు ఎండీ, సీఈవోగా దాదాపు దశాబ్ద కాలం బ్యాంకుకు నాయకత్వం వహించిన తాను బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు బోర్డుకు రాసిన లేఖలో ఘోష్ పేర్కొన్నారు.



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో ఐదుగురు భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, వైశాలి, ప్రజ్ఞానంద, గుకేశ్, విదిత్ తమ తొలి రౌండ్ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. మహిళల విభాగంలో తమిళనాడు అమ్మాయి వైశాలితో జరిగిన తొలి గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ స్టార్ హంపి 41

## హంపి తొలి గేమ్ 'డ్రా'

ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ఓపెన్ విభాగంలో అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 39 ఎత్తుల్లో... విదిత్‌తో జరిగిన గేమ్‌ను గుకేశ్ 21 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నారు. ఓపెన్ విభాగంలో ఎనిమిది మంది మధ్య... మహిళల విభాగంలో ఎనిమిది మంది మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో ఈ టోర్నీ జరుగుతోంది. రెండు విభాగాల విజేతలు ప్రస్తుత ప్రపంచ చాంపియన్స్‌తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.



# రైజర్స్... విన్నర్స్


అభిషేక్ శర్మ

ఉప్పల్ మైదానంలో ఒక్కసారిగా ఎంత మార్పు! గత మ్యాచ్‌లో రెండు జట్లు పోటీ పడి పరుగుల వరద పారించడంతో 38 సిక్సర్లతో ఏకంగా 523 పరుగులు నమోదయ్యాయి. కానీ ఇప్పుడు చెన్నై ఒక్కో పరుగు కోసం శ్రమించింది. అసలు మెరుపులు, భారీ షాట్లే లేకుండా సాధారణ స్కోరుకే పరిమితమైంది. గత మ్యాచ్‌లో ఆడింది కాకుండా మరో పిచ్‌పై ఈ మ్యాచ్ జరిగినా... పిచ్‌కంటే కూడా సన్‌రైజర్స్ బౌలర్లు ప్రభావం చూపించి ప్రత్యర్థిని కట్టిపడేశారు. నియంత్రణతో కూడిన తమ చక్కటి బౌలింగ్‌తో సన్‌రైజర్స్ ఒకప్పటి తమ బలాన్ని మళ్లీ గుర్తుకు తెచ్చింది. అనంతరం లక్ష్యాన్ని ఛేదించడంలో హైదరాబాద్‌కు ఇబ్బందీ ఎదురు కాలేదు. అభిషేక్ శర్మ బలమైన పునాది వేశాక మార్క్‌రమ్ బ్యాటింగ్ జట్టును విజయం దిశగా నడిపించింది.

### సొంతగడ్డపై హైదరాబాద్‌కు మరో విజయం

- 6 వికెట్లతో చెన్నై పరాజయం
- సన్‌రైజర్స్ బౌలర్ల సమష్టి ప్రదర్శన
- రాణించిన అభిషేక్ శర్మ, మార్క్‌రమ్

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా తమ రెండో మ్యాచ్‌లోనూ విజయాన్ని నమోదు చేసింది. తొలి పోరులో మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను శాసించిన జట్టు... ఇప్పుడు బౌలింగ్ బలంతో తమ ఖాతాలో మరో గెలుపును వేసుకుంది. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రైజర్స్ 6 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. శివమ్ దూబే (24 బంతుల్లో 45; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా... అజింక్య రహానే (30 బంతుల్లో 35; 2 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (23 బంతుల్లో 31 నాటౌట్; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. అనంతరం హైదరాబాద్ 18.1 ఓవర్లలో 4 వికెట్లకు 166 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (12 బంతుల్లో 37; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), మార్క్‌రమ్ (36 బంతుల్లో 50; 4 ఫోర్లు, 1 సిక్స్), హెడ్ (24 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబసభ్యులతో హాజరై మ్యాచ్ మొత్తాన్ని తిలకించారు. మ్యాచ్ ముగిశాక అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డును ఆయన అందజేశారు.


**రాణించిన దూబే...**

ఒక్క దూబే క్రీజ్‌లో ఉన్నంత సేపు మినహా మిగిలిన చెన్నై ఇన్నింగ్స్ మొత్తం పేలవంగా సాగింది. సన్‌రైజర్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌లో పరుగులు సాధించడంలో చెన్నై బ్యాటర్లు విఫలమయ్యారు. ఓపెనర్ రచిన్ రవీంద్ర (12) విఫలం కాగా... రుతురాజ్ గైక్వాడ్ (21 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడలేకపోయాడు. పవర్‌ప్లేలో జట్టు 48 పరుగులు చేసింది. ఈ దశలో దూబే ధాటిని చూపించాడు. షహబాజ్, మర్కండే బౌలింగ్‌లలో ఒక్కో సిక్స్ బాదిన అతను నటరాజన్ ఓవర్లో 2 సిక్స్‌లు కొట్టాడు. దూబే, రహానే 8 పరుగుల వ్యవధిలో వెనుదిరిగాక స్కోరు వేగం మరింత తగ్గిపోయింది.

**అలవోకగా...**

ఓపెనర్ అభిషేక్ మెరుపు బ్యాటింగ్‌తో రైజర్స్‌కు ఘనారంభం అందించాడు. అతను చెలరేగుతుంటే హెడ్ ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యాడు. ముకేశ్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్లో అభిషేక్ 3 సిక్స్‌లు, 2 ఫోర్‌లు బాదడంతో మొత్తం 27 పరుగులు వచ్చాయి. చహర్ ఓవర్లోనూ వరుసగా 6, 4 కొట్టిన అతను తర్వాతి బంతికి వెనుదిరిగాడు. అనంతరం హెడ్, మార్క్‌రమ్ కలిసి కొన్ని చక్కటి షాట్లతో వేగాన్ని కొనసాగించారు. 6 ఓవర్లు ముగిసే సరికి స్కోరు 78 పరుగులకు చేరింది. హెడ్‌ను తీక్షణ వెనక్కి పంపించగా... 35 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న వెంటనే మార్క్‌రమ్ పెవిలియన్ చేరాడు. ఈ దశలో 36 బంతుల్లో 34 పరుగులే చేయాల్సి ఉండటంతో హైదరాబాద్ అలవోకగా లక్ష్యం చేరింది. ఆంధ్ర ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి (14 నాటౌట్) మరో 11 బంతులు మిగిలి ఉండగానే సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించాడు.


మార్క్‌రమ్


నితీశ్ కుమార్ రెడ్డి

### స్కోరు వివరాలు

**చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్:** రచిన్ (సి) మార్క్‌రమ్ (బి) భువనేశ్వర్ 12; రుతురాజ్ (సి) సమద్ (బి) షహబాజ్ 26; రహానే (సి) మార్కండే (బి) ఉనాద్కట్ 35; దూబే (సి) భువనేశ్వర్ (బి) కమిన్స్ 45; జడేజా (నాటౌట్) 31; మిచెల్ (సి) సమద్ (బి) నటరాజన్ 13; ధోని (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 165. వికెట్ల పతనం:** 1-25, 2-54, 3-119, 4-127, 5-160. **బౌలింగ్:** అభిషేక్ 1-0-7-0, భువనేశ్వర్ 4-0-28-1, నటరాజన్ 4-0-39-1, కమిన్స్ 4-0-29-1, మయాంక్ మార్కండే 2-0-21-0, షహబాజ్ అహ్మద్ 1-0-11-1, జైదేవ్ ఉనాద్కట్ 4-0-29-1.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్:** హెడ్ (సి) రచిన్ (బి) తీక్షణ 31; అభిషేక్ (సి) జడేజా (బి) చహర్ 37; మార్క్‌రమ్ (ఎల్బీ) (బి) అలీ 50; షహబాజ్ (ఎల్బీ) (బి) అలీ 18; క్లాసెన్ (నాటౌట్) 10; నితీశ్ కుమార్ రెడ్డి (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (18.1 ఓవర్లలో 4 వికెట్లకు) 166. వికెట్ల పతనం:** 1-46, 2-106, 3-132, 4-141. **బౌలింగ్:** దీపక్ చహర్ 3.1-0- 32-1, ముకేశ్ చౌదరి 1-0-27-0, తీక్షణ 4-0-27-1, తుషార్ 2-0-20-0, రవీంద్ర జడేజా 4-0-30-0, మొయిన్ అలీ 3-0-23-2, రచిన్ రవీంద్ర 1-0-3-0.

### ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ × బెంగళూరు
వేదిక: జైపూర్
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

### ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర.రే |
|---|---|---|---|---|---|
| కోల్‌కతా | 3 | 3 | 0 | 6 | 2.518 |
| రాజస్తాన్ | 3 | 3 | 0 | 6 | 1.249 |
| చెన్నై | 4 | 2 | 2 | 4 | 0.517 |
| లక్నో | 3 | 2 | 1 | 4 | 0.483 |
| హైదరాబాద్ | 4 | 2 | 2 | 4 | 0.409 |
| పంజాబ్ | 4 | 2 | 2 | 4 | -0.220 |
| గుజరాత్ | 4 | 2 | 2 | 4 | -0.580 |
| బెంగళూరు | 4 | 1 | 3 | 2 | -0.876 |
| ఢిల్లీ | 4 | 1 | 3 | 2 | -1.347 |
| ముంబై | 3 | 0 | 3 | 0 | -1.423 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

## టైటిల్ పోరుకు తరుణ్



అస్తానా: కజకిస్తాన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నెపల్లి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో ప్రపంచ 190వ ర్యాంకర్ తరుణ్ 21–8, 21–7తో ప్రపంచ 78వ ర్యాంకర్ లె డక్ ఫాట్ (వియత్నాం)పై సంచలన విజయం సాధించాడు. నేడు జరిగే ఫైనల్లో ప్రపంచ 76వ ర్యాంకర్ సూంగ్ జూ వెన్ (మలేసియా)తో తరుణ్ తలపడతాడు. క్వార్టర్ ఫైనల్లో తరుణ్ 22–20, 21–14తో దిమిత్రీ పనారిన్ (కజకిస్తాన్)ను ఓడించాడు. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో రుత్విక శివాని–రోహన్ కపూర్ (భారత్) జోడీ 15–21, 15–21తో వోంగ్ తియెన్ సి–లిమ్ చియెవ్ సియెన్ (మలేసియా) జంట చేతిలో ఓడిపోగా... సెమీఫైనల్లో మనీషా–సంజయ్ (భారత్) ద్వయం 21–16, 10–21, 21–14తో కొసియెలా–తనీనా (అల్జీరియా) జోడీపై గెలిచి ఫైనల్ చేరింది. మహిళల సింగిల్స్ విభాగంలో భారత్‌కు టైటిల్ ఖరారైంది. ఫైనల్ పోరు ఇద్దరు భారత క్రీడాకారిణులు అనుపమా ఉపాధ్యాయ, ఇషారాణి బారువా మధ్య జరగనుంది.

## ఫైనల్లో సౌత్‌జోన్

### రాణించిన దుర్గా, తమన్నా


దుర్గా

పుణే: జాతీయ సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీలో సౌత్‌జోన్, ఈస్ట్‌జోన్ జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. సౌత్‌జోన్, వెస్ట్ జోన్ జట్ల మధ్య జరిగిన మూడు రోజుల తొలి సెమీఫైనల్ 'డ్రా'గా ముగిసింది. అయితే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన కారణంగా సౌత్‌జోన్ జట్టుకు ఫైనల్ బెర్త్ ఖరారైంది. ఓవర్‌నైట్ స్కోరు 58/2తో చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్‌జోన్ 101 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 262 పరుగుల వద్ద డిక్లేర్ చేసి 322 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి, వికెట్ కీపర్ మిరియాల దుర్గ (205 బంతుల్లో 81; 10 ఫోర్లు) అర్ధ సెంచరీ చేయగా... తమన్నా నిగమ్ (200 బంతుల్లో 99; 16 ఫోర్లు) ఒక్క పరుగు తేడాతో సెంచరీని చేజార్చుకుంది. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో వెస్ట్‌జోన్ రెండో ఇన్నింగ్స్ ఆడలేదు. నార్త్‌జోన్‌తో జరిగిన రెండో సెమీఫైనల్లో ఈస్ట్‌జోన్ 135 పరుగుల తేడాతో గెలిచింది.

# మూడు బంతులు చాలు..
# ముచ్చట తీర్చేందుకు...

**ఉప్పల్ స్టేడియం ధోని మయం ● ఆరేళ్ల తర్వాత హైదరాబాద్‌లో ఆడిన ఎమ్మెస్**



సాక్షి, హైదరాబాద్‌: ఒక్కో వికెట్‌ పడుతోంది... ఇప్పుడు వస్తాడా...ఇప్పుడైనా వస్తాడా...ఇంకెప్పుడు వస్తాడు...ఎట్టకేలకు 19.3 ఓవర్ల తర్వాత వచ్చాడు. చెన్నై ఇన్నింగ్స్‌లో ఐదో వికెట్‌ పడిన తర్వాత మహేంద్ర సింగ్‌ (ఎమ్మెస్‌) ధోని క్రీజ్‌లోకి వచ్చాడు. అంతే...ఉప్పల్‌ స్టేడియం ఒక్కసారిగా ఊగిపోయింది. అప్పటి వరకు ఆట సాగినంత సేపు మైదానంలో పరిస్థితి వేరు. కానీ ఆ సమయంలో డెసిబుల్స్‌ లెవల్స్‌ లెక్క తీస్తే అది రికార్డు స్థాయికి చేరిపోయే ఉంటుంది. అంతసేపు అందరి జేబుల్లో భద్రంగా ఉన్న సెల్‌ ఫోన్లు బయటకు వచ్చేశాయి. ఫోన్‌ లైట్‌లు ఆన్‌ అయిపోయాయి. కాస్త స్తబ్దతగా కనిపించిన చోటనే ఎక్కడలేని ఉత్సాహం వచ్చేసింది. ఈ క్షణాలను బంధించి నేనూ ఆ సమయంలో గ్రౌండ్‌లో ఉన్నానోచ్‌ అనిపించుకోవాలనే తపన వారిలో కనిపించింది. నిజానికి గత మ్యాచ్‌లో 8వ స్థానంలో అతను బ్యాటింగ్‌కు వచ్చాడు. అలా చూస్తే ఈసారి సందేహమే! మొయిన్‌ అలీని ముందుకు పంపుతాడేమో అనిపించింది. కానీ ఏడో స్థానంలో బరిలోకి దిగాడు. ఇన్నింగ్స్‌లో 3 బంతులే మిగిలాయి. గత మ్యాచ్‌ తరహాలో ఏమైనా మాయ చేస్తాడేమో అనుకున్నారు. అలాంటిదేమీ జరగలేదు. తొలి బంతికి పరుగు తీయలేదు. రెండో బంతికి సింగిల్‌తో నాన్‌ స్ట్రయికింగ్‌ ఎండ్‌కు చేరిపోయాడు. అంతే! హైదరాబాద్‌లో ధోని బ్యాటింగ్‌ ముగిసింది. కానీ బాధ లేదు... ఎందుకంటే అతని విషయంలో ఎన్ని బంతులు ఆడాడన్నది లెక్క కాదు. ధోని క్రీజ్‌లోకి వస్తే మొత్తం ఐపీఎల్‌ మ్యాచ్‌ చూసిన సంతృప్తి.

**ఇంత ఆసక్తి ఎందుకంటే...**

ధోని గురించి ఇంతగా ఆసక్తి చూపించడం, అభిమానులు ఎంతో ఆశించడంలో తప్పు లేదు. ఎందుకంటే ఉప్పల్‌ మైదానంలో అతని ఆట చూసి ఆరేళ్లు గడిచిపోయాయి. నిజం...ధోని ఈ స్టేడియంలో ఆఖరిసారిగా 2018 ఏప్రిల్‌ 22న ఐపీఎల్‌ మ్యాచ్‌ ఆడాడు. 2019 సీజన్‌లో టీమ్‌ ఆడినా... ఆఖరి నిమిషంలో వెన్నునొప్పితో మ్యాచ్‌ నుంచి తప్పుకోవడంతో సురేశ్‌ రైనా కెప్టెన్‌గా బరిలోకి దిగాడు. తర్వాతి 2020, 2021, 2022 సీజన్లు కోవిడ్‌ కారణంగా యూఏఈతో పాటు భారత్‌లో కొన్ని వేదికలకే పరిమితమైంది. 2023 షెడ్యూల్‌ ప్రకారం చెన్నై సూపర్‌ కింగ్స్‌ హైదరాబాద్‌లో మ్యాచ్‌ ఆడనే లేదు. అందుకే ఈ మ్యాచ్‌ గురించి అంతటి ఆసక్తి, ఆకర్షణ. టికెట్లు అమ్మకానికి ఉంచిన క్షణం మొదలు అంతా ధోనినామ జపమే!



మ్యాచ్‌ను తిలకిస్తున్న ధోని భార్య సాక్షి, కూతురు జివా



ధోనిని సన్మానించిన హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యులు




## ఫుల్‌ డిమాండ్‌....

ముంబై ఇండియన్స్‌–సన్‌రైజర్స్‌ హైదరాబాద్‌ మధ్య ఇక్కడ జరిగిన గత మ్యాచ్‌తో పోలిస్తే చెన్నైతో పోరుకు చాలా పెద్ద మొత్తంలో డిమాండ్‌ కనిపించింది. పైరవీలు, బ్లాక్‌ టికెట్లు అంతా అతని కోసమే సాగాయి. వాస్తవంగా కూడా ఈ టీమ్‌లో మరో ఆకర్షణీయమైన ప్లేయర్‌ ఎవరూ లేరు. మ్యాచ్‌ ముందు రోజు అతను గాయంతో ఉన్నాడని, ఆడకపోవచ్చని వినిపించింది. దాంతో మైదానంలోకి వెళుతున్న ఫ్యాన్స్‌లో కొంత నిరాశ. కానీ అదృష్టవశాత్తూ అలా జరగలేదు. గ్రౌండ్‌లో పరిస్థితి చూస్తే మ్యాచ్‌ చెన్నైలో జరుగుతోందా అనిపించింది. అంతటా 7 నంబర్‌ ఎల్లో జెర్సీలతో పసుపు మయమైపోయింది. బయట అమ్మే చోట కూడా అది తప్ప మరో జెర్సీ కనిపించలేదు. 80 శాతం ధోని ఫ్యాన్స్‌ ఉండగా... మరో 20 శాతం సన్‌రైజర్స్‌ అభిమానులు ఉన్నారేమో. ఇదే అతని ఆఖరి సీజన్‌గా భావిస్తున్న నేపథ్యంలో మన ఫ్యాన్స్‌కు మళ్లీ అతని ఆటను ప్రత్యక్షంగా చూసే అవకాశం దక్కకపోవచ్చు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి తన కుటుంబసభ్యులతో వచ్చి మ్యాచ్‌ను తిలకించడం విశేషం. మ్యాచ్‌కు ముందు హైదరాబాద్‌ క్రికెట్‌ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌ రావు, మిగతా కార్యవర్గ సభ్యులు ధోనిని శాలువాతో సన్మానించి చార్మినార్‌ ప్రతిమను జ్ఞాపికగా అందజేశారు.

● ఈ ఐపీఎల్‌లో కొత్త కెప్టెన్‌తో సీజన్‌ను ఆరంభించిన ముంబై ఇండియన్స్‌ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. గాయం నుంచి కోలుకోకపోవడంతో స్టార్‌ బ్యాటర్‌ సూర్యకుమార్‌ యాదవ్‌ ఈ మూడు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగలేదు. ప్రస్తుతం సూర్య పూర్తి ఫిట్‌నెస్‌ సాధించాడు. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే మ్యాచ్‌లో అతను బరిలోకి దిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. సూర్య రాకతో ముంబై గెలుపు బోణీపై ఆశలు పెట్టుకుంది.










Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# సాక్షి

## విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా


శనివారం ၊ 6 ၊ ఏప్రిల్ ၊ 2024

I




### 'పది' స్పాట్ పరిశీలన

చిలకలపూడి: బందరులోని పదో తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రాలను సమగ్రశిక్ష అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా పరిశీలకులు కె. శ్రీనివాసులురెడ్డి శుక్రవారం పరిశీలించారు.



### స్తంభోద్భవంలో నృసింహస్వామి

మంగళగిరి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి స్తంభోద్భవం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

### జాతరకు వేళాయె



కోడూరు: స్థానిక గంగా భవానీ అమ్మవారి ప్రధాన జాతరోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు కోడూరు పోలీసులు అమ్మవారికి పూజలు చేసి గ్రామోత్సవాన్ని ప్రారంభించనున్నారు.




## న్యూస్‌రీల్

### సమతావాది జగ్జీవన్‌రామ్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం దేశ మాజీ ఉప ప్రధాని, సమతావాది బాబూ జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు.. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు తదితరులతో కలిసి జగ్జీవన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. బాబూజీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకొని యువత ముందుకు సాగాలని.. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలో 94.19 శాతం పింఛన్ పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక 94.19 శాతం పంపిణీ జరిగింది. జిల్లాలో మొత్తం 2,37,365 మంది పెన్షనర్లకు గాను 2,23,570 మంది పెన్షన్ అందుకున్నారు. జిల్లాలో అత్యధికంగా నందిగామ అర్బన్‌లో 97.23 శాతం, తిరువూరు అర్బన్‌లో 97.03 శాతం, విజయవాడ అర్బన్‌లో 96శాతం, కొండపల్లి అర్బన్‌లో 95.98 శాతం, జి. కొండూరు మండలంలో 95.28 శాతం పంపిణీ పూర్తయింది.

### కార్తికేయునికి స్వర్ణ యజ్ఞోపవీతాలు సమర్పణ



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న మోపిదేవిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సాయి వెంకయ్య శిష్యబృందం మూడు పేటల బంగారపు ఉత్తర జంధ్యముల (యజ్ఞోపవీతాలు) లాకెట్ సమర్పించారు. శుక్రవారం ఉదయం స్వామివార్లను దర్శించుకున్న అనంతరం 83 గ్రాములతో తయారు చేయించిన సుమారు రూ.5,50,000 విలువగల యజ్ఞోపవీతాలను ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధర రావుకు అందజేశారు. ఆలయ వేద పండితులు నౌడూరి సుబ్రహ్మణ్యశర్మ, ఆలయ అధికారి వెంకటాద్రి, శిష్యబృందం సభ్యులు పాల్గొన్నారు. అనంతరం బృందం సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

### 12, 13 తేదీల్లో విజయవాడకు 'బస్సుయాత్ర'



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 12, 13 తేదీలలో విజయవాడ నగరానికి రానున్నారని, 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు ఎన్టీఆర్ జిల్లా మొత్తం సిద్ధంగా ఉందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను జిల్లా నాయకులతో కలిసి సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 కానీ 13 తేదీన కానీ జగనన్న బస్సు యాత్ర నగరానికి చేరుకుంటుందన్నారు. జిల్లాలోని ప్రధాన కూడళ్ల మీదుగా ఈ యాత్ర సాగడంతో పాటు భారీ బహిరంగ సభ కూడా ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీలు ఎండీ రుహుల్లా, మొండితోక అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అదుపులో లేకుంటే అనర్థమే!

### చాపకింద నీరులా విస్తరిస్తున్న మధుమేహం

- విపరీతంగా పెరుగుతున్న దుష్ఫలితాలు
- సుగర్ ఉన్న 10 శాతం మందిలో దృష్టి లోపాలు
- ఆందోళనకరంగా కిడ్నీ సమస్యలు
- సైలెంట్ హార్ట్ అటాక్‌కు దారితీస్తున్న వైనం
- కరోనా తర్వాత మరింత పెరిగిన వ్యాధిగ్రస్తులు

మధుమేహం సైలెంట్ కిల్లర్. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా అమాంతం ప్రాణాన్ని హరించేస్తుంది. పైకి కనపడదు గానీ లోలోపల ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తుంది. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ, మందులు వాడుతూ అదుపులో ఉంచుకోకపోతే అనర్థాలు సృష్టిస్తుంది. అంతటి ప్రమాదకారిని కూడా జిల్లా వాసులు లైట్ తీసుకుంటున్నారు. దీంతో విపరీతంగా దుష్ఫలితాలు వస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కంటి దగ్గర నుంచి కిడ్నీల వరకూ దీని ప్రభావానికి గురవుతున్నట్లు వివరిస్తున్నారు.


లబ్బీపేట(విజయవాడతూర్పు): మనం పాటించే నియమాలు, తీసుకునే ఆహారం, సక్రమమైన మందుల వాడకంతోనే మధుమేహాన్ని అదుపులో ఉంచుకోగలం. కానీ మధుమేహుల్లో 75 శాతం మందిలో నియమాలు పాటించక పోవడం, మందులు సక్రమంగా వాడక పోవడంతో దుష్ఫలితాలు పెరుగుతున్నాయి. కంటి రెటీనా దెబ్బతినడం, కిడ్నీలు ఫెయిల్యూర్, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, ఇతర మధుమేహ దుష్ఫలితాలతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. గుండె జబ్బుల రోగుల్లో 40 శాతం, కిడ్నీ రోగుల్లో 60 శాతం మధుమేహులే ఉంటున్నారు. కంటి రెటీనా దెబ్బతిని చూపు తగ్గిన వారు సైతం పది నుంచి 20 మంది కంటి ఓపీకి వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

**పెరుగుతున్న రెటీనా సమస్యలు..**

మధుమేహంతో కంటి రెటీనా సమస్యలు పెరుగుతున్నాయి. ఇటీవల నేత్ర వైద్యుల వద్దకు రెటీనా సమస్యతో వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నట్లు వైద్యులు అంటున్నారు. మధుమేహుల్లో కంటి నరం (రెటీనా) చచ్చుబడి పోవడంతో పూర్తిగా దృష్టి కోల్పోవడం జరుగుతుంది. నగరంలోని నేత్ర వైద్యులు నెలకు 100 నుంచి 150 మంది వరకూ రెటీనా సమస్యలతో బాధపడుతున్న వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. శాశ్వత అంధులుగా మారక ముందే గుర్తించడం ఎంతో మేలు.

**క్షయ ముప్పు..**

ఒకప్పుడు హెచ్ఐవీ సోకిన వారికి క్షయ వ్యాధి ఎక్కువగా సోకేది. కానీ ప్రస్తుతం మధుమేహుల్లో క్షయ ముప్పు ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ కేంద్రంలో పది మందికి




క్షయ వ్యాధి ఉన్నట్లు నిర్ధారిస్తే, వారిలో ముగ్గురు, నలుగురు మధుమేహులు ఉంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. మధుమేహుల్లో సైతం వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటంతో క్షయ వ్యాధి సోకుతున్నట్లు వైద్యులు స్పష్టం చేస్తున్నారు. రానున్న రోజుల్లో మధుమేహుల్లో క్షయ వ్యాధి పెనుముప్పుగా మారనుందనేది నిపుణుల అంచనా.

**కిడ్నీలు ఫెయిల్యూర్స్..**

మధుమేహుల్లో కిడ్నీ సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. శరీరంలో చక్కెర స్థాయిలు అదుపులో లేని వారిలో వ్యాధి సోకిన ఐదేళ్ల నుంచి పదేళ్లలోపు కిడ్నీ సమస్యలు వస్తున్నాయి. ఒక్కసారి కిడ్నీలు పాడైతే, తిరిగి యథాస్థితికి వచ్చే అవకాశం ఉండదు. రోజుకు 150 నుంచి 200 మందికిపైగా నగరంలోని ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకుంటున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వారిలో 70 శాతం మంది మధుమేహులే ఉంటున్నారు.

**సైలెంట్ హార్ట్ అటాక్..**

మధుమేహుల్లో రక్తనాళాలు బిరుసుగా మారడంతో గుండెపోటు వచ్చిన విషయం కూడా తెలియని పరిస్థితి నెలకొంటుంది. దీంతో ఒక్కో సమయంలో ప్రాణాలు కోల్పోతున్నారు. నగరంలోని కార్డియాలజిస్టుల వద్దకు వస్తున్న వారిలో 40 శాతం మంది మధుమేహులే ఉంటున్నారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన వారికి ఎకో చేస్తుంటే అప్పటికే గుండెపోటు వచ్చినట్లు పలువురికి నిర్ధారిస్తున్నారు. ఇలా మధుమేహుల్లో గుండె సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయి.

### డయాబెటిస్ హబ్‌గా..

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు డయాబెటిస్ హబ్‌గా మారిపోతున్నాయి. ఆయా జిల్లాల్లో రోజు రోజుకు మధుమేహులు పెరిగిపోవడంతో పాటు, దాని కారణంగా వచ్చే ఇబ్బందులు సైతం పెరిగిపోతున్నాయి. ఒకప్పుడు 60 ఏళ్ల తర్వాత మధుమేహ ప్రభావాలు ఉండేవి. కానీ నేడు 40 ఏళ్లకే కిడ్నీలు పాడవడం, పాదాలకు రక్తప్రసరణ తగ్గడం, సైలెంట్ హార్ట్ అటాక్ వంటి వాటికి దారితీస్తున్నాయి. మధుమేహం ఉన్న వారిలో 50 శాతం మందికి తమకు వ్యాధి ఉన్నట్లు గుర్తించడం లేదు. ఏదొక అనారోగ్య సమస్యతో ఆస్పత్రికి వెళితే కానీ బయట పడటం లేదు. ఉన్నట్లు గుర్తించిన వారిలో కూడా 50 శాతం మందే మందులు సక్రమంగా వాడుతూ చక్కెర స్థాయిలు అదుపులో ఉంచుకోగలుగుతున్నారు.




### అదుపులో ఉంచుకోవాలి



మధుమేహం అదుపులో లేక పోవడం కారణంగా వచ్చే దుష్ఫలితాలతో చికిత్సకోసం రోగులు వస్తున్నారు. న్యూరాలజీ ఓపీకి వచ్చే వారిలో 20 శాతం మంది వారే ఉంటున్నారు. వారిలో బ్రెయిన్‌స్ట్రోక్, న్యూరోపతి సమస్యలతో పాటు, మూమెంట్ డిజార్డర్ (సుగర్ లెవల్స్ 300 నుంచి 500 మధ్య ఉన్నప్పుడు కాళ్లు చేతులు కొట్టుకుంటూ ఉండటం), కోమాలోకి వెళ్లిన వారు వస్తున్నారు. మధుమేహ దుష్ఫలితాలతో వచ్చిన వారిని ఐసీయూలో అడ్మిట్ చేసి, ఇన్సులిన్ ఇంజక్షన్స్ ఇచ్చి సుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేస్తున్నాం. మధుమేహులు చెడు ప్రభావం చూపిన తర్వాత చికిత్స పొందడం కంటే, ముందుగానే అదుపు చేసుకోవడం మంచిది.

– డాక్టర్ డి.వెంకటరమణ, న్యూరాలజీ విభాగాధిపతి, ప్రభుత్వాస్పత్రి

### అందుబాటులో మంచి మందులు



మధుమేహ వ్యాధి ఉన్న వారిలో దుష్ఫలితాలు రాకుండా చూసుకోవడం ఎంతో ముఖ్యం. అందుకు శరీరంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవాలి. వైద్యుని పర్యవేక్షణలో మందులు సక్రమంగా వాడటం, కనీసం ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్యుడిని సంప్రదించడం చేయాలి. చాలా మంది ఒకసారి పరీక్షలు చేయించుకుని ఏళ్ల తరబడి అవే మందులు వాడుతుంటారు. అలా చేస్తే వ్యాధి అదుపులో ఉండదు. మధుమేహ దుష్ఫలితాలను తొలిదశలోనే గుర్తించేందుకు కంటి రెటీనా, పాదాల రక్తప్రసరణ, ఇసీజీ, సీరం క్రియాటిన్ పరీక్షలు చేయించుకోవాలి. ప్రస్తుతం మంచి మందులు అందుబాటులోకి వచ్చాయి.

– డాక్టర్ ఎం.సునీత, మధుమేహ నిపుణులు, విజయవాడ

### కొత్త పెళ్లి జంటలకు దుర్గమ్మ ఆశీస్సులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సుముహూర్తపు వేళ ఒక్కటైన నూతన వధూవరులు అమ్మవారిని దర్శించుకునేందుకు శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున నూతన వధూవరులు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి కనిపించింది. వారికి దేవస్థాన అధికారులు ఉచితంగా అంతరాలయ దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న నూతన వధూవరులు తమ కాపురం పిల్లా పాపలతో సుఖసంతోషాలతో వెల్లివిరిసేలా దీవించమ్మా అంటూ అమ్మవారికి వేడుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం పెళ్లిజంటలకు వేద ఆశీర్వచనం అందజేసి, దేవస్థానం తరఫున పెళ్లికుమార్తెకు రవిక, పెళ్లి కుమారుడికి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. శుక్రవారం ఒక్క రోజే సుమారు రెండు వందల పైబడి నూతన జంటలు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

### డీఐపీఆర్వో వెంకటేశ్వరప్రసాద్ బదిలీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ (డీఐపీఆర్వో) ఎం. వెంకటేశ్వరప్రసాద్‌ను బదిలీ చేశారు. ఈ మేరకు సమాచార పౌరసంబంధాలశాఖ కమిషనర్ టి. విజయకుమార్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనను ఆన్‌డ్యూటీ బేసిస్‌పై కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ స్థానంలో ప్రస్తుతం డివిజనల్ పీఆర్వోగా పనిచేస్తున్న ఎస్. శ్రీనివాసరావును జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారిగా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తించాలని ఆదేశించారు.

# పక్కా ప్రణాళికతో సిద్ధం

**ఎన్నికల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు**



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. ప్రభుత్వ అతిథి గృహంలోని సమాచార పౌర సంబంధాల శాఖ మీడియా సెంటర్‌లో శుక్రవారం జిల్లాలో ఎన్నికల నిర్వహణ సన్నద్ధత, ఎన్నికల ప్రణాళిక తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఢిల్లీరావు మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, మే 13న నిర్వహించే పోలింగ్, జూన్ 4న నిర్వహించే కౌంటింగ్‌కు నిర్దిష్ట ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని, నియమావళిని ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా పర్యవేక్షిస్తూ జిల్లాలో కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ. 6.25 కోట్ల నగదు, మద్యం, గోల్డ్ ఇతర విలువైన వస్తువులతో పాటు 4,300 లీటర్ల లిక్కర్ కూడా సీజ్ చేశామన్నారు.

**తక్షణమే ఫిర్యాదుల పరిష్కారం..**

ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై 867 ఫిర్యాదులు అందాయని, వాటిలో 837 ఫిర్యాదులు పరిష్కరించామని కలెక్టర్ చెప్పారు. సీ విజిల్ ద్వారా నమోదైన 346 ఫిర్యాదులు వంద నిముషాల వ్యవధిలో పరిష్కరించాల్సి ఉండగా కేవలం 52 నిముషాల లోపే పరిష్కరించామన్నారు. రాజకీయ పార్టీలు డోర్ టు డోర్, ర్యాలీ ప్రచారానికి సకాలంలోనే అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు.

**ప్రచార ఖర్చు పార్టీలదే..**

ఈనెల 17వ తేదీ వరకు అభ్యర్థులు ప్రచారానికి చేసే ఖర్చును పార్టీలకు, నోటిఫికేషన్ వచ్చిన తర్వాత నుంచి ప్రచార ఖర్చును పోటీలో ఉన్న అభ్యర్థులకు నమోదు చేస్తామని కలెక్టర్ వివరించారు. ఈనెల 14వ తేదీ వరకు ఫారం-6కు సంబంధించిన చేర్పులకు అనుమతి ఉందన్నారు. ఓటర్లకు ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్ అందించామన్నారు.

### 840 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు..

జిల్లాలో 840 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామని కలెక్టర్ తెలిపారు. ఆయా పోలింగ్ స్టేషన్ లొకేషన్లలో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, మైక్రో అబ్జర్వర్ల పరిశీలన ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. నామినేషన్ ప్రక్రియలో రిటర్నింగ్ అధికారులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. పీఓలు, ఏపీవోలకు పోలింగ్ నిర్వహణపై ఈ నెల 13, 14 తేదీలలో మొదటి దశ, 29వ తేదీన రెండో దశ శిక్షణ ఇవ్వనున్నామని అన్నారు. పోలింగ్ నిర్వహణకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్స్ అవసరానికి మించి అదనంగా 120 శాతానికి పైగా సిద్ధం చేసుకున్నామన్నారు. ఈనెల 12వ తేదీన ఈవీఎం ర్యాండ్ మైజేషన్ నిర్వహిస్తామన్నారు.

### 29లోగా ఫారం-12డీ సమర్పించాలి

85 సంవత్సరాల వయసు పైబడినవారు, వికలాంగ ఓటర్లు హోం ఓటింగ్ సౌకర్యం కోసం ఫారం-12డీ సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ చెప్పారు. ఫారం-12డీ ఈనెల 29వ తేదీ లోగా సమర్పించాలని సూచించారు.

# నేటి నుంచి సమ్మేటివ్-2 పరీక్షలు

**నిర్వహణకు జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సన్నద్ధం**



కంకిపాడు: సంగ్రహణాత్మక మదింపు-2 (సమ్మేటివ్-2) పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ, జిల్లా పరీక్షల విభాగం సమాయత్తమైంది. ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకూ విద్యనభ్యసించే విద్యార్థులకు ఎస్‌సీఈఆర్‌టీ-ఏపీ రూపొందించిన ప్రశ్నపత్రాలతో సమ్మేటివ్-2 పరీక్ష నిర్వహించేందుకు సన్నాహాలు చేసింది.

**షెడ్యూల్ ఇలా..**

కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఈనెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ, ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకూ విద్యార్థులకు 6వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించనుంది. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకూ విద్యార్థులకు క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ (సీబీఏ) నిర్వహిస్తారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్ష నిర్వహించనున్నారు. క్లాస్‌రూమ్ బేస్డ్‌అసెస్మెంట్‌కు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు ఒక ఓఎంఆర్, 6, 7, 8 తరగతులకు లాంగ్వేజ్ పరీక్షలకు ఒకటి, నాన్ లాంగ్వేజ్‌లకు మరో ఓఎంఆర్‌ను ఇస్తారు. అయితే ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కేవలం ప్రశ్నపత్రం మాత్రమే ఇస్తారు. జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం నుంచి ప్రశ్నపత్రాలను ఓఎంఆర్‌లను ప్రాథమిక పాఠశాలలకు స్కూల్ కాంప్లెక్స్‌లకు, 6 నుంచి 9వ తరగతి వరకూ విద్యార్థులకు ఎంఆర్‌సీ సెంటర్ల నుంచి ప్రశ్న పత్రాలను పంపే ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ప్రశ్న పత్రాలు, ఓఎంఆర్‌లు ఆయా కాంప్లెక్సులు, ఎంఆర్‌సీ సెంటర్లలో భద్రపరిచారు. పరీక్షలు సమర్థంగా నిర్వహించేలా, పరీక్ష రాసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులకు సూచనలు అందించారు. మూల్యాంకనం పూర్తి చేసి 22వ తేదీన తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతిని తెలియజేయాలని, ప్రమోషన్ లిస్టులను ప్రదర్శించాలని విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

# చివరి అంకానికి పవిత్ర రంజాన్

- భక్తిశ్రద్ధలతో చివరి శుక్రవారం ప్రార్థనలు
- నేడు బడిరాత్‌కు ఏర్పాట్లు పూర్తి

సాక్షి, మచిలీపట్నం: పవిత్ర రంజాన్ మాసం చివరి అంకానికి చేరుకుంది. మార్చి 12 నుంచి నెల ప్రారంభమవగా.. మూడు భాగాల ఈ మాసం చివర అష్ర కొనసాగుతోంది. ఇందులో పాప విముక్తి, నరకాగ్ని నుంచి కాపాడమని అల్లాహ్‌ను వేడుకుంటారు. సాధారణ రోజుల్లో చేసే నమాజ్, పుణ్య కార్యాలు, దాన ధర్మాలతో పోల్చితే రంజాన్ మాసంలో చేస్తే 70 రెట్లు అధికంగా పుణ్యం లభిస్తుందని పవిత్ర గ్రంథం ఖురాన్ బోధిస్తోంది.

**నరకాగ్ని నుంచి విముక్తి..**

పేద వాడి ఆకలి, దప్పికలు తెలిపే మాసం రంజాన్. ఇది మూడు దశ (అష్ర )ల్లో పాటిస్తారు. మొదటి 10 ఉపవాసాలను రహమత్‌కే రోజే (దైవ కరుణ ఉపవాసాలు). సృష్టికర్త దయ, అనుగ్రహం పొందేలా ప్రార్థనలు చేస్తారు.

11 నుంచి 20వ మగ్‌ఫిరత్‌కే రోజే (క్షమాపణలు కోరేవి), 21 నుంచి చివరి ఉపవాసాలను జహన్నమ్ సే ఫనా మాంగ్నేకే రోజే (నరకాగ్ని నుంచి కాపాడమని అల్లాను వేడుకునేవి). ప్రస్తుతం పాప, నరకాగ్ని నుంచి విముక్తి కోరే దశ కొనసాగుతోంది.



విజయవాడ లబ్బీపేటలోని మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**జుమ్మతుల్ విదా మసీదులు కిటకిట..**

రంజాన్‌లో శుక్రవారానికి ప్రత్యేకత ఉంది. సాధారణంగా శుక్రవారం అంటే ముస్లింలు చిన్న పండుగలా భావిస్తారు. అలాంటిది రంజాన్‌లో శుక్రవారం అంటే మసీదులు కిక్కిరిసిపోతాయి. శుక్రవారం జుమ్మ తుల్ విదా (చివరి శుక్రవారం) కావడంతో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, విజయవాడ నగరాలతో పాటు ఇతర పట్టణాల్లో పెద్ద ఎత్తున ముస్లిలు మసీదులకు వెళ్లి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



విద్యుత్ లైట్ల అలంకరణలో సుకర్లబాదులోని రజా మసీద్

దీంతో మసీదుల్లో కిటకిటలాడాయి.

**నేడు బడిరాత్..**

రంజాన్ మాసంలోని మరో విశిష్టమైనది బడిరాత్. శనివారం పెద్దరాత్రి సందర్భంగా ఆ రోజు జాగరణ చేస్తే వెయ్యి నెలల పాటు ఆధ్యాత్మికంగా గడిపితే లభించే పుణ్యం కేవలం ఒక బడి రాత్‌లోనే లభిస్తుందని పవిత్ర ఖురాన్ బోధిస్తోంది. ఈ నేపథ్యంలో ముందుగానే మసీద్‌లను శుభ్రం చేసి, విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. రాత్రంతా మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేయిస్తారు.

### బడిరాత్‌కు ఎంతో విశిష్టత..



పవిత్ర రంజాన్ మాసంలో బడిరాత్ (పెద్దరాత్రి)గా చెప్పే లైలతుల్ ఖదర్‌కు ఎంతో విశిష్టత ఉంది. ఇందులో జాగారణ చేసి, నమాజ్, ఖురాన్, దువా వంటి ప్రార్థనలు చేస్తే వెయ్యి నెలల పాటు ఆరాధించిన పుణ్యం లభిస్తుందని ఖురాన్ బోధిస్తోంది. ఆ రోజు పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు మసీదుకు వస్తారు. కమిటీ సభ్యులు, ఇతర పెద్దలు, స్థానికుల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేశాం.

– ఎండీ షా నజీర్, సివిలియన్, రిజర్వుడ్ పోలీస్ రజా మసీద్ కమిటీ అధ్యక్షులు, మచిలీపట్నం

### గూడ్స్ రైలులో మంటలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కృష్ణాకెనాల్ జంక్షన్ పరిధిలో విజయవాడ వైపు నుంచి గుంటూరు వైపు బొగ్గులోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైల్‌లో ఓ బోగిలో మంటలు చెలరేగాయి. అది గమనించిన కృష్ణాకెనాల్ స్టేషన్ మాస్టర్, సిబ్బంది అప్రమత్తమై రైల్‌ను నిలిపివేసి మంగళగిరి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు మంటలను అదుపు చేశారు.

## క్లుప్తంగా

### రూ.18 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

పెనమలూరు: కానూరులో ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు మోసం చేసి రూ.18 లక్షలు కాజేసిన ఘటన పై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీరామ్‌నగర్ 1వ లైన్‌కు చెందిన కె.శ్రీనివాసరావు బీమా కంపెనీలో సర్వేయర్‌గా పని చేస్తున్నాడు. ఈ ఏడాది జనవరి 12వ తేదీన వాట్సాప్‌లో ఆయనకు మెసేజ్ వచ్చింది. గూగుల్ మ్యాప్ రేటింగ్ రివ్యూస్ చేస్తే సొమ్ము ఇస్తామని తెలపటంతో రివ్యూలు చేయగా రూ.150 ఇచ్చారు. ఆ తరువాత టెలిగ్రామ్ లింక్ పంపారు. దీంతో ఆయన టెలిగ్రామ్ లింక్‌లో చేరాడు. వ్యాపార లావాదేవీలు చేసి శ్రీనివాసరావు పలు దఫాలుగా రూ.18,13,760 సైబర్ నేరగాళ్లు చెప్పిన బ్యాంకు ఖాతాల్లో ఆన్‌లైన్‌లో సొమ్ము జమ చేశాడు. మోసపోయానని తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### కల్వర్టును ఢీకొని వ్యక్తి మృతి



గంపలగూడెం: తిరువూరు–మధిర ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై వ్యవసాయ మార్కెట్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ ఎస్.శ్రీను తెలిపిన సమాచారం ప్రకారం... తిరువూరు మండలం చింతలపాడుకు చెందిన కొంగల కృష్ణ అలియాష్ జిన్నా (32) ఈ ప్రమాదంలో మృతి చెందాడు. జిన్నా మరో వ్యక్తి జుజ్జూరి కృష్ణ కలిసి పనిమీద బైక్‌పై చింతలపాడు నుంచి గంపలగూడెం వచ్చారు. తిరుగు ప్రయాణంలో బైక్ అదుపుతప్పి పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టారు. జిన్నా తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మరో వ్యక్తి కృష్ణకు గాయాలు కాగా చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై మృతుడి భార్య కొంగల స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### టిప్పర్ ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

రామవరప్పాడు : జాతీయ రహదారి దాటుతున్న ఓ వృద్ధురాలిని టిప్పర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన రామవరప్పాడులో శుక్రవారం చోటుచేసుకుంది. రైవస్ కాలువ కట్టపై చిర్ర గోవిందమ్మ (78) నివాసం ఉంటుంది. ఈమెకు ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు. గుడికి వెళ్లేందుకు గోవిందమ్మ పూలు కొనుగోలు చేసి సాయిబాబా గుడి వైపు జాతీయరహదారిని దాటుతుంది. ఈ సమయంలో గన్నవరం నుంచి రామవరప్పాడు వైపు వేగంగా వస్తున్న టిప్పర్ గోవిందమ్మను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మరణించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుమారుడు చిర్రా వెంకన్న ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బాబూజీ జీవితం అందరికీ ఆదర్శనీయం

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.హర్షవర్ధన్**



బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హర్షవర్ధన్, విజయకృష్ణన్, కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశ మాజీ ఉప ప్రధాని, సమతావాది బాబు జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.హర్షవర్ధన్ అన్నారు. లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్– బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.హర్షవర్ధన్, డైరెక్టర్ విజయ కృష్ణన్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ సెక్రటరీ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల, ఏపీఎస్‌సీఎఫ్‌సీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.చినరాముడు, జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని కోరారు. ఎన్నో శాఖలకు మంత్రిగా, ఉప ప్రధానిగా బాబూజీ 30 ఏళ్లకు పైగా అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పేదరికం నుంచి బయటపడాలంటే ఉన్న ఏకైక మార్గం చదువేనని గుర్తించాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ బాబూజీ అంచెలంచెలుగా ఎదిగి దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ బాబూజీ ఏ పదవి చేపట్టినా సమర్థవంతంగా నిర్వహించి, ఆ పదవులకు వన్నె తెచ్చారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో దళితులపై జరిగే అన్యాయాలు, అస్పృశ్యతపై పోరాటం చేసిన మహనీయులు బాబూజీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.విజయభారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ పరిరక్షణకు జగ్జీవన్‌రామ్ కృషి

**రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ**



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ సత్యనారాయణ, అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత రాజ్యాంగ పరిషత్ సభ్యునిగా సామాజిక న్యాయ పరిరక్షణకు ఎనలేని కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడు, దేశ తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం గొల్లపూడిలోని ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు విద్య అవసరమని ఎలుగెత్తి చాటిన జగ్జీవన్‌రామ్ మరణానంతరం ఆయన పేరుపై ఎన్నో పాఠశాలలు, కళాశాలలు నిర్మించి వాటిల్లో అట్టడుగు వర్గాల వారికి సైతం విద్యను అందించారని గుర్తు చేశారు. అటువంటి మహనీయుని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అదనపు కమిషనర్ టి.చంద్ర కుమార్, సంయుక్త కమిషనర్ ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్, స్థపతి పరమేశ్వరప్ప, ఉప కమిషనర్లు రత్నరాజు, శోభారాణి, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## చెరకు తోటలో మహిళ మృతదేహం లభ్యం

- గుర్తు తెలియని మహిళ తల, మొండెం
- హత్యేనని గ్రామస్తుల్లో అనుమానాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ కిషోర్‌బాబు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు శివారు కలాసుమాల పల్లి వద్ద ఓ చెరకు పొలంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. కేఈబీ కెనాల్ వెంబడి ఉన్న చిన్నకట్ట రహదారికి కూతవేటు దూరంలో, స్థానిక మండల పరిషత్ పాఠశాల వెనుక భాగంలో ఉన్న చెరకు తోటలో పూర్తిగా పాడైపోయిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహం లభ్యం కావటం కలకలం రేపింది. చిన్నకట్ట రహదారిపై రాకపోకలు సాగించే స్థానికులు చెరకుతోటలో నుంచి దుర్వాసన రావటాన్ని గమనించి శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. పమిడిముక్కల సీఐ ఎం. కిషోర్‌బాబు, తోట్లవల్లూరు ఎస్‌ఐ పి. విశ్వనాథ్ హుటాహుటిన తరలివచ్చి ఘటనా ప్రాంతాన్ని సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. 30–35 సంవత్సరాల మధ్యలో మృతురాలి వయస్సు ఉండే అవకాశం ఉంది. ఒంటిపై ఎలాంటి దుస్తులు, ఆభరణాలు లేకపోవటం, తల, మొండెం వేరు వేరుగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. శరీరం రెండు భాగాలుగా పడి ఉండటాన్ని బట్టి చూస్తే ఏదైనా బయటి ప్రాంతంలో మహిళను హత్య చేసి ఇక్కడ పడవేశారా అనే అనుమానం కలుగుతోంది. హత్యకు పాల్పడిన వారు మహిళ ఒంటిపై ఎలాంటి దుస్తులు, ఆభరణాలు లేకుండా చేయటం ద్వారా ఆధారాలు దొరకకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీం రంగంలోకి దిగి మృతదేహాన్ని పరిశీలించింది. గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యంపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిషోర్‌బాబు తెలియజేశారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, ఇప్పటికే జిల్లాలోని పలు స్టేషన్ల పరిధిలో మహిళ మిస్సింగ్ కేసుల వివరాలు సేకరించినట్లు తెలిపారు.

### స్వామివార్లకు రెండు వెండి నాగపడగలు సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్లకు విజయవాడ వాస్తవ్యులు పొన్నూరు హరికిరణ్ కుటుంబ సభ్యులు 937 గ్రాముల వెండి నాగపడగను శుక్రవారం సమర్పించుకున్నారు. మచిలీపట్నంకు చెందిన మరో భక్తులు కాశేపల్లి రామకృష్ణ సుబ్రహ్మణ్యేశ్వరరావు కుటుంబ సభ్యులు 929 గ్రాముల వెండి నాగపడగను స్వామివారికి సమర్పించుకున్నారు. ఈ రెండు పడగలను ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావుకు అందచేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

### ఏడీఆర్ఎంగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఏడీఆర్ఎం (ఆపరేషన్స్)గా కొండా శ్రీనివాసరావు ప్రస్తుత ఏడీఆర్ఎం ఎం.శ్రీకాంత్ నుంచి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు శ్రీనివాసరావు విజయవాడ డివిజన్‌లోనే సీనియర్ డీఈఈ (ఆపరేషన్స్)గా విధులు నిర్వర్తించారు. ఇండియన్ రైల్వే సర్వీస్–2003 ఎలక్ట్రికల్ ఇంజినీర్ బ్యాచ్‌కు చెందిన కొండా శ్రీనివాసరావు వరంగల్‌లోని ఎన్ఐటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్‌తో పాటుగా సిగ్నల్ ప్రాసెసింగ్‌లో మాస్టర్ ఆఫ్ ఇంజినీరింగ్ కూడా పూర్తి చేశారు. ఈస్టర్న్ రైల్వే జోన్‌లోని కంచరపర వర్క్‌షాపులో అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా రైల్వే సర్వీస్‌లో చేరాడు. అనంతరం అనేక కీలక బాధ్యతలు చేపట్టారు. లింగంపల్లి–వాడి రైల్వే ఎలక్ట్రికల్ ప్రాజెక్టులో కీలక పాత్ర పోషించారు. విధుల్లో అత్యుత్తమ పనితీరుకు గాను ప్రతిష్ఠాత్మకమైన జీఎం అవార్డును సైతం అందుకున్నారు. ప్రస్తుత ఏడీఆర్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.శ్రీకాంత్ బెంగళూరులోని రైల్ వీల్ ఫ్యాక్టరీకి బదిలీపై వెళ్లనున్నారు.

### మూడు కిలోల బంగారం ఆభరణాలు ధరించి శ్రీవారి దర్శనం



తిరుమల: గుంటూరు జిల్లా పెదవడ్లపూడి గ్రామానికి చెందిన గడ్డిపాటి సాంబశివరావు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గడ్డిపాటి సాంబశివరావు తన శరీరంపై దాదాపు మూడు కేజీల బంగారు ఆభరణాలు ధరించిన భక్తుడిగా నిలిచారు. ప్రతి సంవత్సరం స్వామి వారిని దర్శించుకుంటానని స్వామిపై ఉన్న భక్తి ప్రపత్తులతో ప్రత్యేకంగా డాలరును సైతం తయారు చేయించుకున్నానని చెప్పారు.

# దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

**ఆర్జిత సేవలకు డిమాండ్**



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



కుంకుమార్చనలో పాల్గొన్న ఉభయదాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. వివాహ ముహూర్తాలు, శుక్రవారం, సెలవు రోజు కావడంతో తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. నూతన వధూవరులు, వారి కుటుంబ సభ్యులతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా కనిపించింది. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉదయం లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమంలో నూతన దంపతులు, ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండ పైకి వచ్చిన భక్తులు సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్ల క్యూలైన్లలో అమ్మవారిని దర్శించుకున్నారు. మహా నివేదన నిమిత్తం ఉదయం 11–40 గంటల నుంచి 12–20 గంటల వరకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. వీఐపీ, వికలాంగులకు ప్రత్యేక దర్శన సమయాన్ని కేటాయించారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వీఐపీలను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద భక్తులు సేద తీరారు. ఆలయ ప్రాంగణంలో దాతల పేరిట మజ్జిగ వితరణ జరిగింది. మరో వైపున రద్దీ నేపథ్యంలో సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లు త్వరత్వరగా ముందుకు కదిలేలా పర్యవేక్షించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ, పల్లకీ సేవ, దర్బార్ సేవలను నిర్వహించగా పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల నివారణపై దృష్టి

**డీసీపీ అధిరాజ్**



సూర్యారావుపేట స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తున్న డీసీపీ అధిరాజ్ సింగ్ రాణా

విజయవాడస్పోర్ట్స్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల నివారణపై దృష్టి సారించి పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని డెప్యూటీ పోలీస్ కమిషనర్ (డీసీపీ) అధిరాజ్‌సింగ్ రాణా సూచించారు. నగరంలోని సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌ను డీసీపీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, ఎఫ్ఐఆర్ ఇండెక్స్, క్రైమ్ రికార్డ్స్, స్టేషన్ పరిసరాలు, సీజ్ చేసిన వాహనాలు, లాకప్ గదులు, కంప్యూటర్ గదులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులను తగ్గించాలని, బీట్‌ల సంఖ్య పెంచి స్టేషన్ పరిధిలో జరిగే నేరాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ.. వారి సమస్యలను చట్ట ప్రకారంగా పరిష్కరించాలని సూచించారు. నిర్మానుష్య ప్రదేశాలు, పరిసర ప్రాంతాల్లో తిరుగు అనుమానాస్పద వ్యక్తులపై, గంజాయి విక్రయ, సేవించే వ్యక్తులపై, చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. నగరంలో గంజాయి అక్రమ రవాణాపై పటిష్ఠమైన నిఘాతో అత్యధిక కేసులు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## పేదల పార్టీనే అధికారంలోకి రావాలి

**వైఎస్ విమలారెడ్డి**




సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ విమలారెడ్డి

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): పేదల అభివృద్ధికి కృషి చేసే రాజకీయ పార్టీనే అధికారంలోకి రావాలని వై.ఎస్.విమలారెడ్డి ఆకాంక్షించారు. బందరురోడ్డులోని లెమన్ ట్రీ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ పాస్టర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవ నాయకుల సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా విమలారెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం ద్వారా అభివృద్ధికి పాటుపడుతున్న పార్టీని అధికారంలోనికి తీసుకురావడానికి దేవుని సహాయం కోసం ప్రార్థిస్తున్నామని తెలిపారు. వివిధ డినామినేషన్‌కి చెందిన ఆధ్యాత్మిక క్రైస్తవ నాయకులు, బిషప్‌లు మాట్లాడుతూ సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవులకు అందజేసిన పథకాలు, పాస్టర్స్‌కు గౌరవ వేతనం అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులకు అవసరమైన మరికొన్ని అంశాలకు సంబంధించి వినతి పత్రం ఇవ్వాలని సదస్సు తీర్మానించింది. ఈ సమావేశంలో సీఎస్ఐ కృష్ణ గోదావరి డయాసిస్ గ్రూపుల బిషప్ కార్నేలియస్, బిషప్ ఎబినేజర్, డాక్టర్ వైఎస్ థామస్‌రెడ్డి, రెబ్బ ఇమ్మానియేల్, కె.ప్రభాకర్, ఏపీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి జీవన్‌కుమార్ పాల్గొన్నారు. తొలుత వైఎస్ విమలారెడ్డిని క్రైస్తవ సంఘాల నాయకులు శాలువాతో సత్కరించారు.

## వార్డు సచివాలయ ఉద్యోగి చేతివాటం

**విజయవాడ గుణదల పీఎస్‌లో కేసు నమోదు**



నిందితుడు ఊటుకూరి నాగమల్లి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అవ్వాతాతలకు పంపిణీ చేయాల్సిన పింఛను నగదుతో వార్డు సచివాలయ ఉద్యోగి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన ఘటన విజయవాడ గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని మధురానగర్ 208 వార్డు సచివాలయం అడ్మిన్‌గా ఊటుకూరి నాగమల్లి పని చేస్తున్నాడు. లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేసేందుకు ఈ నెల 3వ తేదీ సాయంత్రం అధికారులు రూ.5.41 లక్షలు అందజేశారు. అదేరోజు నాగమల్లి 14 మందికి పింఛన్ పంపిణీ చేశారు. తక్కిన నగదును మర్నాడు ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయాల్సిందిగా అధికారులు సూచించారు. నాగమల్లి మూడో తేదీ రాత్రి క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడ్డాడు. బెట్టింగ్‌లో పింఛన్ నగదు పోగొట్టుకోవటంతో 4న పింఛన్ పంపిణీ చేయలేదు. పింఛన్‌దారుల ఫిర్యాదు మేరకు జోనల్ కమిషనర్ కంచర్ల ప్రభుదాస్ ఫోన్ చేసినప్పటికీ నాగమల్లి స్పందించక పోవటంతో నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాలతో గురువారం రాత్రి గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుదాస్ ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి వార్డు సచివాలయం అడ్మిన్ నాగమల్లిని అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నారు. పింఛన్ పంపిణీ చేయాల్సిన నగదు రూ.4.99 లక్షలు ఏమయ్యాయని సీఐ వాసిరెడ్డి శ్రీను ప్రశ్నించగా తొలుత సొంతానికి వాడుకున్నానని, తరువాత అప్పులు తీర్చానని చెప్పిన నాగమల్లి చివరకు బెట్టింగ్‌లకు పాల్పడినట్లు అసలు విషయం చెప్పాడు. దీంతో నాగమల్లి భార్య, కుటుంబ సభ్యులు నగదు తీసుకొచ్చి అధికారులకు అందజేయడంతో లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు.

## సాంకేతిక పరిజ్ఞానం రహదారి భద్రతకు దోహదం



శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న బాయన వెంకట్రావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): డ్రైవర్ల సాంకేతిక పరిజ్ఞానం రహదారి భద్రతకు దోహదపడుతుందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఘం గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు అన్నారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటరు (అంపాపురం)లో డ్రైవింగ్ శిక్షణ పూర్తిచేసుకున్న 1069వ బ్యాచి ట్రైనీలకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో వెంకట్రావు మాట్లాడుతూ ఏ రంగంలో రాణించాలన్నా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని చెప్పారు. లారీ ఓనర్స్ అసోసియేసన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు డ్రైవింగ్ స్కూలులో సిమ్యులేటర్లు, బయోమెట్రిక్ హాజరు తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అతివేగంతో వాహనం నడపవద్దని సూచించారు. ప్రయాణ సమయాల్లో డ్రైవర్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తుమ్మల లక్ష్మణస్వామి మాట్లాడుతూ డ్రైవర్ వృత్తి పట్ల చులకన భావన తగదని పేర్కొన్నారు. సామాజికంగా డ్రైవర్ పాత్ర కీలకమైందన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అల్లాడ వీరవెంకట సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్ బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు, స్టోర్స్ కార్యదర్శి కోనేరు జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆకట్టుకున్న హరికథా గానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన హరికథా గానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన గుడిపాటి కల్చరల్ అసోసియేషన్‌కు చెందిన గుడిపాటి జయరామ సుధాకర్ యాగ రక్షణపై హరికథా గానం చేశారు. జయరామ సుధాకర్‌కు వయోలిన్‌పై డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి, మృదంగంపై కె.జగన్మోహని సహకారం అందించారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన హరికథా గానాన్ని భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం హరికథా గానం చేసిన వారికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

### భారత మహిళా మండలికి నూతన కార్యవర్గం



విజయవాడ కల్చరల్: భారత మహిళా మండలి విజయవాడ శాఖకు 2024–2025 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు కార్యదర్శి వడ్డాది సూర్యకామేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షురాలిగా రుత్తా శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా తాడువాయి శశిరేఖ, జాయింట్ కార్యదర్శిగా ఆర్ ఉషామాధవి, ఇమిడియట్ పాస్ట్ ప్రెసిడెంట్‌గా వి.ఉమాదేవి, కమిటీ సభ్యులుగా జీవీఎల్‌కుమారి, టి.వసంతకుమారి, టి.దివ్యవాణి. ఎడ్వైజరి కమిటీ సభ్యులుగా ఎ.రత్నాలక్ష్మి, టి.సాయిలక్ష్మిని ఎన్నుకున్నట్లు వివరించారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రతి నెలా 5వ తేదీన నిర్వహించే ఈసీసీఈ కార్యక్రమంలో భాగంగా, బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతినికూడా పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కేఎల్‌రావు నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలు చేసే ఆటపాటలను వారి తల్లుల ముందు ప్రదర్శింపజేశారు. బాల్య దశ సంరక్షణ, ప్రాథమిక విద్య వంటి అంశాలపై నిర్వహించే వివిధ రకాల ఆటలు, కథలపై ప్రీ స్కూల్ పిల్లల తల్లులకు వివరించారు. బాబు జగ్జీవన్‌రామ్ గొప్పదనం తెలియజేస్తూ అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుధారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.సౌజన్య, ఎస్.ఆల్ఫన్స్, బి.విజయకుమారి, జి.పద్మావతి, ఆర్.హెలెన్ పాల్గొన్నారు.

### ఉగాదికి 'వేగ' ప్రత్యేక ఆఫర్లు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వేగ జ్యూయలర్స్‌లో ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు సంస్థ యజమానులు వనమా నవీన్, సుధాకర్ తెలిపారు. లబ్బీపేట నందమూరిరోడ్డులోని వేగ జ్యూయలర్స్ ఆభరణాల షోరూంలో ఉగాది పండుగా సందర్భంగా ఖాతాదారులకు అందిస్తున్న ప్రత్యేక ఆఫర్ల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి, సినీ నటి డింపుల్ హయతి పోస్టర్ ఆవిష్కరించారు. అధునాతన ఆభరణాలతో పాటు సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పే విభిన్న ఆభరణాలను ఖాతాదారులకు అందిస్తున్న సంస్థ అధినేతలు వనమా నవీన్, వనమా సుధాకర్‌లను అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేతలు నవీన్, సుధాకర్ మాట్లాడుతూ ఉగాది సందర్భంగా వేగ జ్యూయలర్స్‌లో ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఇవి ఏప్రిల్ 30 వరకు ఉంటాయన్నారు. ఈ నెలలో అనేక వివాహ ముహూర్తాలు ఉన్నందున మా షోరూంలో అందిస్తున్న ప్రత్యేక ఆఫర్లను అందిపుచ్చుకుని, వేగ ఆభరణాలతో వివాహ వేడుకను మరింత వైభవోపేతంగా జరుపుకోవాలన్నారు. సంప్రదాయ సిద్ధమైన ఆభరణాలను షోరూం లో విస్తృత శ్రేణిలో ఏర్పాటు చేశామన్నారు. బంగారం కొనుగోలుపైన ప్రతి గ్రాముకు రూ.250, అలాగే పాత బంగారం మార్పిడి పైన అదనంగా రూ.150 తగ్గింపు, డైమండ్ జ్యూయలరీ క్యారట్ ధర రూ. 54వేలు అందిస్తామని, పోల్కీ జ్యూయలరీ పైన ఎలాంటి తయారీ, తరుగు చార్జీలు ఉండవని యాజమాన్యం ప్రకటించింది. ఖాతాదారులకు నూతన తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

### ఇన్‌కంట్యాక్స్ రిటర్న్స్ అందజేయండి

కంచికచర్ల: ఇన్‌కంటాక్స్ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ పెన్షనర్లు ఇన్‌కంట్యాక్స్ రిటర్న్స్ దాఖలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు సూచించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో శుక్రవారం రిటైర్డ్ ఎంప్లాయీస్‌తో సమావేశం జరిగింది. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# స్ఫూర్తిప్రదాత జగ్జీవన్‌రామ్

**వైఎస్సార్ సీపీ 'తూర్పు' అభ్యర్థి దేవినేని అవినాష్**



శిఖామణిసెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసిన దేవినేని అవినాష్, కార్పొరేటర్ మాధురి తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన స్ఫూర్తిప్రదాత బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని శిఖామణి సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల వారి కోసం అలుపెరగని పోరాటం చేసిన సంఘ సంస్కర్త, స్వాతంత్య్ర సమరయోధులు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి, మండల పార్టీ అధ్యక్షుడు బుర్రి జగ్జీవన్‌రావు, నేతలు మెరకనపల్లి కుటుంబరావు, పరసా క్లెవ్, మట్టా ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

**డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో..**

పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్‌కు ఉద్యోగులు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, డాక్టర్ కార్తీక్, స్టాటిస్టికల్ అధికారి ఎస్.లక్ష్మోజీ, డిప్యూటీ డెమో కె.ప్రభాకరరెడ్డి, గోపాలకృష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

- 19వ డివిజన్ జార్జిపేటలో ఎస్సీ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యాన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రంట్ అధ్యక్షుడు బుర్రి బాబూరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చింతగుంట విజయ్‌ఆనంద్‌కుమార్.. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుర్రి జగ్గా, ప్రతాప్, దాసు, నాగేశ్వరరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.
- మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని జనశిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.కోటేశ్వరరావు చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంస్థాన్ సిబ్బంది, శిక్షణార్థులు నివాళులర్పించారు.
- మొగల్రాజపురంలో స్థానిక బందులదొడ్డి సెంటర్‌లో లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యాన జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. సుమారు 50 మందికి బీపీ, షుగర్, దంత పరీక్షలు నిర్వహించారు. మొండితోక మరియదాసు, సంపత్, రవి, సుధాకర్, దాసు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- గుణదల(విజయవాడ తూర్పు): జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి అవినాష్.. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి అంజలి ఘటించారు. కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, నేతలు కిరణ్ తేజ, రాజ్‌కమల్, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడస్పోర్ట్స్: ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆధ్వర్యాన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పరాస కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణరావు, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పొలిమెట్ల శరత్‌బాబు, విజయవాడ సిటీ అధ్యక్షులు బూదాల శ్రీను, నేతలు షేక్ అమానుల్లా, వెలగలేటి భార్గవ్ రాయుడు, పచ్చిగళ్ల రమేష్, రాధా–రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుల హరికృష్ణ, నాగెళ్ల సంగీతబాబు, బి.పి.కుమార్, వి.థామస్, మెట్ల వరలక్ష్మీ, చందా కిరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

**పోలీస్ కమిషనరేట్‌లో..**

పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఏడీసీపీ టి.కనకరాజు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ కమిషనరేట్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో..



జార్జిపేటలో నివాళులర్పిస్తున్న బుర్రి బాబూరావు, చింతగుంట విజయ్ తదితరులు



జనశిక్షణ సంస్థాన్‌లో..

### మంచి చేసిన వారిని గెలిపించండి



10వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని క్రాంతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నియోజకవర్గంలో ఐదేళ్లుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీని, పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌ను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని ఆయన సోదరి దేవినేని క్రాంతి అన్నారు. గడప గడపకు మీ అవినాష్ అన్నలో భాగంగా శుక్రవారం 10 డివిజన్ భద్రయ్యనగర్, దండమూడి వారి వీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఆమె వెంట 10వ డివిజన్ ఇన్‌చార్జి కరుటూరి హరీష్ తదితరులు ఉన్నారు.

- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ అవినాష్ సతీమణి దేవినేని సుధీర 4వ డివిజన్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. సీటీఓ కాలనీలో పర్యటిస్తూ ఎమ్మెల్యేగా దేవినేని అవినాష్‌ను, పార్లమెంటు సభ్యుడిగా కేశినేని శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. ఆమె వెంట 4వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు గల్లా రవి తదితరులు పాల్గొన్నారు.



4వ డివిజన్ సీటీఓ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న సుధీర

### 8 నుంచి నూకాలమ్మ జాతర

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం సమీపంలోని శ్రీ నూకాలమ్మ జాతర ఎఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానుందని నిర్వాహకులు పేర్కొన్నారు. 8వ తేదీ ఉదయం 9 గంటలకు కలశస్థాపన, 9 తేదీ అమ్మవారికి విశేష కుంకుమార్చన జరుగుతాయని తెలిపారు. 10 నుంచి 19వ తేదీ వరకు రోజుకో విశేష పూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 20వ తేదీ కృష్ణా నది నుంచి కలశాలతో ఊరేగింపు, అనంతరం ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను నదీ జలాలతో అభిషేకం, 21వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు అమ్మవారి సంబరం జరుగుతుందని వివరించారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం



స్థానికులతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని కొండ ప్రాంతంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో పేదలకు సంక్షేమ పాలనతో పాటు అభివృద్ధిని సైతం చేరువ చేశారని పేర్కొన్నారు. పేదల నాడి తెలిసిన నాయకుడిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు.

**టీడీపీ ఇంటికే పరిమితం..**

గత ఎన్నికల్లో చావుదెబ్బతిన్న టీడీపీ ఈ ఎన్నికల్లో కనుమరుగు కానుందని దేవినేని అవినాష్ అన్నారు. వారు ప్రజా సమస్యలు పట్టించుకోపోగా ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి లేనిపోని సమస్యలకు తెరతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన పేదలకు ప్రభుత్వం వలంటీరు వ్యవస్థ ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తుండగా ఆ ప్రక్రియను సైతం అడ్డుకున్న ఘన చరిత్ర చంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు చేసిన తప్పిదానికి పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు.

**అభివృద్ధి దిశగా**

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ప్రధానంగా 'తూర్పు'లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు వ్యవస్థలను అభివృద్ధి చేశామన్నారు. కృష్ణలంక ప్రాంతంలో నిర్మించిన రిటైనింగ్ వాల్ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను తాము చేసినట్లుగా తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పుకుంటున్నారని, ఇది ఆయన నీచ రాజకీయాలకు తార్కాణమని స్పష్టం చేశారు. ఎప్పుడూ ఇంటికే పరిమితమై సొంత వ్యాపారాలు చూసుకునే రామ్మోహన్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. 'తూర్పు'లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగిస్తుందని దీమా వ్యక్తం చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ బీమిశెట్టి ప్రవల్లిక, నేతలు శ్రీనివాస్, విజయకుమార్, ప్రసాద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గద్దె.. కల్లబొల్లి కబుర్లు చెప్పొద్దు

- రిటైనింగ్ వాల్ నీవు నిర్మించావా?
- దమ్ముంటే చర్చకు రా
- నియోజకవర్గంలో రూ.650 కోట్లతో అభివృద్ధి చేశాం
- డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ



మాట్లాడుతున్న ఫ్లోర్‌లీడర్ సత్యనారాయణ, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గద్దె.. రిటైనింగ్ వాల్ నీవు కట్టావా.. మీ ప్రభుత్వ హయాంలో కడితే 2020 వరదల్లో రామలింగేశ్వరనగర్, పోలీస్‌కాలనీల్లోకి నీరు ఎందుకు వచ్చిందో చెప్పగలవా... కల్లబొల్లి కబుర్లు చెప్పొద్దంటూ తూర్పు నియోజకవర్గం కృష్ణలంక ప్రాంతం కార్పొరేటర్లు మండిపడ్డారు. నీవు 2014–19 మధ్య కాలంలో ఏమి చేశావో చెప్పలేవు. మేము గత ఐదేళ్లలో రూ.650 కోట్లు అభివృద్ధి చేశామని దమ్ముగా ధైర్యంగా చెబుతున్నామని నీకు సత్తా ఉంటే చర్చకు రా నిరూపిస్తాం అంటూ సవాల్ విసిరారు. గుణదలలోని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం కృష్ణలంక ప్రాంత కార్పొరేటర్లు మీడియా సమావేశం నిర్వహించారు. వీఎంసీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ గద్దె రామ్మోహన్ పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోందన్నారు. దీంతో పట్టాభిలాంటి పిల్ల నేతలతో ప్రెస్‌మీట్‌లు పెట్టించి అసత్యాలు ప్రచారం చేయించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జిల్లాలో కీలకనేతగా నెహ్రూ రాజకీయం చేసినప్పుడు పట్టాభి ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. ప్రపంచ విపత్తు కరోనాలో ప్రజలు అనేక ఇబ్బందులు పడితే గద్దే రామ్మోహన్ ఎక్కడున్నాడని వెంకట సత్యనారాయణ ప్రశ్నించారు. రీల్స్ స్టార్ గద్దె రామ్మోహన్ ఈ రోజే నిద్ర మత్తు వీడాడని బెల్లం దుర్గ ఎద్దేవా చేశారు. మీరెన్ని అబద్ధాలు ప్రచారం చేసినా తూర్పులో ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు తంగిరాల రామిరెడ్డి, తాటిపర్తి కొండారెడ్డి, ఆళ్ల చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## ● ఎండకు ముసుగు









భాస్కరుడి ప్రతాపానికి నగర ప్రజలు అల్లాడిపోతున్నారు. రోజురోజుకూ ఎండ అధికమవుతుండటంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేటప్పుడు ప్రజలు రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. కొందరు టోపీలు ధరిస్తుంటే.. కొందరు మహిళలు పమిట చెంగులనే ముసుగులుగా ఎండ నుంచి రక్షణ పొందుతున్నారు. మరికొందరు చిరువ్యాపారులు గొడుగులతో ఉపశమనం పొందుతున్న దృశ్యాలు శుక్రవారం నగరంలో కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

### రైల్వే కార్మికుల సంక్షేమమే లక్ష్యం



డివిజన్ కౌన్సిల్ సమావేశంలో సత్యవాణి, సంఘ నేతలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే కార్మికుల సంక్షేమమే తమ ముఖ్య అజెండా అని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ జోనల్ సహాయ ప్రధాన కార్యదర్శి సత్యవాణి పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ రైల్వే ఆడిటోరియంలో డివిజన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు బ్రాంచ్ చైర్మన్‌లు, కార్యదర్శులు పలు సమస్యలను సత్యవాణి దృష్టికి తీసుకువచ్చారు. ఆమె దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని తెలిపారు. సంఘ విజయవాడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఆమంచి వెంకటేశ్వరావు, ఆకుల రాఘవేంద్ర, సుకుమార్, రమేష్, దేగల శ్రీను, కొయ్య రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పలువురికి ఆర్థిక సాయం

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో శుక్రవారం తోట సీతారామయ్య, సీతారామమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ తోట వెంకయ్య పలువురు పేదలకు ఆర్థిక సాయం అందించారు. ఇంటి పైకప్పు రేకుల నిర్మాణం కోసం గుద్దేటి శేషమ్మ, పులపాక బాయమ్మలకు ఆర్థిక సాయం, వృద్ధురాలు ఏసమ్మకు తోడ్పాటునందించారు. సహకార బ్యాంకు అధ్యక్షుడు ఏడుకొండలు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనమలూరు: పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఎన్టీఆర్ బస్‌స్టాపు సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు తనిఖీ చేయగా పేకాట ఆడుతూ ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ. 13,300 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

### ముందస్తు ఉగాది వేడుకలు



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట):గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో శుక్రవారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ధర్మవరప్పాడుతండ, రావిరాల, జయంతిపురం, కెఅగ్రహారం, బూదవాడ గ్రామాలకు చెందిన పెద్దలను ఘనంగా సత్కరించారు. వారికి నూతన వస్త్రాలు, స్వీట్లు బహూకరించారు. అనంతరం కంపెనీ ప్రెసిడెంట్ ఆషిష్ కుమార్ శ్రీవాత్సవ్ మాట్లాడుతూ ఉగాది పండుగ అందరి జీవితాల్లో కొత్తవెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కంపెనీ ప్రతినిధులు ఫరూక్ మహ్మద్, రామకృష్ణ సాయి, హెచ్‌వోడీలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### 9న శ్రీవిద్యా పాదుకాంత పూర్ణదీక్ష గ్రంథావిష్కరణ

విజయవాడ కల్చరల్: స్వామి పరమానంద(డాక్టర్ క్రోవి పార్థసారథి) రచించిన శ్రీ విద్యా పాదుకాంత పూర్ణదీక్ష గ్రంథావిష్కరణ సభ మారుతీ గ్యాస్ కంపెనీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ మంగళవారం జరుగుతుందని నిర్వాహకుడు చెట్లపల్లి మారుతీ ప్రసన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్టీఎస్ రోడ్డులోని గాయత్రి కన్వెన్స్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శనివారం ॥ 6-4-2024

దేశం నిశ్శబ్దంగా ఒక ముఖ్యమైన జనాభా మార్పుకు గురవుతోంది.
ఇండియా ఏజింగ్ రిపోర్ట్ 2023 ప్రకారం దేశ జనాభాలో 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు గలవారు దాదాపు 15 కోట్ల మంది ఉన్నారు.
ఈ సంఖ్య 2050 నాటికి రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.
సంతానోత్పత్తి రేటు తగ్గడం, అందుబాటులోకి వచ్చిన చికిత్సా విధానాల వల్ల భారతదేశ జనాభాలో వృద్ధుల వాటా నిశ్శబ్దంగా పెరుగుతోంది.
అయితే, దీనికి తగినట్టుగా వారి ఆర్థిక శక్తి పెరగడం లేదు.
ఫలితంగా వృద్ధులు సొంత కుటుంబాల నుంచే ఈసడింపులకు, వేధింపులకూ గురవుతున్నారు.
వృద్ధుల జీవితం భరోసాగా గడవడం ఎలా?!



# సీనియర్ సిటిజన్స్‌కు భరోసా ఏది?



పాశ్చాత్య దేశాల మాదిరి కాకుండా భారతదేశంలోని 40 శాతం మంది వృద్ధులు అత్యంత పేదరికంలో ఉన్నారు. 60 నుంచి 80 ఏళ్ల వయసులో ఉన్న మహిళలు ఆర్థిక, ఇతర అవసరాల కోసం వారి కుటుంబాలపై పూర్తిగా ఆధారపడి ఉన్నారు. గ్రామీణ వృద్ధులు కుల, వర్గ ఆధారిత వివక్షకూ గురవుతున్నారు.

**గ్రామాల్లో పెను సవాల్!**

నగరాలలో ఉండే సీనియర్ సిటిజన్స్ జీవితాలతో పోల్చితే గ్రామాల్లో వారి పరిస్థితి దయనీయంగా ఉంది. వీరు కనీస సౌకర్యాలు కూడా లేకుండా జీవిస్తున్నారు. మన ఆరోగ్య విధానం సాధారణంగా మాతా, శిశు సంరక్షణపైనే ఉంటుంది.
వృద్ధుల సంరక్షణకు అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. గ్రామీణ వృద్ధులలో ప్రత్యేకించి మహిళలు ఆర్థిక, అవసరాల కోసం వారి కుటుంబాలపై పూర్తిగా ఆధారపడుతున్నారు. మన దేశంలో వృద్ధుల సంరక్షణ ఎక్కువ భాగం వారి పిల్లలు చూసుకోవడం ఆనవాయితీ. అయితే, కాలంతో పాటు ఈ విధానాలూ వేగంగా మారుతున్నాయి.

**పిల్లల వలస..**

**పెరుగుతున్న ఒంటరితనం**

విద్య, ఉద్యోగాల కోసం పిల్లలు వలసలు వెళ్లడం, ఉమ్మడి కుటుంబం వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, వృద్ధుల సంరక్షణను ప్రశ్నార్థకంగా మార్చింది. నివేదికల ప్రకారం 60 ఏళ్ల, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులలో 6 శాతం మంది ఒంటరిగా జీవిస్తున్నారు. 20 శాతం మంది పిల్లలు లేకుండా వారి జీవిత భాగస్వామితో మాత్రమే జీవిస్తున్నారు. ఈ సంఖ్య భవిష్యత్తులో గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. తక్కువ ఆదాయ కుటుంబాలలో వృద్ధుల ఆరోగ్య అవసరాలు ఆర్థికంగా భరించలేనంత భారంగా మారుతున్నాయి. భారతదేశంలో వృద్ధులపై వేధింపుల కేసులు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. 'హెల్ప్ ఏజ్ ఇండియా' నివేదిక ప్రకారం 25 శాతం మంది పెద్దలు తమ సొంత కుటుంబాల ద్వారా వేధింపులకు గురవుతున్నారు.

**సామాజిక భద్రత**

హెల్ప్ ఏజ్ ఇండియా సూచనల మేరకు..

- దేశంలో వృద్ధుల కోసం అధికారిక సంస్థాగత సంరక్షణలో పెట్టుబడులను పెంచాల్సిన అవసరం ఉంది. పటిష్ఠమైన పెన్షన్, సామాజిక భద్రతా వ్యవస్థ, మెరుగైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందించడం ద్వారా వారి కుటుంబ సభ్యులపై వృద్ధులు ఆధారపడటం తగ్గించవచ్చు.
- దాదాపు 33 శాతం మంది వృద్ధ స్త్రీలకు ఎటువంటి ఆదాయం లేదు. 11 శాతం మందికి మాత్రమే పెన్షన్ ద్వారా ఆదాయం వస్తోంది. 16.3 శాతం మంది సామాజిక పెన్షన్ పొందుతున్నారు. సీనియర్ కేర్ సంస్కరణలపై ఇటీవల 'నీతి అయోగ్' సమర్పించిన ఓ నివేదిక ప్రకారం వృద్ధుల ఆర్థిక సాధికారతను నిర్ధారించడానికి ప్రభుత్వ నిధుల కవరేజీని పెంచడం, తిరిగి పని నైపుణ్యాలవైపు మళ్లించడం, తప్పనిసరి పొదుపు ప్రణాళికలు, రివర్స్ మార్టిగేజ్ మెకానిజమ్స్, పన్ను, జీఎస్టీ సంస్కరణల వంటి అనేక చర్యలు చేపట్టాలని పేర్కొంది.
- ఎటువంటి ఆస్తులు, ఆదాయం లేకుండా ఉన్నవారి అవసరాలకు అనుగుణంగా సంపూర్ణ వృద్ధాప్య సంరక్షణ నమూనాను అభివృద్ధి చేయాల్సి ఉంటుందనేది మరో సూచన.

### నలుగురు కలిసి ఉంటే ఎంతో మేలు..

వృద్ధులైనా డబ్బున్నవారి పరిస్థితి బాగానే ఉంది. డబ్బులేని వారే జీవచ్ఛవాలుగా బతుకీడుస్తున్నారు.

- వృద్ధులకు ఓల్డేజ్ హోమ్స్ తప్ప మరో మార్గం లేదు. ఫుడ్ షెల్టర్ ఈ రెండే ఇస్తుంది. కానీ, ఎమోషనల్‌గా ఒంటరితనం ఫీలవుతుంటారు. అందుకే, రీ మ్యారేజ్ ద్వారా మేం ఒక సొల్యూషన్ చూపిస్తున్నాం. లేదంటే, ఒంటరిగా ఉన్న వృద్ధులు ప్రమాదాలకు, దోపిడీలకు గురవుతున్నారు. ఇలాంటప్పుడు నలుగురు వృద్ధులు కలిసి ఒక చోట ఉండవచ్చు. దీని వల్ల ఒంటరితనం పోగొట్టుకోగలుగుతారు.
- అప్పడాలు, వడియాలు వంటివి చేసి, వ్యాపారం చేసుకోవచ్చు. కానీ, 70 ఏళ్ల వయసులో ఏ పనీ చేయడానికి ఓపిక ఉండదు. పెట్టింది తినడం తప్ప ఏ రకమైన ఫిజికల్ స్ట్రెయిన్ పడలేరు. అందుకని, రూమ్మేట్స్ లాగా కలిసి ఉండాలి. అక్కడ చిన్న చిన్న కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవచ్చు, ఇండోర్‌గేమ్స్, స్థానిక పర్యాటక స్థలాలు చూసి రావచ్చు.
- యువత పట్టించుకోదు. మధ్య వయసువారికి కుటుంబ సమస్యలు. సీనియర్ సిటిజన్స్ పట్ల ఎవరికీ జాలి, దయ ఉండదు. వృద్ధులకు ఇచ్చే ఆత్మీయ స్పర్శను ఎంతో ఓదార్పుగా ఫీలవుతారు.
- రాజకీయ వర్గం తరచుగా యువ జనాభాను ఆర్థిక ఆస్తిగా పేర్కొంటుంది. పెరుగుతున్న వృద్ధ జనాభాకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక, సామాజిక మద్దతును అందించడానికి అంతగా ఆసక్తి చూపదు. ఏ రకమైన ఆదాయం లేనివారికి ప్రభుత్వమే వారికో దారి చూపించాల్సి ఉంటుంది. ప్రభుత్వం పెన్షన్ రూపేణ వచ్చే వనరుతోనూ నలుగురు కలిసి ఉండవచ్చు.



– ఎస్.ఎమ్.రాజేశ్వరి, తోడు నీడ స్వచ్ఛంద సంస్థ, హైదరాబాద్

---

సేవాపథం

సెక్స్–ట్రాఫికింగ్ సర్వైవర్స్‌కు అండగా నిలబడి వారికి ఒక దారి చూపుతోంది రుచిర గుప్తా. యాంటీ–ట్రాఫికింగ్ యాక్టివిస్ట్, యూఎస్ అడ్వైజర్, విజిటింగ్ ప్రొఫెసర్, 'అప్నే ఆప్' కో–ఫౌండర్, రైటర్ రుచిర ఎందరో బాధితులకు అక్కగా, అండగా నిలబడింది.

# చీకటి కూపం నుంచి వెన్నెల దారుల్లోకి



రుచిర

యువ జర్నలిస్ట్‌గా రుచిర గుప్తా నేపాల్‌కు వెళ్లింది. 'సహజ వనరులను గ్రామాలు ఏ రకంగా ఉపయోగించుకుంటున్నాయి' అనే అంశంపై కథనాలు రాయడానికి ఎన్నో గ్రామాలకు వెళ్లింది. సహజవనరులకు సంబంధించిన సమాచారం మాట ఎలా ఉన్నా చాలా గ్రామాల్లో వినిపించిన మాట....

'మా ఊళ్లో కొందరు అమ్మాయిలు కనిపించడంలేదు. వారి ఆచూకి తెలియడం లేదు' మారుమూల హిమాలయ కుగ్రామం అయిన సిందుపాల్‌చౌక్‌లో పేకాట ఆడుతున్న వారిని అమ్మాయిల అదృశ్యం గురించి అడిగింది రుచిర.

'వాళ్లు ముంబైలో ఉన్నారు' అని అసలు విషయం చెప్పారు వాళ్లు.

నేపాల్ నుంచి మన దేశానికి వచ్చిన తరువాత ముంబైలోని రెడ్‌లైట్ ఏరియా కామాటిపురాకు వెళ్లింది రుచిర. అక్కడ చిన్న చిన్న గదుల్లో అమ్మాయిలు బంధించి ఉండటాన్ని గమనించింది. బాధగా అనిపించింది. అయితే ఆమె బాధ దగ్గరే ఆగిపోలేదు. ' వారికోసం ఏదైనా చేయాలి' అని మనసులో గట్టిగా అనుకుంది.

నేపాల్ గ్రామాల నుండి ముంబైలోని వ్యభిచార గృహాలకు యువతులు, బాలికల అక్రమ రవాణాను బహిర్గతం చేయడానికి కెనడియన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ కోసం 'ది సెల్లింగ్ ఆఫ్ ఇన్నోసెంట్స్' అనే డాక్యుమెంటరీ తీసింది.

ఈ డాక్యుమెంటరీ కోసం ఎంతోమంది అమ్మాయిలతో మాట్లాడింది. వారు చీకటికూపాల్లో చిక్కుకుపోవడానికి ప్రధాన కారణం...కటిక పేదరికం. ఈ డాక్యుమెంటరీ చేస్తున్నప్పుడు ఆమెపై హత్యా ప్రయత్నాలు కూడా జరిగాయి. ఒకడు కత్తితో పొడవడానికి వచ్చినప్పుడు అక్కడ ఉన్న మహిళలు తమ ప్రాణాలను పణంగా పెట్టి మరీ ఆమెను రక్షించారు.

అవుట్ స్టాండింగ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం కోసం ఇచ్చే ఎమ్మీ అవార్డ్‌ను 'ది సెల్లింగ్ ఆఫ్ ఇన్నోసెంట్స్' గెలుచుకుంది.

అవార్డ్ అందుకుంటున్నప్పుడు చప్పట్ల మధ్య, ప్రకాశవంతమైన దీపాల మధ్య ఆమెకు కనిపించిందల్లా చీకటి కొట్టాలలోని బాధితుల కళ్లు మాత్రమే. 'జర్నలిజంలో నేను మరో మెట్టు పైకి చేరడానికి కాకుండా మార్పుకోసం ఈ డాక్యుమెంటరీ ఉపయోగపడాలని కోరుకున్నాను' అంటుంది రుచిర.

అక్రమ రవాణాపై కఠిన చట్టాలు తీసుకురావడానికి సహాయపడాల్సిందిగా అప్పటి యూఎస్ హెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ సెక్రటరీ డోనా షలాలాతో మాట్లాడింది రుచిర. డోనా ద్వారా ఐక్యరాజ్య సమితి సమావేశంలో తన డాక్యుమెంటరీని ప్రదర్శించడమే కాదు వివిధ దేశాలకు చెందిన 180 మంది ప్రతినిధులతో మాట్లాడింది.

ఇరవై రెండు మంది మహిళలతో కలిసి 'అప్నే ఆప్–ఉమెన్ వరల్డ్ వైడ్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది రుచిర గుప్తా. అక్రమ రవాణ నిరోధించడానికి, బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందించడానికి ఈ సంస్థ అలుపెరుగని కృషి చేస్తోంది. వ్యభిచారాన్ని'కమర్షియల్ రేప్'గా పిలుస్తున్న 'అప్నే ఆప్' బాధితులకు సంబంధించి విద్య, ఆరోగ్య సంరక్షణ, లైఫ్ స్కిల్స్, చట్టపరమైన రక్షణ, ప్రభుత్వ పథకాలు... మొదలైన వాటిపై దృష్టి పెట్టింది.

ఇప్పటివరకు ఇరవై రెండు వేలమందికి పైగా మహిళలు, బాలికలను వ్యభిచార కూపాల నుంచి బయటికి తీసుకురావడంలో సహాయపడిన రుచిర ఎంతోమంది అమ్మాయిలు చదువుకునేలా చూసింది. సొంత కాళ్ల మీద నిలబడేలా చేసింది.

దేశ, విదేశాలకు చెందిన ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డ్‌లు అందుకుంది రుచిరా గుప్తా. అయితే వాటి కంటే కూడా చీకటి కూపం నుంచి బయటికి వచ్చిన బాధితుల కంట్లో కనిపించే వెలుగే తనకు అతి పెద్ద అవార్డ్‌గా భావిస్తానంటుంది రుచిర.

---

ఇంటిప్స్

**బూట్ల** నుంచి దుర్వాసన రావడానికి ప్రధాన కారణం చెమటతో తడిసిన సాక్స్‌ను అలాగే ఉంచడం, తడీపొడిగా ఉన్న సాక్స్‌ను అలాగే ధరించడం. అందువల్ల సాక్స్ తడిగా కాకుండా చూసుకోవాలి. ● బూట్లను ఉపయోగించిన తర్వాత గాలి ఆడేటట్లు బైట పెట్టాలి. సాక్స్‌ను ఎప్పటికప్పుడు ఉతికేసి ఆరేయాలి. కానీ కొందరు వారం రోజుల పాటు ఒకేజత సాక్స్ లను ధరిస్తారు. దీంతో బూట్లనుంచి భరించలేని దుర్వాసన వస్తుంది. ● ముఖ్యంగా బైటకు రాగానే సాక్స్ తీసి పక్కన పెట్టాలి. షూ లేస్‌ను కూడా ఉతికి ఎప్పటికప్పుడు క్లీన్‌గా ఉంచుకోవాలి. వారానికి ఒకసారి షూస్‌ను కూడా శుభ్రంగా కడిగేసుకోవాలి. ఇలా చేస్తే బ్యాక్టీరియా, వైరస్ ఉండవు. ● నిమ్మకాయ తొక్క లేదా కమలా, నారింజ తొక్కల వంటివి బూట్లలో వేస్తే వాటినుంచి చెడువాసన రాదు. అందుకే రాత్రిపూట కొన్ని నిమ్మ/ నారింజ/ కమలా తొక్కలను బూట్లలో వేసి పొద్దున్నే తీసేయాలి. ఇలా చేస్తుంటే బూట్ల నుంచి దుర్వాసన అనేది ఉండదు. ● తడిగా ఉన్న బూట్లలో బేకింగ్ సోడా వేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇది బూట్లలోని తేమను గ్రహించుకుంటుంది. అందుకే షూస్ వాసన వచ్చినప్పుడు బేకింగ్ సోడా వేస్తుండాలి. కొన్నిరకాల డస్టింగ్ పౌడర్‌లు వేసినా దుర్వాసన రాకుండా ఉంటుంది.



---

టిప్



### బఠాణీతొక్క కూడానూ..

పచ్చిబఠాణీ మనకు ఎంతమేలు చేస్తుందో తెలిసిందే. అయితే బఠాణీ పిక్కలు తీసి తొక్కలను పారేస్తుంటాము. కానీ ఈ తొక్కలు మొక్కలు చక్కని పోషకాలు అందిస్తాయి. అందుకే తొక్కలను మిక్సీజార్‌లో వేసి పేస్టు చేయాలి. ఈ పేస్టులో కాసిన్ని నీళ్లు పోసి వడగట్టాలి. ఈ నీటిని గార్డెన్‌లోని మొక్కలకు పోయాలి. ఈ నీరు మొక్కలు మంచి బలవర్ధకమైన టానిక్‌లా పనిచేసి చక్కగా పెరిగేందుకు దోహదపడతాయి.

---

స్ఫూర్తి

సైన్స్‌ను సామాన్యుల దగ్గరికి తీసుకుపోవడానికి 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి ఫాల్కి. 'సైంటిఫిక్ స్టోరీ టెల్లర్'గా దేశవిదేశాల్లో పేరు తెచ్చుకున్న జాహ్నవి సైన్స్‌కు సంబంధించిన డాక్యుమెంటరీలు తీసింది. పుస్తకాలు రాసింది.

# జాహ్నవి సామాన్య శాస్త్రం



జాహ్నవి ఫాల్కి

'మెనూ గురించి తెలుసుకోవాలంటే మనం మొదట ఉండాల్సింది టేబుల్ దగ్గర' అంటున్న జాహ్నవి 'సైన్స్' అనే మెనూ గురించి తెలుసుకోవడానికి 'సైన్స్ గ్యాలరీ' అనే టేబుల్ దగ్గరికి ప్రజలను తీసుకువస్తుంది.

లండన్‌లోని కింగ్స్ కాలేజీ ఫ్యాకల్టీగా పనిచేసిన జాహ్నవి 2018లో 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ఫౌండింగ్ మెంబర్‌గా నియమితురాలైంది.

ఉరుకుల పరుగుల పోటీ ప్రపంచానికి కాస్త దూరంగా... సృజనాత్మకంగా ఆలోచించేలా, సైన్స్‌కు దగ్గరయ్యేలా యువతను ఆకట్టుకోవడానికి 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి.

'మ్యూజియం' వాతావరణం ఆమెకు కొత్త కాదు. 'సైన్స్ మ్యూజియం లండన్' ఎక్స్‌టర్నల్ క్యురేటర్‌గా పనిచేసి ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది.

'మా టార్గెట్ ఆడియెన్స్ పదిహేనేళ్ల పైబడిన వారు అయినప్పటికీ అండర్ గ్రాడ్యుయేట్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లపై కూడా దృష్టి సారిస్తాం. అంతరిక్షానికి సంబంధించి సమకాలీన, భవిష్యత్ విషయాలపై దృష్టి పెట్టేలా గ్యాలరీ తోడ్పడుతుంది' అంటుంది జాహ్నవి.

శాస్త్రీయ విషయాలతో యువత మమేకం కావడానికి డిజిటల్ ఎగ్జిబిషన్ ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి. 'బ్రేకింగ్ ది వాల్స్ బిట్వీన్ సైన్స్ అండ్ కల్చర్' శీర్షికతో నిర్వహించిన ఆన్‌లైన్ సైన్స్ గ్యాలరీకి కూడా మంచి స్పందన వచ్చింది.

ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ జాహ్నవిని హ్యుమానిటీస్ విభాగంలో 'ఇన్ఫోసిస్ ప్రైజ్'తో సత్కరించింది.

సైన్స్‌ను జాహ్నవి అర్థం చేసుకున్న కోణాన్ని, చేపడుతున్న కార్యక్రమాలను ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ప్రశంసించింది.

'అడగడం' 'తెలుసుకోవడం' అనే ప్రక్రియ జాహ్నవికి ఎంతో ఇష్టమైనది. ఆమెకు బాగా నచ్చే మాట... రైట్ క్వశ్చన్. రిసెర్చ్ వర్క్ నుంచి కెరీర్‌కు సంబంధించి డైరెక్షన్‌ను మార్చుకోవడం వరకు 'రైట్ క్వశ్చన్' అనేది ఆమెకు ఎంతో ఉపయోగపడింది. అమెరికాలోని జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరకు తీసుకెళ్లింది. అక్కడ భారతదేశ శాస్త్ర సాంకేతిక చరిత్రను అధ్యయనం చేసింది.

ఆ చరిత్రపై బాగా ఇష్టాన్ని పెంచుకుంది.

తాను తెలుసుకున్న విషయాలను, తన అభిప్రాయాలను నలుగురితో పంచుకోవడానికి వివిధ మాధ్యమాలను ఎంచుకుంది.

'బాంబే యూనివర్శిటీ'లో సివిక్స్ అండ్ పాలిటిక్స్ చదువుకున్న జాహ్నవి 'జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో సైన్స్ అండ్ టెక్నాలజీ హిస్టరీలో డాక్టరేట్ చేసింది. సామాజిక శాస్త్రాల అధ్యయనం ద్వారా సామాజిక కోణంలో సైన్స్‌ను అర్థం చేసుకుంది.

ఆమె మాటల్లోనే చెప్పాలంటే 'సైన్స్ అనేది ఒంటరి కాదు'

సైన్స్‌ను ప్రభావితం చేసే అంశాలు సమాజంలో ఎన్నో ఉంటాయి. ఆ అంశాలకు సైన్స్‌కు మధ్య ఉండే అంతః సంబంధాన్ని లోతుగా అధ్యయనం చేసింది.

'ఆటోమిక్ స్టేట్: బిగ్ సైన్స్ ఇన్ ట్వంటీయత్ సెంచరీ ఇండియా సైన్స్' పుస్తకం జాహ్నవికి ఎంతో పేరు తెచ్చింది. 'కీ కాన్సెప్ట్స్ ఇన్ మోడ్రన్ ఇండియన్ స్టడీస్'కు కో–ఎడిటర్‌గా వ్యవహరించింది. 'సైక్లోట్రాన్' పేరుతో సైన్స్ డాక్యుమెంటరీ తీసింది. సైంటిఫిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ ద్వారా కథలు చెప్పడం తనకు ఇష్టమైన పని.

---

● నీటి పంట

# షెల్ఫ్‌లో పండిద్దాం



శరవణన్



శరవణన్ తాత సేంద్రియ సేద్యం చేశాడు, తండ్రి కెమికల్ ఫార్మింగ్ వెంట పరుగెత్తి దిగుబడి పెంచాడు. ఆ పరుగునే వారసత్వంగా అందుకున్న శరవణన్ కూడా 2006 వరకు కొనసాగించాడు. ఆ తర్వాత అతడు తన జీవితానికి తానే పరిశోధకుడయ్యాడు. పంట పొలం నుంచి ఇంటి అల్మరాల వరకు సాగిన ప్రయోగాల్లో మొక్కజొన్నను ఇంటిలోపల అరల్లో నీటితో పండిస్తున్నాడు. శరవణన్ ప్రయోగాలకు మెచ్చిన శాస్త్రీయమైన శాస్త్రవేత్తల సమాఖ్య ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అతడిని 'ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డ్'తో సత్కరించింది. శరవణన్ గురించి ఇంకా తెలుసుకోవాలంటే తమిళనాడు, నమక్కల్ జిల్లాలోని 'అరియగౌండమ్ పట్టి' బాట పట్టాల్సిందే.





**మట్టిలేని పంట**

అది 2005, ప్రభుత్వం వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు చేపడుతూ మైక్రో ఇరిగేషన్ విధానాన్ని తెచ్చింది. డ్రిప్, స్ప్రింక్లర్ సాగును పరిచయం చేసింది. అందుకు అవసరమైన పరికరాలను రాయితీతో ఇచ్చింది. అప్పుడు ఓ తొలి అడుగు వేశాడు శరవణన్. అది తనను గేమ్ చేంజర్‌గా మారుస్తుందని ఊహించలేదతడు. ప్రయోగాత్మకంగా ఆచరణలో పెట్టాలనే ఆలోచన అలా ఉండగానే అతడు అప్పటి వరకు సాగు చేస్తున్న రసాయన ఎరువుల పంటను అంతు చిక్కని తెగులు తినేసింది. కృషి విజ్ఞానకేంద్రాల శిక్షణతో కొత్తపంథాలో నడిచాడతడు. వర్మీ కంపోస్ట్, పంచగవ్య, వేపచెక్క వంటి ప్రయోగాలన్నీ చేశాడు. ఆరు ఎకరాల పొలంలో పసుపు, వేరు శనగ, కూరగాయలు పండించాడు. వీటితో పాటు ఆక్వాకల్చర్, పాడి, కోళ్ల పరిశ్రమ, బయోగ్యాస్ ప్లాంట్‌లను కూడా నిర్వహించాడు. ఒక వ్యర్థాలు మరొక పంటకు ఎరువుగా మారే విధానాలన్నింటినీ ఏర్పాటు చేశాడు. తనకైతే వ్యవసాయ భూమి ఉంది కాబట్టి పాడి పశువులకు కావలసిన గడ్డికి సమస్య లేదు. పొలం లేని వాళ్లు పాడిపరిశ్రమ మీద ఉపాధి పొందేవారి కోసం ఓ ప్రత్యామ్నాయం ఉండాలనుకున్నాడు. ఆ ప్రయోగంలో భాగంగా హైడ్రోఫోనిక్ కల్చర్ మొదలు పెట్టారు. అంటే నీటితో పంటలు పండించే విధానం అన్నమాట. హైడ్రోఫోనిక్ కల్చర్‌లో కూరగాయలు పండించుకునే వాళ్లు సంబంధిత సామగ్రిని ఇంటి పైకప్పు మీద ఏర్పాటు చేసుకుంటూ ఉంటారు. శరవణన్ అదే ప్రయత్నాన్ని మొక్కజొన్న పంటను ఒక అల్మైరాలో చేసి చూపించాడు. శరవణన్ ప్రయోగాన్ని రైతులకు మోడల్‌గా చూపించింది కృషి విజ్ఞాన్ కేంద్రం. షెల్ఫ్ అరల్లో దశలవారీగా మొక్కజొన్న గింజలను వేస్తూ ఏడాదంతా పాడి పశువులకు పచ్చిగడ్డి అందేలా రూపొందించాడు. రైతులకు సౌకర్యంగా ఉండేటట్లు ఒక కిట్‌ను రూపొందించాడు. అర కేజీ మొక్కజొన్న గింజలతో ఐదుకేజీల గడ్డిని వారం రోజుల్లో సాధించవచ్చు. ఎనిమిదవ రోజు ఆ అరను ఖాళీ చేసి మళ్లీ కొత్తగింజలను వేసుకోవచ్చన్న మాట. ఇంట్లో నాలుగు షెల్ఫ్‌లుంటే చాలు రెండు పాడిగేదెల కడుపు నింపే మేత చేతికొస్తుంది.

విజయవంతమైన ప్రయోగాలు చేయాలంటే పెద్ద పెద్ద చదువులు చదివి ఉండాల్సిన అవసరం లేదు, ఆసక్తి, నిరంతర శ్రమ ఉంటే సాధించవచ్చని నిరూపించాడు శరవణన్. అతడు రైతులకు మార్గదర్శనం చేయడంతోపాటు వ్యవసాయ విద్యార్థులకు పాఠ్యాంశం అవుతున్నాడు.